# మహాభారతం

## కర్ణుని జీవిత విశేషాలు

32

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716



(గత సంచిక తరువాయి)

### 1) కర్ణుని జననం

(అరణ్య ప.303-308 అ)

యదువంశ శ్రేష్ఠుడు వసుదేవుని తండ్రి శూరసేనుడు. అతడికి ప్రథమ సంతానంగా 'పృథ' జన్మించింది. తన మేనత్త కుమారుడు, ప్రాణస్నేహితుడు అయిన కుంతి భోజమహారాజుకు సంతానం లేక పోవటంతో, అతడు కోరగా శూరసేన మహారాజు తన కుమార్తె పృథను పెంచుకొనుటకు ఇచ్చెను. అందువల్ల ఆమెను కుంతి యను పేరుతో పిలుచుకున్నారు. ఈ కుంతీ కన్య కుంతిభోజుని ఇంటిలో పెరుగుతున్న సమయంలో. ఒకరోజున తపశ్శక్తి సంపన్నుడూ, త్రికాలవేది, ముక్కోపి ఐన దుర్వాసుడు రాగా, మహారాజు ఎదురేగి ఆహ్వానించి ఉన్నతాసనంపై కూర్చుండజేశాడు. మహర్షి కొంతకాలం మహారాజు ఇంట ఉండాలనే నిర్ణయాన్ని తెలియజేశాడు. మహరాజు ఆ మహర్షికి ఏ లోటూ లేకుండా సేవలు చేయుటకు తన కుమార్తె కుంతిని నియోగించాడు. ఉగ్రస్వభావుడైన ఆ మహర్షికి కుంతి ఎంతో సహనంతో, శాంతంతో సేవలు చేసి నది. అలా ఒక సంవత్సరంపాటు ఏ లోపం లేకుండా తనకు సేవలు చేసిన కుంతీ సహనానికి మెచ్చుకున్న మహర్షి, "కళ్యాణీ! నీ సేవలకు ప్రసన్నుడనయ్యాను. అన్యులకు దుర్లభమైన వరమునొకదానిని కోరుకో" అన్నాడు. దానికి కుంతి సమాధానమిస్తూ 'మహాత్మా! నా సేవలకు మీరు, నా తండ్రి ప్రసన్నులయ్యారు. దీనితో నా కోరికలన్నీ సిద్ధించినట్లే. ఇంక నాకు ఏ కోరికా లేదు' అన్నది. ఆ మాటకు ఎంతో సంతోషించిన మహర్షి భవిష్యత్తులో ఆమెకు కలుగబోయే సంతానం ప్రతిబంధకమును తన దివ్యదృష్టి చేత గ్రహించి, ఆమె కొక మంత్రాన్ని ఉపదేశించి, 'అమ్మా! ఈ మంత్రముతో ఏ దేవతను ఆహ్వానిస్తే ఆ దేవత నీ ఎదుట ప్రత్యక్షమై, నీ అధీనమై, నీకు పుత్రుని ప్రసాదిస్తాడు' అన్నాడు. దుర్వాసుడు అధర్వణ వేదంలోని ఉపనిషత్తులో గల ప్రసిద్ధమైన మంత్రాన్ని ఉపదేశించాడు.


మహర్షి వెళ్ళిపోయిన తరువాత, కుంతీ ఒకనాడు బాల్య చాపల్యం వల్ల మంత్రమహిమను పరీక్షించాలని భావించి, ఎదురుగా కనిపిస్తున్న సూర్య భగవానుని ఆహ్వానిస్తూ మంత్రాన్ని ఉచ్చరించింది. ఆ మంత్ర ప్రభావంతో సూర్య భగవానుడు తన యోగశక్తితో రెండు రూపాలను ధరించి, ఒక రూపంతో కుంతి ఎదుటకు రాగా, మరొక రూపంతో ఆకాశంలో ప్రజ్వలిస్తూ ఉన్నాడు. తన ఎదుట ప్రత్యక్షమైన సూర్యదేవుని చూచి కుంతీ, 'దేవా! మంత్రశక్తిని పరీక్షించాలనే కుతూహలంతో మిమ్ము ఆహ్వానించాను. నా తప్పు క్షమించి మీరు ఎక్కడినుండి వచ్చారో అక్కడికి వెళ్ళండి. నేను అపరాధిని' అని వేడుకొన్నది. అందుకు సూర్యభగవానుడు 'కుంతీ! నీవు నన్ను ఆహ్వానించావు, నా దర్శనం అమోఘం నా వలన నీకొక తేజస్వంతుడైన పుత్రుడు కలగాలి. నీవు నా మాటను తిరస్కరించినచో నిన్ను, నీ తండ్రిని, నీకు ఈ మంత్రాన్ని ఉపదేశించిన ఋషిని భస్మం చేస్తాను' అన్నాడు. దానిపై కుంతీ, 'మహానుభావా! నేను బాలికను. బాల్య చాపల్యంతో చేసిన అపరాధం కనుక క్షమించు' అని అనేక విధాల ప్రార్థించింది. 'నీవు బాలికవు గనుకనే ఇంతగా అనునయించి చెబుతున్నాను. నీ కన్యాత్వానికి భంగం లేకుండా నీకు పుత్రుని అనుగ్రహిస్తాను' అని సూర్య భగవానుడు తన యోగశక్తితో ఆమెలో ప్రవేశించి వీర్యస్థాపన గావించి ఆమెకు గర్భాదానం గావించి" నీకు ఆ మృతమయమైన సహజ కవచకుండలాలతో తేజో వంతుడైన పరాక్రమశాలి పుత్రుడుగా జన్మిస్తాడు' అని వరమిచ్చి అంతర్ధానమయ్యాడు.

కుంతీదేవి గర్భం ధరించింది. సోదరబాంధవుల భయంతో ఎంతో రహస్యంగా గర్భాన్ని దాచి, కన్యాంతఃపురంలో

ఉంటున్నది. అత్యంత సన్నిహితురాలైన ఒక దాదికి తప్ప ఇంక ఎవ్వరికీ గర్భం విషయం తెలియదు. పదియవ మాసంలో పుత్రుడు జన్మించాడు. సూర్యవరప్రసాదంతో కుంతీదేవి తిరిగి కన్యాత్వాన్ని పొందింది.

కర్ణుడు కవచకుండలములతో జన్మించిన విషయాన్ని అంగీకరించలేక కొందరు విమర్శకులు ఇది ఎలా సాధ్యం? గర్భగోళంలో కవచ కుండలాలతో పిండం ఎలా పెరుగుతుంది? పుట్టినపుడు కవచకుండలాలు ఎలా ఉంటాయి? శరీరాన్ని కవచం కప్పి ఉంచితే శరీర పోషణ ఎలా జరుగుతుంది? అన్ని ప్రశ్నించి, బహుశా శరీరంపై బలిష్టమైన చర్మం అయి ఉండవచ్చు' అని సమాధానం చెప్పి తృప్తి చెందారు.

భగవంతుని అఘటన ఘటనాశక్తిని నమ్మలేని వారికి ఇలా సందేహాలు వస్తూనే ఉంటాయి. భగవంతుని మనలాగానే పరిమితమైన శక్తి గలవానిగా భావించి ఇలాంటి విమర్శలు చేస్తుంటారు.



కొబ్బరిచెట్టుకు కొబ్బరిబోండాం కాస్తుంది. దానిలోపల కొబ్బరికాయ ఆ లోపల కొబ్బరి, ఆ కొబ్బరిని అంటుకొని గట్టి పెంకు. ఆ పెంకుచేత కప్పబడియే దాని పెరుగుదల. అందులో నీరు ఎలా వస్తున్నదో; కొబ్బరికాయ వగులగొట్టిన తర్వాత కొబ్బరి నుండి ఆ పెంకును విడదీయవచ్చును. ఇదంతా ఎలా జరుగుతున్నదనే సందేహం రాదు వీరికి. కాని ఇక్కడ మాత్రం సందేహం. గోళ్ళు శరీరంతో పాటే పెరుగుతూ, వేరుచేసినా శరీరానికి ఏబాధా లేకుండా ఉంటుంది కదా! మరి ఈ సహజకవచాన్ని ఎందుకు సందేహిస్తున్నారు?

అంతేకాదు. అది కవచమే కానిచో దానిని కోసి ఇంద్రుడికివ్వటం ఎలా కుదురుతుంది? బలిష్టమైన చర్మమే అయితే కోసి ఇవ్వటం కుదురుతుందా? కనుక అది కవచమే.

## 2) శిశువును విడిచిపెట్టిన విధం:

**(అరణ్య 308అ 6-27శ్లో)**

శిశువు జన్మించగానే దాదితో ఆలోచించి ఒక పెట్టెను తెప్పించి, నీరు లోపలికి రాకుండా అన్ని వైపుల మైనం పూసి, మెత్తని శయ్య నేర్పాటు చేసి, శిశువును పదిలంగాపరుండబెట్టింది. కన్యగా గర్భధారణ చేసి బిడ్డను కనటంలోక విరుద్ధం గనుక పుత్రప్రేమను చంపుకొని, హృదయవిదారకంగా రోదిస్తూ ఆ పెట్టెను అశ్వనదిలో విడిచిపెట్టింది. ఆ పెట్టె మీద లతలతో రక్షాబంధముచేసి, సింధూరంతో అద్దిన తన చేతులను పెట్టేపై అద్దింది. పెట్టెను బరువెక్కిన హృదయంతో విడిచిపెడుతూ శిశురక్షణకై ఇలా అన్నది.

"కుమారా! పృథివీ, జల, అంతరిక్షములలో ఉండే సమస్త భూతముల వల్ల నీకు స్వస్తియగుకాక! మార్గములన్నీ మంగళప్రదమగుగాక! నీకు ఎవ్వరూ హాని చేయకుందురు గాక! నీ మార్గంలో ఎవ్వరు ఎదురైనా వారికి నీ పట్ల ద్రోహ చింతన కలుగకుండాగాక! జలమందు గల జలాధిదేవత వరుణుడు, అంతరిక్షంలో ఉండే వాయుదేవుడు నిన్ను రక్షించుగాక! దివ్య విధానంతో నీవు ఎవని వల్ల నా గర్భంలో ప్రవేశించావో ఆ నీ తండ్రియైన సూర్యభగవానుడు నిన్ను అన్ని విధాల రక్షించు గాక! సర్వకాల సర్వావస్థలయందు నిన్ను దేవతలంతా రక్షించు గాక! తండ్రీ! నీవు ఏ దేశంలో ఉన్నప్పటికీ నీ కవచాన్ని బట్టి నేను గుర్తించగలను. నిన్ను పుత్రునిగా గ్రహించి, పెంచి పోషించే తల్లిదండ్రులు ధన్యాత్ములు. నీకు స్తన్యమిచ్చి నీ ఆకలి తీర్చే స్త్రీ ధన్యాత్మురాలు' అంటూ అర్ధరాత్రి సమయంలో అశ్వనదీ జలాలలో ఆ పెట్టెను వదలి శోకార్తయై తన భవనము నకు తిరిగి వెళ్ళింది కుంతి. ఇలా బిడ్డను విడిచిపెట్టుట సూర్యోపదేశంతోనే అని కర్ణుడే శ్రీకృష్ణునితో తెలియజేయటం జరిగింది.

కుంతి చేత అలా విడువబడిన మంజూష (పెట్టె) అశ్వనది నుండి ప్రవాహాన్ని అనుసరించి చర్మణ్వతీ నదిలోనికి ప్రవేశించి, అక్కడినుండి యమునా నదిలోనికి దానినుండి గంగా నదిలోనికి ప్రవేశించింది. గంగానదిలో అలా ప్రయాణిస్తూ సూతుని నివాసస్థానమైన చంపాపుర ప్రాంతాన్ని చేరింది. ఇంతవరకు ఆ పెట్టెలో నున్న శిశువును అమృతమ యమైన కవచ కుండలములు కాపాడుతున్నాయి.

## 3) కర్ణుడు సూతకులమును చేరిన విధము:

**అరణ్య309 అ 1-15శ్లో)**

ఆ సమయంలో ధృతరాష్ట్రుని సఖుడు, సారధియైన అతిరథుడు తన భార్యతో కలసి స్నానార్థమై గంగానదికి వచ్చి

సూక్తిమాలిక | పరనిందలు, పరదూషణలు మన జీవితాన్ని అధోగతిపాలు చేస్తాయి.

యుండెను. అతడి భార్యపేరు రాధ. వారికి సంతాతనం లేదు. ఆ రాధ సంతానం కోసం దేవతలనారాధిస్తూ వ్రతాలతో కాలం గడుపుతూ ఉన్నది. ఆమె తన పుణ్యవిశేషంగా గంగా తరంగముల ద్వారా తన సమీపమునకు వచ్చిన పెట్టెను చూచింది. దానిపై గల రక్షాబంధములను, సిందూర చిహ్నములను చూచి కుతూహలంతో భర్తకు చెప్పింది. అతిరధుడు ఆ పెట్టెను ప్రవాహం నుండి ఒడ్డుకు తెప్పించి, యంత్రముల సాయంతో దాని మూతనుతెరిచి, అందున్న బాలసూర్యసమానుడు, సువర్ణకవచకుండలాలతో శోభిస్తున్న బాలుణ్ణి చూచి ఆశ్చర్యపడి, ఆ బాలుని లేవనెత్తి తొడపై కూర్చుండ బెట్టుకొని భార్యతో ఇలా అన్నాడు, "రాధా! నేను పుట్టినప్పటినుండి ఇంతవరకు ఇంతటి అద్భుత బాలకుణ్ణి చూచి యుండలేదు. ఇతడెవరో దేవబాలుడై యుండవచ్చునని నా భావన మన భాగ్యవశమున మనకు లభించాడు. సంతానం లేని నాకు దేవతలు దయతో ఈ పుత్రుని ప్రసాదించారు. ఇది నిజం అంటూ ఆ బాలుణ్ణి భార్య రాధచేతికందించాడు. ఆమె దివ్య కాంతితో ప్రకాశించే శోభాశాలి, దివ్యరూప సంపన్నుడైన ఆ దివ్యబాలుని తన చేతికి తీసుకున్నది. దైవప్రేరణ చేతనే ఆ సమయంలో రాధస్థనములనుండి పాలు జాలు వారినవి. వారాబాలుని ఎంతో వాత్సల్యంతో పెంచుకుంటున్నారు. అతడు క్రమక్రమంగా దినదినాభివృద్ధి చెందుతూ పెద్ద వాడౌతున్నాడు. ఆ తరువాత సూతదంపతులకు అనేకమంది పుత్రులు కలిగారు. ఆ బాలుడు సువర్ణమయమైన కవచ కుండలాలలను కలిగియున్నాడు గనుక బ్రాహ్మణులు అతడికి 'వసుషేణుడు' అని పేరు పెట్టారు. అలా ఆ బాలుడు అంగదేశంలో సూతపుత్రత్వం పొంది పెరుగుతున్నాడు.

కుంతీదేవి గూఢచారులను ఆ పెట్టె వెంట పంపింది. వారు ఆ బాలుణ్ణి సూతుడైన అతిరధుడు తీసుకొనుట చూచి ఆ విషయాన్ని కుంతికి తెలియజేశారు. కుంతి ఆ బాలుని యోగక్షేమాలను రహస్యంగా తెలుసుకుంటూ ఉన్నది.

### 4) కర్ణుని విద్యాభ్యాసము, దుర్యోధన సఖ్యము

**(అరణ్య 309 అ, 16-21శ్లో)**

అతిరధుడు తన పుత్రుడు విద్యాభ్యాసానికి తగిన వయస్సు రాగానే అతణ్ణి హస్తినాపురం పంపించాడు. అతడు కృపాచార్య, ద్రోణాచార్యుల వద్ద ధనుర్విద్యాభ్యాసము చేస్తున్నాడు. ఈ కారణం చేత అతడికి దుర్యోధనునితో స్నేహం కుదిరింది. అతడు కృపాచార్య ద్రోణాచార్యుల వద్దనే గాక పరశురాముని వద్ద కూడా అస్త్రవిద్యలను నేర్చుకొని జగత్తులో మహాధనుర్ధరుడని విఖ్యాతి బడసెను. ధృతరాష్ట్రపుత్రుడు దుర్యోధనునితో కలిసి పాండవులయందు ద్రోహబుద్ధిని కలిగి యుండి, మహాత్ముడైన అర్జునునితో యుద్ధం చేయాలనే కోరికను ఎల్లప్పుడూ వ్యక్త చేస్తూ ఉండేవాడు. ఎప్పుడు ఎదురుపడినా అతడికి అర్జునుని యందు స్పర్ధం ఉండేది. అలాగే సూతపుత్రుని చూచినపుడల్లా అర్జునునికి కూడా అతనియందు స్పర్ధ ఉండేది.

కుంతీగర్భమందు సుర్యుని ద్వారా జన్మించిన కర్ణుడు ఇలా సూతకులాన్ని చేరి ఈ విధంగా ప్రవర్తించటం సూర్య దేవుని గుప్త సంకల్పమే ననుటలో సందేహం లేదు.

### 5) కర్ణుడు ద్రోణాచార్యుని విడిచిపెట్టి పరశురాముని వద్దకు చేరుట:

**(శాంతి 2 అ 4-14 శ్లో)**

మహాభారత యుద్ధం జరిగిన తరువాత నారదుడు ధర్మరాజుకు కర్ణుని వృత్తాంతాన్ని తెలియజేస్తూ ఇలా అన్నాడు. ధర్మనందనా! క్షత్రియజాతి యుద్ధపూర్వకంగా శస్త్రమరణం ద్వారా స్వర్గం చేరుటకుగాను సూర్యునివల్ల కుంతిద్వారా పుత్రుడు జన్మించడం జరిగింది. ఆ తేజస్వి శూత పుత్రుడుగా ప్రసిద్ధిచెందాడు. అతడు ద్రోణాచార్యునివద్ద ధనుర్వేదాన్ని అభ్యసించాడు.

శ్లో॥ సబలం భీమసేనస్య ఫాల్గునస్యచ లాఘవం।
బుద్ధించ తవరాజేంద్ర యమయోర్వినయం తథా॥
**(శాంతి 2 అ. 6 శ్లో)**

శ్లో॥ సఖ్యంచ వాసుదేవేన బాల్యేగాండీవ ధ్వన్వనః।
ప్రజా నామనురాగంచ చింతయానో వ్యదహ్యత॥
**(శాంతి 2 అ. 7 శ్లో)**

తా॥ రాజేంద్రా! అతడు భీమసేనుని బలానికి, అర్జునుని పరాక్రమానికి, నీ ధర్మబుద్ధికి, నకుల సహదేవుల వినయానికి, గాండీవధారి అర్జునునకు శ్రీకృష్ణునితో బాల్యంనుండి గల స్నేహానికి, పాండవులపై ప్రజలకుగల అనురాగానికి చింతాక్రాంతుడై దహించుకుపోతుండేవాడు.

శ్లో॥ స సఖ్య మకరోద్ బాల్యే రాజా దుర్యోధనేనచ
యుష్మాభిర్నిత్య సంధిష్టో దైవాచ్చాపి స్వభావతః॥
**(శాంతి 2 అ. 8 శ్లో)**

తా॥ ఈ కారణం చేతనే అతడు బాల్యమునుండియే దుర్యోధనునితో స్నేహాన్ని గట్టిచేసుకుంటూ దైవప్రేరణచేత, అతడి స్వభావం చేత కూడా మీతో ఎల్లప్పుడూ ద్వేషంతో వ్యవహరిస్తూ ఉండేవాడు. కర్ణుని దుష్టబుద్ధికి ఇదొక నిదర్శనం.

ధనుర్వేదంలో అత్యంత ప్రావీణ్యత సాధించిన అర్జునుని చూసి కర్ణుడు, ఒకనాడు ఏకాంతంలో ద్రోణాచార్యుని సమీపించి ఇలా అన్నాడు "గురుదేవా! నేను బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగ ఉపసంహారాలతో మీవద్ద నేర్చుకోవాలను కుంటున్నాను. అర్జునునితో యుద్ధం చేయాలనే కోరిక నాకున్నది. మీరు పుత్రునియందు, శిష్యునియందు సమానమైన ప్రేమగలవారు. నేను బ్రహ్మాస్త్రాన్ని తెలియని వాడనని లోకులు నన్ను అనకుండా నాపై దయచూపండి" అన్నాడు. ఇది విని అర్జునునియందు అత్యంత ప్రీతి గలిగిన ద్రోణాచార్యుడు కర్ణుని దుష్టత్వాన్ని గ్రహించి ఇలా అన్నాడు, "వత్సా! బ్రహ్మచర్య వ్రతాచరణగల బ్రాహ్మణునకు, తపస్సుచేసిన క్షత్రియునకు తప్ప ఇతరులకు బ్రహ్మాస్త్రాన్ని ఉపదేశించరాదు" అది విన్న కర్ణుడు అంగిరస శ్రేష్ఠ బ్రాహ్మణుడైన గురువు ద్రోణాచార్యునకు నమస్కరించి సెలవు తీసుకొని పరశురాముని ఆశ్రయించు టకు మహేంద్ర పర్వతము వద్దకు వెళ్ళెను.

### (6) అబద్ధమాడి పరశురామునివద్ద అస్త్రవిద్యాభ్యాసము చేయుట : (శాంతి 2 అ 15-18 శ్లో)

కర్ణుడు మహేంద్ర పర్వతముపైనున్న పరశురామునివద్ద కెళ్లి ఆయనకు సాష్టాంగ నమస్కారము చేయగా, ఆ మహాత్ముడు కుశల ప్రశ్నలు వేస్తూ కుల గోత్రాలను అడుగగా "నేను బ్రాహ్మణుడను, భృగువంశ సంజాతుడను" అని కర్ణుడు చెప్పెను. (ఇలా చెప్పుటలో కర్ణుని ఉద్దేశము ఏమంటే గురువు తండ్రితో సమానం గనుక ఆ పరశురాముని కులగోత్రములే తనవి అనే భావనతో చెప్పి ఉండవచ్చు). అది విని పరశు రాముడు 'వత్సా! నీకు స్వాగతం' అని పలికి కర్ణునియందు అధికమైన ప్రీతిని కలిగియుండెను.

ఆ మహేంద్రగిరిపై కర్ణునకు గంధర్వ, యక్ష, రాక్షసులతోను, దేవతలతోనూ సమాగమము జరుగుచుండెను. పరశురాముని నుండి విధిపూర్వకముగా ధనుర్వేదాన్ని నేర్చుకొని కర్ణుడు తీవ్రమైన అభ్యాసము చేయుచుండెను. ఆవిధంగా అతడు దేవతలకు, దానవులకు, రాక్షసులకు ప్రీతిపాత్రుడయ్యాడు.

### (7) కర్ణునకు బ్రాహ్మణ శాపప్రాప్తి :

(శాంతి 2 అ 19-29 శ్లో)

ఒకసారి సూర్యపుత్రుడు కర్ణుడు ధనస్సు, బాణాలు, ఖడ్గమును ధరించి దక్షిణ సముద్రతీరంలో ఆశ్రమప్రాంతంలో ఏకాంతంగా సంచరిస్తున్నాడు. ఆ సమయంలో అగ్నిహోత్ర అనుష్టానపరుడు, వేదాధ్యయన తత్పరుడు అయిన ఒక బ్రాహ్మణుని హోమధేనువు అక్కడ తిరుగాడుచున్నది. అది గమనించక కర్ణుడు బాణ ప్రయోగంతో దానిని వధించాడు. తెలియక చేసితినని, నా అపరాధమును క్షమించమని, నాపై దయచూపమని ఆ బ్రాహ్మణుని పదే పదే ప్రార్థించాడు కర్ణుడు. కాని ఆ బ్రాహ్మణోత్తముడు తీవ్రమైన కోపంతో "ఓ దురాచారీ! నీవు వధ్యుడవు. ఈ పాప ఫలాన్ని నీవు అనుభవించక తప్పదు. ఓ దుర్మతీ! ఎవ్వరిపై నీవు అసూయతో జ్వలించిపోతున్నావో... ఎవ్వరిని పరాభూతుని చేయటానికి ఎల్లప్పుడూ ఈ బాణ ప్రయోగ అభ్యాసం చేస్తున్నావో.. అతడితో నీకు యుద్ధం తటస్థించినప్పుడు నీ రథ చక్రము భూమిలో క్రుంగిపోతుంది. అదే సమయంలో వికల మనస్కుడవైయున్న నీ శిరస్సును నీ శత్రువు ఖండించును. ఇక నీవు వెళ్ళవచ్చు" ఈ గోవత్సము ప్రమత్తుడవైన నీచేత ఎలా వధించబడిందో అదే విధంగా ప్రమత్తుడవైయున్న నిన్ను శిరస్సును ఖండించి నీ శత్రువు నిన్ను వధించును"- అని శపించెను.

ఇలా శపించటంతో కర్ణుడు ఆ బ్రాహ్మణశ్రేష్ఠునకు అనేక గోవులను, ధనాన్ని, రత్నాలను ఇచ్చి ప్రసన్నుని చేసుకొనుటకు ప్రయత్నించాడు. ఆ బ్రాహ్మణుడు కర్ణునితో "ఈ జగత్తు అంతా ఏకమై వచ్చినప్పటికీ ఎవ్వరు కూడా నా పలుకును వమ్ముచేయ జాలరు. నీవు ఇక్కడనుండి వెళ్ళినా సరే, లేదా ఇక్కడే ఉన్నా సరే, లేదా నీవేమి చేయదలచుకుంటావో అది చేసినా సరే, నా వాక్యానికి తిరుగులేదు" అన్నాడు. కర్ణుడు జరిగినది తలచుకొని భయపడుతూ, దీనంతో తలవంచుకొని పరశు రాముడు సమీపమునకు వెళ్ళాడు.

ఇదే విషయాన్ని 17వ రోజు యుద్ధంలో కర్ణుడు తనకు సారథ్యం నెఱపుతున్న శల్యునితో ఇలా చెప్పడం జరిగింది. "నేను ఒకప్పుడు బాణ ప్రయోగ అభ్యాసం చేస్తుండగా విజన ప్రదేశంలో సంచరిస్తున్న ఒక బ్రాహ్మణ శ్రేష్ఠుని హోమ ధేనువును తెలియక బాణంతో కొట్టి వధించాను. అందుకు కోపించిన ఆ బ్రాహ్మణుడు "నీవు ఇలా నా హోమధేనువును

వధించినందుకు ఫలితంగా, భయంకరమైన యుద్ధం జరుగుతుండగా నీ రథ చక్రము భూమిలోనికి కృంగిపోతుంది అని శపించాడు. ఆ శాపాన్ని తలచుకొని భయపడుతున్నాను' అని కర్ణుడు చెప్పడం జరిగింది.

**(8) పరశురామునిద్వారా బ్రహ్మాస్త్ర ప్రదానం - పరశురామ శాపప్రాప్తి : (శాంతి. 3 అ.)**

కర్ణుని యొక్క బాహుబలము, ప్రేమ, ఇంద్రియ నిగ్రహము, గురుసేవకు సంతసించిన పరశురాముడు ప్రయోగ ఉపసంహారములతో సహా విధిపూర్వకముగా కర్ణునకు బ్రహ్మాస్త్రమును ఉపదేశించాడు. ఆ తరువాత కర్ణుడు పరశురాముని ఆశ్రమునందే ఉంటూ ధనుర్వేదమునందు తీవ్రంగా అభ్యాసం చేస్తున్నాడు. ఒకరోజు ఆశ్రమప్రాంతంలో తిరగాడుతూ అలసిపోయిన పరశురాముడు కర్ణుడు తొడపై తలపెట్టి విశ్రమించాడు. ఆ సమయంలో రక్తమాంసాలను ఆహారంగా తీసుకునే ఒక భయంకరమైన కీటకం కర్ణుని తొడను తొలిచి రక్తం త్రాగుతున్నది. గురువుకు నిద్రాభంగమవుతుందనే భయంతో కర్ణుడు దానిని చంపక వదిలిపెట్టాడు. అది తిరిగి తిరిగి అలాగే రక్తం పీలుస్తూ కర్ణుని తొడను తొలుస్తూనే ఉంది. బాధను భరిస్తూ కర్ణుడు మౌనంగా ఉన్నాడు. కొంతసేపటికి రక్తం పరశురాముని శరీరంను తాకడంతో తటాలున లేచి "ఈ రక్తం ఎక్కడిదని" ప్రశ్నించగా ఆ కీటకాన్ని చూపి "ఇది నా తొడను తొలుస్తుంటే మీకు నిద్రాభంగమవుతుందనే భయంతో సహించి ఉన్నానని" తెలియజేశాడు. పరశురాముడు దానివైపు చూడడంతో అది ప్రాణాలు విడిచిపెట్టింది. ఆ సమయంలో నల్లని దేహంతో వికృతాకారంతో ఒక రాక్షసుడు ఆకసంలో కనిపించి పరశురామునికి రెండు చేతులు జోడించి నమస్కరించి "భృగుశ్రేష్ఠా! తమరు నాకీ నరక బాధను తప్పించారు. నేను సత్యయుగంలో 'దంశుడ'ను పేరుగల రాక్షసుడను. భృగుమహర్షి భార్యను అపహరించినందున ఆయన నన్ను శపించటంతో ఈ కీటకంగా భూమిపైకి వచ్చాను. ఆ మహర్షి 'మలమూత్రాలు భక్షించే కీటకంగా మారి నరకయాతనలను అనుభవించమని' నన్ను శపించాడు. నేను అనేక విధాల ప్రార్థించగా, భృగువంశీయుడైన పరశురాముని దృష్టి సోకడంతో నాకీ నరకబాధ తొలగిపోతుందని శాప విమోచనాన్ని అనుగ్రహించాడు. ఇప్పుడు తమ దర్శనంతో శాపవిమోచనమైందని' చెప్పి ఆ రాక్షసుడు అదృశ్యుడయ్యాడు.

ఆ తరువాత పరశురాముడు "అతి దు:ఖకరమైన ఈ పనిని బ్రాహ్మణుడు సహించలేడు. ఇది క్షత్రియుడు చూపగల ధైర్యం. నీవెవరో నిజం చెప్పు" అని కర్ణుని ప్రశ్నించగా, శాపభీతుడైన కర్ణుడు "నేను బ్రాహ్మణుడను కాను, క్షత్రియుడనుకాను శూతుడను, రాధేయుడను కర్ణుడని నన్ను అంటారు. నేను అస్త్రలోభంతో ఇలా ప్రవర్తించాను. నన్ను క్షమించండి. వేద విద్యను బోధించే గురువు తండ్రితో సమానం. అందుకే నేను మీ గోత్రాన్ని భార్గవుణ్ణి అని చెప్పాను" అన్నాడు. దాంతో పరశురాముడు క్రోధతామ్రాక్షుడయ్యాడు. కర్ణుడు గజ గజ వణుకుతూ చేతులు జోడించి నిలబడ్డాడు. అంత పరశురాముడు "ఓరీ మూర్ఖుడా! బ్రహ్మాస్త్రంపై లోభంతో అబద్ధమాడి కపటాచారివయ్యావు. అందువల్ల నీతో సమానుడైన ప్రతియోధుడు సంగ్రామంలో నీ ఎదుటపడనంత వరకు, అలాగే నీకు మృత్యుకాలం సమీపించనంతవరకు మాత్రమే ఈ బ్రహ్మాస్త్రం నీకు స్ఫురణలో ఉంటుంది. (అంటే మృత్యుకాలం ఆసన్నమైతే బ్రహ్మాస్త్రం గుర్తుకు రాదు-అని) బ్రాహ్మణుడు కానివానికి మరణాంతము వరకు బ్రహ్మాస్త్రం నిలువదు. అబద్ధమాడిన నీకు ఇక్కడ స్థానం లేదు వెళ్ళిపో" అన్నాడు. కర్ణుడు దీనవదనంతో తిరిగివచ్చి దుర్యోధనునితో "నేను సకల అస్త్రాలను పొందాను" అన్నాడు. ఈ పరశురామ శాపాన్ని గురించి 17వ. రోజు యుద్ధంలో కర్ణుడు తన సారథియైన శల్యునితో కూడా ఇదే విషయం చెప్పడం జరిగింది.

**(9) కర్ణుడు మహేంద్రగిరి నుండి హస్తినాపురంనకు తిరిగి వచ్చుట**

హస్తినాపురంలో ద్రోణాచార్యుడు తన శిష్యుల విద్యను ప్రదర్శించుటకు ధృతరాష్ట్ర భీష్మ విదురుల అనుమతితో కుమారాస్త్ర విద్యాప్రదర్శనను ఏర్పాటు చేశాడు. శిష్యులు వారి వారి విద్యలను ప్రదర్శిస్తున్నారు. అర్జునుడు ద్రోణాచార్యుని అనుమతితో వివిధ అస్త్రాలను ప్రయోగించి ప్రేక్షకులను ఆశ్చర్యచకితులను చేస్తుండగా, అప్పుడే వచ్చిన కర్ణుడు ద్వారంవద్ద భుజాస్ఫాలనం చేశాడు. దానితో ప్రేక్షకులు ద్వారంవైపు చూశారు. సహజకవచకుండలాలతో శోభిల్లుతూ ధనుర్ధారియై రంగభూమిలోనికి ప్రవేశించాడు కర్ణుడు. అర్జునునితో వైరము, దుర్యోధనునిచే అంగరాజ్య ప్రదానము, దానితో దుర్యోధన సఖ్యము తటస్థించి దుష్టచతుష్టయంలో చేరిపోయాడు కర్ణుడు. ఇదీ కర్ణుని పూర్వగాథ...

**కర్ణుడు దుష్టుడా? ఉత్తముడా? (వచ్చే సంచికలో..)**

సూక్తిమాలిక: అసూయ, అహంకారమే అసుర లక్షణములు. ప్రేమే దివ్యత్వమునకు నాంది.

# మహాభారతం

## కర్ణుడు దుష్టత్వం 33

రచన
మహాభారత పరిశోధకులు
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్ : 08647-254716

(గత సంచిక తరువాయి)

### 1) కర్ణుడు దుష్టుడా?లేక ఉత్తముడా?



**1. భీమునకు విషం పెట్టుటలో కర్ణుని పాత్ర.**

1. భీమునకు విషాన్నం తినిపించటం, గంగలో త్రోసి చంపబూనటం మొదలైన దుష్ట కార్యాలన్నీ కర్ణుడు రాక పూర్వమే దుర్యోధనుడు చేసినవని, ఇందులో కర్ణునికి పాత్ర లేదని కొందరు భావిస్తూ ఉంటారు. అందువల్ల కర్ణుడు దుష్టుడు కాదని, దుష్టునితో స్నేహం చేయడం వల్లనే దుష్టచతుష్ట యంలో చేర్చటం జరిగిందని సమర్థించబూనుకుంటారు. ఈ విషయంలో మహాభారత గ్రంథం ఏమి చెబుతున్నది?

జ. సంస్కృత మహాభారతం ఆదిపర్వం 127వ అధ్యాయం 26వ శ్లోకం నుండి 128వ అధ్యాయం 33వ శ్లోకం వరకూ భీముని చంపే ప్రయత్నానికి సంబంధించిన గాథ చెప్పబడింది.

భీమునితో స్నేహం నటిస్తూ దుర్యోధనుడు స్వయంగా విషం కలిపిన అన్నాన్ని తినిపించటం, విష ప్రభావం వల్ల స్పృహ కోల్పో యిన భీముని దుర్యోధనుడు తన సోదరుల సాయంతో లతలతో బంధించి గంగాజలంలో విసిరివేయటం, భీముడు నాగలోకంలో అష్టకుండ రసాన్ని తాగి, 8 రోజులు అక్కడే ఒళ్ళు తెలియకుండా పడి నిద్రపోయి తొమ్మిదవరోజున నాగరాజు చేత పంపబడటం, తల్లిని సోదరులను కలుసుకొని జరిగిన విషయాన్ని చెప్పటం అనేది ఈ గాథ. ఆ తరువాత దుర్యోధనుడు భీముని సారథిని చంపించగా విదురుని సలహాపై ఏమీ జరగనట్లే ఉన్నారు పాండవులు. ఆ తరువాత మరొక రోజున దుర్యోధనుడు కాలకూటమనే పేరుగల విషాన్ని భోజనంలో కలిపి తినిపించాడు.ఇది తెలిసిన వైశ్యాపుత్రుడు యుయుత్సుడు భీమునితో చెప్పినప్పటికీ భీముడు ఆ విషాన్నమును తిని అరిగించుకున్నాడు. దానికి కారణం భీముని పొట్టలో 'వృక' మనే అగ్ని ఉండటమే. (ఆది ప.128 అ 34-39 శ్లో)

శ్లో॥ ఏవం దుర్యోధనః కర్ణః శకుని శ్చాపి సౌబలః ।
అనేకై రభ్యుపాయై స్తాన్ జిఘాంసంతిస్మ పాండవాన్ ॥
(ఆది ప.128 అ. 40 శ్లో)

తా॥ ఈ ప్రకారంగా దుర్యోధనుడు, కర్ణుడు, సుబలపుత్రుడైన శకుని అనేక ఉపాయాల ద్వారా పాండవులను చంపటానికి ప్రయత్నిస్తున్నారు.

దీనితో పాండవులను తుదముట్టించే విష యంలో దుర్యోధనునితో పాటు కర్ణుడు శకుని కూడా ఉన్నారని ఋజువౌతున్నది.

–ఈ విషయంలో స్వయంగా కర్ణుడే ఏమ న్నాడో చూద్దాం.

మహాభారత యుద్ధం 14వ రోజున అర్జునుని చేతిలో సైంధవుడు వధించబడ్డాడు. సైంధవుని రక్షించటం కోసం ద్రోణాచార్యుడు తన సర్వశక్తులను ధారపోసి అపూర్వమైన వ్యూహనిర్మాణం గావించాడు. ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాడు. అయినప్పటికీ వ్యూహంలో ప్రవేశించిన అర్జునుడు శ్రీకృష్ణుని సలహాలు సూచనలతో సైంధవుని వధించి తన ప్రతిజ్ఞను నిలుపుకొన్నాడు. ఈ పరాభవాన్ని తట్టుకోలేని దుర్యోధనుడు, పాండ వులపై పక్షపాతం చూపడం వల్లనే ద్రోణాచార్యుడు సైంధవుని కాపాడలేకపోయాడని, కర్ణుని వద్ద ఆచార్యుని నిందిస్తూ ఆక్రో శించాడు. అప్పుడు కర్ణుడు దుర్యోధనునితో, దుర్యోధనా! నీవు ఆచార్యుని నిందించవద్దు. ఆచార్యుడు తన ప్రాణములను సైతం లెక్కచేయక అపూర్వమైన, అభేద్యమైన వ్యూహ నిర్మాణం చేసి, తన బలం, శక్తి, యుక్తి, పరాక్రమమును ప్రదర్శించి వీరోచితంగా పోరాడాడు. అర్జునుని నిరోధించలేకపోయాడంటే అందులో ఆచార్యుని దోషము లేశమాత్రము కూడా లేదు. అది అర్జునుని పరాక్రమము, అస్త్ర విద్యా నైపుణ్యము, శ్రీకృష్ణుని సారథ్యము వల్ల మాత్రమే సాధ్యమైంది. దైవబలం ముందు మానవ శక్తి చాలదు. మనం ఎంతగా పరాక్రమాన్ని ప్రదర్శించి యుద్ధం చేసినప్పటికీ సైంధవుని కాపాడగలిగామా? దైవబలం లేకనే మన పౌరుషమంతా వ్యర్థమైపోయింది.

శ్లో॥ నికృత్యా వంచితాః పార్థా విషయోగైశ్చ భారత ।
దగ్ధా చతుగృహే చాపి ద్యూతేన చ పరాజితాః ॥
(ద్రోణ ప.152 అ. 28 శ్లో)

శ్లో॥ రాజనీతిం వ్యపాశ్రిత్య ప్రహితాశ్చైవ కాననం ।
యత్నేన చ కృతం తత్తత్ దైవేన వినిపాతితం ॥
(ద్రోణ ప 152 అ. 29 శ్లో)

**తా॥ భారతా!** మనం కపటంతో పాండవులను చంపుటకు విష ప్రయోగం చేశాం. లక్క యింట దగ్ధం చేశాం. మోసం చేసి జూదంలో ఓడించాం. రాజనీతిని అనుసరించి అరణ్యాలకు పంపించాం. ఇలా ప్రయత్న పూర్వకంగా మనం చేసిన కార్యాలన్నీ దైవం చేత వ్యర్థమై పోయినది. (ద్రోణ ప.152-15 నుండి 29 శ్లో)

**ఈ కర్ణుని మాటలను బట్టి కూడా భీమసేనునికి విషాన్నం పెట్టి చంప ప్రయత్నించటంలో కర్ణుడున్నాడని స్పష్టం.** కర్ణుడే స్వయంగా చెబుతున్నా నమ్మలేని వారి మనస్తత్వం ఏమిటో విజ్ఞులు ఆలోచించాలి.

ఇదే సందర్భంలో ఆంధ్ర మహాభారతంలో కూడా ఏమున్నదో చూద్దాం.

చ. "అన విని కర్ణుడిట్లనియె నగ్గురు దూఱగ నేల నాత డో
పిన గతి బోరుగాక నరు బీరము లావును నెక్కుడైన వా
నినుడుప వచ్చునే విధియ నేర్చు విషంబిడి యిల్లుగాల్చి కా
ననమున కేగజేసి యొక నాశము గంటిమె గొంతి సంతతిన్"

**భావం : అనగా విని కర్ణుడు, దుర్యోధనా! ఎందుకు ఆచార్యుని నిందిస్తావు. తన శక్తి కొలది యుద్ధం చేస్తున్నాడు ఆచార్యుడు. అర్జునుని బలపరాక్రమములసామాన్యములు. మనం విషం బెట్టి, ఇల్లు తగులబెట్టి, వనములకు పంపి కుంతీపుత్రులను నాశనము చేయగలిగామా? ఇదంతా విధికృతము.**

దీనిని బట్టి దుర్యోధమని దుష్టకార్యములన్నింటిలో కర్ణుడున్నాడని, భీమునకు విషం పెట్టుటలో కూడా కర్ణుని పాత్ర గలదని తేటతెల్లమవుతున్నది.

అయితే కర్ణుడు కుమారాస్త్ర విద్యా ప్రదర్శన సమయములో గదా హస్తినాపురం వచ్చినది. దుర్యోధనునితో స్నేహం ఏర్పడ్డది. మరి భీమునకు విషం తినిపించినది కురుపాండవులు ఆటలాడుకునే సమయంలో కదా! అప్పటికి కర్ణుడిక్కడ లేడు కదా! అని చాలామంది సందేహం.

దీనికి కారణం మహాభారత గ్రంథాన్ని పూర్తిగా చదవక పోవటమే. గ్రంథంలో ఏమున్నది?

కర్ణుడు కుంతీదేవికి కన్యావస్థలో సూర్యుని అనుగ్రహం చేత జన్మించినవాడు. కుంతీదేవి ఆ పుట్టిన బిడ్డను ఒక పెట్టెలో పెట్టి అశ్వనదిలో విడిచిపెట్టగా అది ప్రవాహాన్ని అనుసరించి చర్మణ్వతీ నదిలోనికి, అక్కడి నుండి యమునా నది లోనికి, దాని నుండి గంగానది లోనికి ప్రవేశించినది. అలా ప్రయాణించిన ఆ పెట్టె చంపాపుర ప్రాంతాన్ని చేరగా ధృతరాష్ట్రుని రథసారథి ఐన అతిరథుడు తన భార్య రాధతో కలిసి గంగా స్నానానికి వచ్చి యుండగా వారి కంట బడింది. దానిని తెరిచి చూడగా కవచ కుండల శోభితుడైన బాలుడు కనిపించాడు. సంతానం లేని ఆ దంపతులు అతణ్ణి పెంచుకున్నారు. అతనికి 'వసుషేణుడు' అనే పేరు పెట్టి విద్యాభ్యాసానికి తగిన వయస్సు రాగానే హస్తినాపురం పంపించారు. అతడు కృపాచార్య ద్రోణాచార్యుల వద్ద ధనుర్విద్యాభ్యాసం చేస్తున్నాడు. **ఈ కారణం చేత అతడికి దుర్యోధనునితో స్నేహం ఏర్పడింది.** సంస్కృత మహాభారతం వనపర్వం 308వ అధ్యాయం 1వ శ్లోకం నుండి 309వ అధ్యాయం 27వ శ్లోకం వరకు గల గాథ ఇది.

పాండవుల కన్నా, ధార్త రాష్ట్రుల కన్నా దాదాపు 10 సంవత్సరాలు పెద్దవాడు కర్ణుడు. ఎందుకంటే కుంతీదేవి కన్యగా ఉన్నప్పుడు కర్ణుని కన్నది. ఆ తర్వాత ఆమెకు స్వయంవరం జరిగింది. పాండురాజు వివాహం చేసుకున్నాడు. ఆ పాండురాజు ఆ తరువాత మాద్రిని వివాహమాడాడు. అనేక దిగ్విజయ యాత్రలు చేశాడు. ధృతరాష్ట్రుని చేత అనేక అశ్వమేధయాగాలు చేయించాడు. ఆ తరువాత భార్యలతో కలిసి వనములకు వెళ్ళాడు. అక్కడ ఒకనాడు వేటలో కిందముడనే మునిని లేడియని భ్రమించి బాణం వేసి సంహరించటంతో ఆ ముని శపించాడు. ఆ శాప కారణంగా రాజలాంఛనాలు త్యజించి మునివృత్తిలో ఉన్నాడు. ఒకనాడు మునీశ్వరుల మాటపై తనకు సంతానయోగ్యత ఉన్నదని తెల్లుసుకొని కుంతిని పిలిచి తన అభిలాషను తెలియజేయగా, దుర్వాస మహర్షి ఇచ్చిన మంత్రంతో పుత్రులను కనటం జరిగింది. అలా పుట్టిన వారిలో జ్యేష్ఠుడు ధర్మరాజు. కనుక ధర్మరాజు కన్నా సుమారు 10 సంవత్సరాలు పెద్ద అయినవాడు కర్ణుడు.

అందువల్ల కురుపాండవులు పుట్టకముందే కృపాచార్యుని కడకు చేరి విద్యాభ్యాసం గావించినవాడు కర్ణుడు. ఆ తరువాత కురుపాండవులు కృపాచార్యుని కడచేరి ధనుర్విద్యాభ్యాసం చేశారు. ఆ తరువాత ద్రోణాచార్యుని రాకతో అందరూ అస్త్రవిద్యల నభ్య



***జనులారా!*** *మీ సంపదలు, మీ జీవితములు ఇంద్రియ సుఖ సంపాదనము కొరకు కావనియు, స్వసుఖ సాధన కొరకు కూడా కావనియు మరువకుడు. భారత మాత యొక్క యజ్ఞపీఠమునందు ఆహుతి యగుటకే మీరు జన్మించితిరని మరువకుడు. మీ సంఘ వ్యవస్థ అఖండ విశ్వము యొక్క ప్రతిరూపము మాత్రమే యని మరువకుడు. నిమ్న జాతులు, పామరులు, దీనులు, విద్యావిహీనులు, మాదిగ వారు, పాకీ వారు మీ రక్త బంధువులే యనియు, మీ సోదరులే యనియు మరువకుడు.*

**-స్వామి వివేకానంద**



**మంచి కోరుట ఆస్తికత-కోరకుండుట నాస్తికత**

సించారు. ద్రోణాచార్యుని వద్ద కురుపాండవులతో బాటుగా కర్ణుడే కాదు, ద్రుపద పుత్రులైన శిఖండి, దృష్టద్యుమ్నులతో సహా సకల దేశాలకు చెందిన రాజకుమారులనేకులు అస్త్రవిద్యల నభ్య సించారు.

ఇలా ద్రోణాచార్యుని వద్ద విద్యల నభ్యసిస్తున్న కర్ణుడు ధనుర్వేదంలో అర్జునుడు అత్యంత ప్రావీణ్యం సంపాదించటాన్ని చూసి, ఒకనాడు ద్రోణుని సమీపించి, "గురుదేవా! నాకు కూడా బ్రహ్మాస్త్రాన్ని ప్రసాదించండి.." అని కోరగా ద్రోణాచార్యుడు "నాయనా! బ్రహ్మచర్య వ్రతాచరణ గల బ్రాహ్మణునకు, తపస్సు చేసిన క్షత్రియునకు తప్ప ఇతరులకు బ్రహ్మాస్త్రాన్ని ఉపదేశించరాదు" అని చెప్పగా కర్ణుడు, ఆచార్యునకు నమస్కరించి సెలవు తీసుకొని, మహేంద్ర పర్వతముపై గల పరశురాముని వద్దకెళ్ళి బ్రాహ్మణు డనని అబద్ధమాడి బ్రహ్మాస్త్రాన్ని సంపాదించాడు. (శాంతిపర్వం. 2వ అధ్యాయం 9 నుండి 14వ శ్లో. వరకు)

**అలా అప్పుడు వెళ్ళిన కర్ణుడు పరశురాముని ద్వారా బ్రహ్మా స్త్రాన్ని పొంది, శాపాలను పొంది, హస్తినాపురంలో కుమారాస్త్ర విద్యా ప్రదర్శన జరుగుతున్నవేళకు తిరిగి వచ్చాడు. అంతే తప్ప కొత్తగా అప్పుడే వచ్చినవాడు కాదు. దుర్యోధనునితో ముందునుంచీ స్నేహం ఉన్నది. అర్జునునితో స్పర్థ ఉన్నది. ఆ కారణంగా పాండ వులను ద్వేషిస్తూ ఉండేవాడు. అందుకే భీమునకు విషాన్నం తిని పించి చంపాలనే కుట్రలో భాగస్వామి అయ్యాడు. ఇంత చిన్న వయసులోనే తోటి విద్యార్థిని చంపే కుట్రలో పాల్గొన్న కర్ణుడు దుష్టుడు అనటంలో ఏమాత్రం సంశయం లేదు. రాజ్యాధికారం తమ చేతి నుండి జారిపోకుండా ఉండాలంటే, పాండవులను తుద ముట్టించాలనే స్వార్థ బుద్ధితో దుర్యోధనుడు భీముని చంపాలను కున్నాడు. మరి కర్ణుడెందుకు భీముని చంపాలనుకున్నాడు? దీనిని బట్టి దుష్టత్వం కర్ణుని నైజం అని అర్థమవుతుంది.**

2. లక్క యింట తగులబెట్టుటలో కర్ణుని పాత్ర

2. విద్యాభ్యాసం పూర్తయిన తరువాత ధర్మరాజును యువరాజుగా అభిషేకించిన తర్వాత, కుంతీ పాండవులను లక్క యింట తగుల బెట్టాలనే దుష్టకార్యం ధృతరాష్ట్రుని అనుమతితో దుర్యోధనుడు చేసిన ప్రయత్నమేగాని అందులో కర్ణుని పాత్ర ఏమీ లేదని కర్ణాభి మానులు చెబుతూ వుంటారు. ఎలాగైనా కర్ణుడు దుష్టుడు గాదని, సత్పురుషుడని నిరూపించాలనే తపనతో ఈ తంటాలు పడు తుంటారు. లాక్షాగృహ దహన మనే దుష్టకార్యంలో నిజంగా కర్ణుడు లేడా? -చూద్దాం.

జ. కుమారాస్త్ర విద్యా ప్రదర్శనానంతరం ఒక సంవత్సరానికి పౌరులయొక్క భావాలను గమనించిన ధృతరాష్ట్రుడు, తప్పనిసరి పరిస్థితిలో ధర్మజుని యౌవరాజ్యాభిషిక్తునిగా చేశాడు. దానితో దుర్యోధనుడు రాజ్యం తమ చేయిజారి పోతున్నదని విలపించాడు. కర్ణ శకునులతో సమాలోచనలు చేస్తున్నాడు.

శ్లో॥ తతః సుబల పుత్రస్తు రాజా దుర్యోధనశ్చహ ।
దుశ్శాసనశ్చ కర్ణశ్చ దుష్టం మంత్ర మమంత్రయన్॥
(ఆది ప.140 అ.1 శ్లో)

శ్లో॥ తే కౌరవ్య మనుజ్ఞాప్య ధృతరాష్ట్రం నరాధిపం ।
దహనేతు సపుత్రాయాః కుంత్యాబుద్ధి మకారయన్ ॥
(ఆది ప. 140 అ. 2 శ్లో.

తా॥ ఆ తరువాత సుబలపుత్రుడు శకుని, దుర్యోధనుడు, దుశ్శా సనుడు, కర్ణుడు తమలో తాము రహస్యంగా దురాలోచనలు చేస్తు న్నారు. మహారాజు ధృతరాష్ట్రుని అనుమతి తీసుకొని పుత్రులతో సహా కుంతీదేవిని అగ్నిలో దగ్ధం చేయాలని సంకల్పించుకున్నారు. (1,2 శ్లో)


దీనిని బట్టి కుంతీదేవితో సహా పాండవులను అగ్నిలో దగ్ధం చేయాలనే ఆలోచన దుర్యోధనునిది ఒక్కనిది మాత్రమే కాదని, అందులో కర్ణ, శకుని, దుశ్శాసనులున్నారని ఋజువౌతున్నది. అందుకే కర్ణుడు దుష్టచతుష్టయంలోని వాడయ్యాడు. అంతేకాదు, అదే అధ్యాయంలో-

శ్లో॥ ప్రాణాధికం భీమసేనం కృత విద్యం ధనంజయం ।
దుర్యోధనో లక్షయిత్వా పర్యతప్యత దుర్మనాః ॥
(ఆది ప.140 అ.20 శ్లో)

శ్లో॥ తతో వైకర్తనః కర్ణః శకునిశ్చాపి సౌబల్హ ।
అనేకైరభ్యుపాయైః తే జిఘాంసంతిస్మ పాండవాన్ ॥
(ఆది ప.140 అ. 21శ్లో)

తా॥ అందరికన్నా అధిక బలవంతుడైన భీమసేనుని, అస్త్రవిద్యలో శ్రేష్ఠుడైన అర్జునుని చూసి, దుర్యోధనుడు ఎల్లప్పుడూ సంతాపం చెందుతూ ఉన్నాడు. అతడు ఎంతగానో దుఃఖిస్తున్నాడు. అప్పుడు

## సూక్తి సుధలు



*శ్లో॥ క్షమీ దాతా గుణగ్రాహీ, స్వామీ పుణ్యేన లభ్యతే*
*అనుకూలః శుచి ర్దక్షః కవి ర్విద్వాన్ సుదుర్లభః*

దాత, గుణగ్రహణ పారీణుడు, క్షమాశీలియైన పాలకుడు సుకృత విశేషము వల్ల లభించవచ్చును. కాని శుచిమంతుడు, సమర్థుడు, అనుకూలుడు, పండితుడు ఐన సుకవి బహుదుర్లభుడు. (ఏ జాతిలోనైనా అట్టివాడు జన్మించుట ఆ జాతికి గౌరవమే అని భావం)

సూతపుత్రుడైన కర్ణుడు, సుబలపుత్రుడు శకుని అనేక ఉపాయాలతో పాండవులను చంపటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

దీనిని బట్టి పాండవుల హత్యాప్రయత్నంలో కర్ణుడు ప్రముఖ పాత్రనే వహిస్తున్నాడనే విషయం ఋజువౌతున్నది. కర్ణుడు దుష్టుడే అనేందుకు ఏ సందేహమూ లేదు.

దుర్యోధనునిపై గల స్వామి భక్తి వల్ల కర్ణుడు అలా చేశాడు. కనుక అది అతడి సుగుణమే అనేవారూ ఉన్నారు. ఆహారంలో విషం కలిపి తినిపించుట, గంగలో త్రోయుట, ఇంటికి నిప్పు పెట్టుట మొదలైన కార్యములు సుగుణములే అయితే ఇక దుర్గుణములు ఏమిటో వారే చెప్పాలి. ఆత్మవినాశనానికి, అపకీర్తి పాలు గావటానికి కారణమైన ఈ పాపకార్యములను ప్రోత్సహించుట, దుర్యోధనుడు సర్వనాశనమై పోవటానికి సహాయపడుట స్వామిభక్తి అయితే ఇలాంటి భక్తుణ్ణి ఏ స్వామియైనా కోరుకుంటాడా?

**3. ద్యూతసభలో కర్ణుని పైశాచిక చేష్ట. దుష్టత్వ పరాకాష్ట :**

రాజసూయయాగంలో పాండవుల ఐశ్వర్యం దుర్యోధనునకు సహించరానిదైనది. దానితో వారి సంపదల నెలాగైనా హరించాలని శకునితో చెప్పగా, ధర్మరాజును జూదానికి పిలిపించినచో వారి సకల సంపదలను హరించి ఇస్తానని శకుని సలహా ఇచ్చాడు. అదెలా సాధ్యం? అని దుర్యోధనుడడుగగా–

"నియతం తం విజేష్యామి **కృత్వాతుకపటం** విభో"(సభా ప.49 అ. 40 శ్లో)

"నేనపహరించి యిత్తు ధరానుత మాయదురోదర వ్యాజమునన్" (ఆంధ్ర భా.సభా)

'మోసం చేసి వారి సంపదనంతా హరించి ఇస్తా'నని శకుని చెప్పాడు.

ధృతరాష్ట్రుని చేత ధర్మరాజును పిలిపించటం, కపట జూదంలో పాండవ సంపదను హరించటం జరిగింది. అంతటితో ఆగక ధర్మరాజు సోదరులను కూడా పందెం వేసి ఓడిపోయాడు. ఆ తరువాత తనను తాను ఒడ్డుకుని ఓడిపోయాడు. అలా ఓడిన తర్వాత "ధర్మనందనా! నీవింకా ఓడిపోని సంపద ద్రౌపది ఉన్నది. ఆమెను పణంగా పెట్టు" మని శకుని ప్రోత్సహించగా, అప్పటికే ఓడి దాసుడైయున్న ధర్మరాజు ద్రౌపదిని పణంగా పెట్టటం, ఓడిపోవటం జరిగింది. అంతట దుర్యోధనుడు మొదట ప్రాతికామిని పంపి, ఆ తరువాత దుశ్శాసనుని బంపి ద్రౌపదిని సభ కీడ్చుకొని రావటం జరిగింది. ఆ తరువాత ధర్మాధర్మచర్చ జరిగింది. దుర్యోధన సోదరుడు వికర్ణుడు ద్రౌపది ధర్మంగా జయించబడలేదు. ఆమె అధర్మ విజిత అన్నాడు. దానికి కర్ణుడు 'ఆమె ధర్మంగానే జయించబడినదని సమాధానం చెప్పాడు. (ఇంతవరకు జరిగిన గాధను వివరంగా డిశెంబరు 2010 నుండి ఫిబ్రవరి 2011 వరకు గల ధ్యానమాలిక సంచికలలో ఇవ్వటం జరిగింది)

ఇలా ధర్మసంశయం గలిగి సభలో చర్చ జరుగుతుంటే కర్ణుడు "ఈ ద్రౌపది ఐదుగురికి భార్య. కనుక ఈమె బంధకి. ఇట్టి దానిని ఏకవస్త్రనైతేనేమి? వివస్త్ర ఐతేనేమి? ఇట్టి బంధకిని వివస్త్రను జేసి సభకు తెచ్చినా తప్పులేదు" అని పలికి–

శ్లో॥ దుశ్శాసన సుబాలోయం వికర్ణ ప్రాజ్ఞవాదికః !
పాండవానాంచ వాసాంసి ద్రౌపద్యాశ్చాప్యుపాహర ॥
(సభా ప. 68 అ.38శ్లో)


తా॥ ఓ దుశ్శాసనా! ఈ వికర్ణుడు బాలుడు, గొప్ప విద్వాంసునిలా మాట్లాడుతున్నాడు. నీవు పాండవుల యొక్క , ద్రౌపది యొక్క కట్టిన వస్త్రాలను ఊడదియ్యి– అన్నాడు.

కర్ణుని ఆదేశంతో దుశ్శాసనుడు ద్రౌపదీ దేవి కట్టిన వస్త్రాన్ని పట్టుకొని లాగటం మొదలుపెట్టాడు. (సభా ప.68 అ.39–40శ్లో)

ఈ వస్త్రాపహరణమనే నీచమైన, నికృష్టమైన, దుర్మార్గమైన, పైశాచిక కృత్యానికి మూలకారణం కర్ణుడు. ఇలాంటి నీచ బుద్ధి, దుష్ట బుద్ధి గలవాడు రామాయణ మహాభారతాలలో ఎక్కడైనా ఉన్నాడా? –ఆలోచించాలి.

ఒకవేళ జూదంలో ధర్మబద్ధంగానే ద్రౌపది జయింపబడిందే అనుకుందాం. అలా జయింపబడితే ఆమెను నిండుసభలోనికి – అందులోనూ వృద్ధులైన భీష్మద్రోణ కృపాచార్యులు, బాహ్లీక సోమదత్త భూరిశ్రవులు, ధృతరాష్ట్ర విదురులు, అనేకమంది రాజులు, సామంతులు, పురజనులు ఉన్న సభలోనికి ఈడ్చించి, అంతటితో ఆగక బట్టలు ఊడదీయమంటాడా? ఇదేనా సభ్యత? ఇదేనా సంస్కారం? ఇదేనా మానవత్వం? ఒక మహాసామ్రాజ్ఞిని, పట్టమహిషిని, ఆ కురువంశపు కోడలిని భర్తల ఎదుట నిండుసభలో బట్టలు విప్పుదీయమంటాడా? ఇది రాక్షస కృత్యం అనటానికి కూడా వీలులేదే. ఎందుకంటే రావణాసురుడు కూడా సీతాదేవిని ఎత్తుకు వెళ్ళి తన ఇంట్లో ఉంచలేదు. అశోకవనంలో ఉంచాడు. ఆమెను

**సూక్తి సుధలు**



*శ్లో॥ ఋణానుబంధ రూపేణ, పశుపత్నీ సుతాలయాః*
*ఋణక్షయే క్షయం యాంతి, కా తత్ర పరిదేవనా.*

పశువులు, భార్యాపుత్రాదులు, ఇండ్లు, వాకిండ్లు–ఇవి ఋణానుబంధరూపముగా వచ్చి, ఋణముతీరగనే మళ్లీ మనుష్యుని వదలివెళ్ళిపోతున్నాయి. అట్టి వాటిని గూర్చి ప్రాజ్ఞులు విచారించరు గదా.

తాకను కూడా తాకలేదు. అసలు ఈ కలియుగంలో నైనా, ఎవడైనా అలా అంటాడా? పేకాటలో ఒకడు భార్యను పందెం వేసి ఆడతాడు. ఆ గెలిచినవాడు అక్కడే ఆమె బట్టలు విప్పదీద్దాం అంటాడా? అలా అంటే హర్షించే వారుంటారా? అందుకే కర్ణునిది పైశాచిక వికట తాండవం. అంగరాజ్యం ఇచ్చినందుకు దుర్యోధనుని సంతోష పెట్టటానికి ఇంతగా దిగజారిపోవాలా?

ఇదే తన తల్లి లేదా చెల్లి అయితే ఇలాగే మాట్లాడేవాడా? ఇలాంటి నీచుణ్ణి సమర్థించే వారు ఎలాంటి వారై యుండాలి.

కర్ణుడు చేసిన ఈ పైశాచిక కృత్యానికే భీమసేనుడు దుశ్శాసనుని లోక భీకర పద్ధతిలో వధించి అతడి రొమ్ము చీల్చి రుధిరం త్రాగుతానని ప్రతిజ్ఞ చేశాడు.

ద్రౌపదీ దేవి పాతివ్రత్య మాహాత్మ్యం నిండుసభలో నిరూపితమైంది. అనంత వస్త్రావిర్భావం జరిగింది. సభాసదులు నిశ్చేష్టులై ద్రౌపదీదేవిని ప్రశంసించారు. అప్పుడు అంతా ఆశ్చర్యచకితులై ఆమె పాతివ్రత్య మహిమను వేనోళ్ళ కొనియాడుతుంటే ఈ కర్ణుడేమంటున్నాడు?–

"ద్రౌపదీ! నీకు ఐదుగురు భర్తలున్నా నిన్నే విధంగానూ రక్షించలేకపోయారు. కనుక జూదంలో ఆలిని ఒడ్డి ఓటుపడని ఆరవ భర్తను ఎంచుకో. నీలాంటి దాసీలకు ఇది తప్పేమీ కాదు" అంటూ దుర్యోధనుని వైపుకు కనుసైగ చేయగా, కర్ణుని కనుసైగను చూచిన దుర్యోధనుడు తన ఎడమతొడపై గల వస్త్రాన్ని తొలగించి, ద్రౌపదికి చూపిస్తూ కనుసైగ చేశాడు. అది చూచిన భీముడు "రాజ్య సంపదల మదంతో మదమెక్కిన దుర్యోధనుని తొడలు బద్దలు కొట్టి వధించకపోతే నేను పితృపితామహుల గతికి తప్పిన వాడనవుతాన"ని భీకర ప్రతిజ్ఞ చేశాడు.

ద్రౌపది కట్టిన బట్టలు విప్పమని దుశ్శాసనునికి చెప్పటంతో దుశ్శాసనుడలాగే చేశాడు. దానితో వాడి రొమ్ము చీల్చి రుధిరం త్రాగుతానని ప్రతిజ్ఞ చేసిన భీముడు కురుక్షేత్రయుద్ధంలో దుశ్శాసనుని రొమ్ము చీల్చి, రక్తం తలపై పోసుకొని వికృతతాండవం చేసి ప్రతిజ్ఞను నెరవేర్చుకున్నాడు.


ఆరవ భర్తను వెతుక్కోమని ద్రౌపదికి చెప్పి, దుర్యోధనునికి కనుసైగ చేయటంతో దుర్యోధనుడు తొడ చూపించాడు. దానితో వాడి తొడలు బద్దలు గొట్టి వధించి శిరస్సును పాదంతో తంతానని ప్రతిజ్ఞ చేసిన భీముడు దుర్యోధనుని తొడలు విరుగగొట్టి తలపై తన్ని ప్రతిజ్ఞను నెరవేర్చుకున్నాడు.

ఇలా దుర్యోధన దుశ్శాసనులిద్దరు సర్వనాశనం కావటానికి చక్కగా సహకరించిన కర్ణుడు, బ్రాహ్మణ శాపంతో రథచక్రం భూమిలో క్రుంగిపోగా, అర్జున ప్రయుక్త బాణంతో దిక్కులేని చావు చచ్చాడు. దుష్టులకు దైవం సహకరించదు అనే విషయం ఋజువైంది.


–ఇక ఘోషయాత్రా సందర్భంగా కర్ణుని దుష్టత్వం ఏమిటో–

(వచ్చే సంచికలో)

## పర్తీశా! ఆదుకోవయ్యా!



మేలుకోవయ్యా పర్తీశా! మేలుకొని మమ్మేలుకోవయ్యా!
నీవెక్కడకెళ్ళావయ్యా! మా గుండెల్లోనే వున్నావయ్యా!
నీ ప్రియభక్తులను ఆదుకోవయ్యా!
తూర్పుదిక్కు ఎర్రనాయె, భానోదయ సమయమాయె
భక్త జనులు నీదు కీర్తన చేయగ
కోయిల పిలుపుతో, నెమలి నాట్యం సేయగ
మేలుకోవయ్యా పర్తీశా!
తలచెద నీ నామమే నిరతము
తలవంచెద నా చరణ సన్నిధిలో
పంచభూతములు, ప్రకృతి సైతము
కోరుచున్నవి నీ మధుర దర్శనభాగ్యం...
వలదు వలదు భోగభాగ్యములు
వరదా ఇమ్ము.. సేవా భాగ్యము!
సాయి నామమే సకలార్థ సాధనము
సాయి స్మరణమే పరమాత్మ దర్శనము
నీ సన్నిధి శాంతి నిలయమది



సమతా మమతల సంగమమే అది
అరిషడ్వర్గములను అధిగమింపగా
ఆశ్రయించితిమి జ్ఞానస్వరూపా!
మిమ్ము ఆశ్రయించితిమి ఓ దివ్యస్వరూపా!
వందనమిదే పర్తీబాబా భక్తవత్సలా!

–వై.కె. మూర్తి

# మహాభారతం

## కర్ణుడు దుష్టత్వం 34

రచన
మహాభారత పరిశోధకులు
జ్ఞానప్రపూర్ణ శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట
ఫోన్ : 08647-254716, సెల్ : 80085 39770
visit:www.srichalapathirao.com

(గత సంచిక తరువాయి)

**4. వనవాసగతులైన పాండవులను వధించ తలపెట్టుటలో కర్ణుని పాత్ర :**



మాయా జూదంలో ఓడింపబడిన పాండవులు నియమం ప్రకారం 12 సంవత్సరములు వనవాసం చేయుటకు గంగా తీరాన్ని చేరారు. వారితో వచ్చిన విప్రులతో ఆ రాత్రి గడిచిపోయింది. ఉదయం నిద్ర లేచిన పాండవులు, అరణ్యంలో ప్రవేశించబోతూ, తమతో బాటుగా వస్తున్న బ్రాహ్మణులను చూచారు. అప్పుడు ధర్మరాజు వారితో "విప్రవరులారా! మాతో వచ్చి కష్టపడవద్దు. వెనుకకు తిరిగి వెళ్లండి" అని ప్రార్థించాడు. దానికా బ్రాహ్మణులు

**శ్లో॥ అస్మత్ పోషణజా చింతా మా భూత్ తే హృది పార్థివ।**
**స్వయ మాహృత్య చాన్నాని త్వాను యాస్యా మహే వయం॥**

(వన ప.2.అ.10శ్లో)

తా : "మహారాజా! మా పోషణ గురించిన చింత మీకు వద్దు. మేము స్వయంగా మా కొరకు అన్నాదులు సంపాదించుకుంటూ మీ వెంట వస్తాము.

మేం మీ అభీష్ట సిద్ధికై, మీకు శుభములు కలుగుటకై జపతపాలు చేస్తూ, మీ కష్టములను మరపించుటకు కథలతో, యిష్టాగోష్ఠులతో కాలక్షేపము కావిస్తాము" అన్నారు.

ధర్మరాజు ఇక వారిని వారించలేక ధౌమ్యుని సలహాతో సూర్యదేవునారాధించగా, సూర్యుడు అక్షయపాత్రనిచ్చి "దీనితో 12 సంవత్సరములు మీకు వివిధ రకాల భక్ష్య భోజ్యములతో అన్న సమృద్ధి కలుగుతుంద"ని దీవించాడు. ఈ అక్షయపాత్ర వలన ద్రౌపదీదేవి అందరకు సంతృప్తికరంగా భోజనం పెడుతున్నది. అలా కామ్యకవనంలో పాండవులు కాలం గడుపుచున్నారు. (వనపర్వం.3వ అ.)

పాండవులను అరణ్యాలకు పంపినందులకు పౌరులలో కలిగిన వ్యతిరేక భావాన్ని గుర్తించిన ధృతరాష్ట్రుడు ఒకరోజు విదురుని తన వద్దకు పిలిపించుకొని "విదురా! మన పౌరులు మనపై అభిమానంతో ఉండాలన్నా, పాండవులు నా పుత్రులను వధించకుండా ఉండాలన్నా, ఏమి చేయాలో ఆ ఉపాయాన్ని చెప్పు. నీవు సర్వము తెలిసినవాడవు. పాండవులను, నా పుత్రులను అందరినీ సమానంగా ఆదరించేవాడివి. కనుక ఏదైనా ఉపాయం చెప్పు" అన్నాడు.

దానికి విదురుడు, "మహారాజా! పాపాత్ముడైన శకుని మాయోపాయం వల్ల ధర్మరాజు వంచింపబడ్డాడు. పాండవులను పిలిపించి, వారి రాజ్యం వారికిచ్చి వేయుట వల్లనే పాండవులతో వైరం సమసిపోతుంది. చేసిన దుర్మార్గాలకు క్షమించమని దుర్యోధనుడు పాండవులను కోరాలి. అతడు అంగీకరించకపోతే నీవు దుర్యోధనుని విడిచి పాండవులను చేరదీస్తే అన్నీ సమసి పోతాయి. ఇంతకన్నా నేను చెప్పగలిగినదేమీ లేదు" అన్నాడు.

ఈ మాటలకు ధృతరాష్ట్రునికి కోపం వచ్చింది. ముసుగు తొలగించాడు. "విదురా! నీవు పాండవుల శ్రేయస్సు కోరేవాడివని, నా పుత్రులకు హాని చేసేవాడివని నాకు అర్థమైంది. పాండవులు కూడా నా పుత్రులే ఐనా దుర్యోధనుడు నా శరీరం నుండి జన్మించినవాడు, అట్టి నా కుమారుని విడిచిపెట్టమంటావా? నీవు పాండవ పక్షపాతివి. నేను నిన్ను ఎంతగా అభిమానిస్తున్నా నీవు మాత్రం కుటిలత్వంతో కూడిన సలహాలనే ఇస్తున్నావు. ఇక నీ వల్ల నాకు ఏ ప్రయోజనమూ లేదు. నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్లవచ్చు. కులటను ఎంతగా ప్రేమించినా అది చివరకు అతణ్ణి వదిలివేస్తుంది" అంటూ చటుక్కున లేచి అభ్యంతర మందిరంలోనికి వెళ్లిపోయాడు. విదురుడు 'ఇక ఈ కులనాశనం తప్పదు' అని పాండవులున్నచోటికి ప్రయాణమయ్యాడు. (వన ప.4వ.అ)

విదురుడు పాండవుల వద్దకు వెళ్ళటంతో ధృతరాష్ట్రునకు తన తప్పు తెలిసి వచ్చింది. వెంటనే సంజయుని పంపి విదురుని రప్పించి, తన తొందరపాటుకు మన్నించమని వేడుకున్నాడు.

**సీతాదేవిని అపహరించి తీసుకు రావటం అధర్మమని; ఆమెను తిరిగి రామునికి అప్పగించమన్నాడు రావణుని తమ్ముడు**

విభీషణుడు.

పాండవుల రాజ్యాన్ని కపట జూదంలో హరించటం అధర్మ మని, వారి రాజ్యం తిరిగి వారికి అప్పగించమన్నాడు ధృత రాష్ట్రుని తమ్ముడు విదురుడు.

- ధర్మాత్ములైన ఆ తమ్ముళ్ల మాటలు దుష్టులైన ఆ అన్నలకు రుచించలేదు. అందుకే విభీషణుని రాజ్యం నుండి వెళ్లగొట్టాడు రావణుడు. విదురుని రాజ్యం నుండి వెళ్ళగొట్టాడు ధృతరాష్ట్రుడు. దుర్మార్గుల ఆలోచనలు ఎప్పుడూ ఒక్కలాగే ఉంటాయి.

విదురుడు తిరిగి రావటంతో దుర్యోధనుని గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. కర్ణ, శకుని, దుశ్శాసనులను పిలిపించి వారితో ఇలా అన్నాడు.

"విదురుడు తిరిగి వచ్చి నా తండ్రి ప్రక్కన చేరాడు. నా తండ్రి మనసు మార్చి పాండవులను రప్పిస్తాడు. అదే జరిగితే నేను బ్రతకను, తిండి తినను, అగ్నిలో దూకుతా, విషం తింటా, శస్త్రాల ద్వారా మరణిస్తా, వారు సుఖంగా ఉండటం నేను చూడలేను" అని.

దానికి శకుని "దుర్యోధనా! పాండవులు సత్యసంధులు, నీ తండ్రి పిలిపించినాసరే, వారు ప్రతిజ్ఞలు విడిచి రానే రారు" అన్నాడు. ఆపై దుశ్శాసనుడు "మామా! నీవన్నదే సత్యమని నాకు అనిపిస్తున్నది. నీవు ఏ ఆలోచన చేస్తావో అదే నాకు బాగుంటుంది" అన్నాడు. అప్పుడు కర్ణుడు-

శ్లో॥ నాగమిష్యంతి తేధీరా అకృత్వాకాల సం విదం।
అగమిష్యంతి చేన్మోహాత్ పునర్ద్యూతే న తాన్ జయ॥

(వన ప.7. అ.13శ్లో)

తా : ధీర బుద్ధులైన పాండవులు వనవాస నియమకాలం పూర్తికాకుండా తిరిగి రారు. ఒకవేళ మోహావశులై తిరిగి వచ్చినా మళ్లీ జూదం ఆడించి ఓడించవచ్చు- అన్నాడు.

ఈ కర్ణుని మాటలకు దుర్యోధనుడు అంతగా సంతసించ లేదు. ముఖం తిప్పుకున్నాడు. అది గమనించి కర్ణుడు....

శ్లో॥ వయంతు శస్త్రాణ్యా దాయ రథా నాస్థాయ దంశితాః।
గచ్ఛామః సహితా హంతుం పాండవాన్ వనగోచరాన్॥

శ్లో॥ తేషు సర్వేషు శాంతేషు గతేష్వ విదితాం గతిం।
నిర్వివాదా భవిష్యంతి ధార్త రాష్ట్రా స్తథా వయం॥

శ్లో॥ యావదేవ పరిద్యూనా యావచ్ఛోద పరాయణాః।
యావన్మిత్ర విహోనాశ్చ తావచ్ఛక్యా మతం మమ॥

(వన.ప. 7వఅ.18, 19, 20 శ్లో)

తా : మనమందరం ఇప్పుడే రథముల నధిరోహించి, అస్త్ర శస్త్రములను ధరించి, వనవాస గతులైయున్న పాండవులను వధించుటకు వారిపై ఒక్కపెట్టున దండెత్తుదాం. (18)

తా : పాండవులందరు వధించబడి పరలోకగతులైతే ధార్త రాష్ట్రులు, మనము అందరం నిర్వివాదముగా ఉండవచ్చు. (19)

తా : వారు వనవాస క్లేశాలతో, శోకగ్రస్తులై, మిత్రులు, సహాయకులు లేకుండా ఉన్నపుడే వారిని జయించగలమని నా అభిప్రాయము. (20) - అన్నాడు.

ఈ కర్ణుని మాటలకు సంతోషించిన దుర్యోధనాదులు రథములను సిద్ధము చేయించి, అస్త్రశస్త్రాదులను సమకూర్చు కొని, రోషావేశ పరవశులై పాండవులను వధించ నిశ్చయించు కొని రథముల నధిరోహించి, నగరమును దాటిరి. (వన.ప.7.అ)

అలా పాండవ హత్యకై బయలుదేరిన దుర్యోధనాదులను వేదవ్యాస భగవానుడు దివ్యదృష్టితో వీక్షించి వారి వద్దకు వచ్చి వారిని నివారించాడు. ఆ తరువాత ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లి వ్యాసుడు "నీ కుమారుడు పాండవ ద్రోహ బుద్ధిని విడువకపోతే కులనాశనం జరుగుతుందని, నీవు నివారింపుమని" చెప్పగా ధృతరాష్ట్రుడు "మహాత్మా! దురాత్ముడైన దుర్యోధనునకు నీవే బుద్ధి చెప్పు" మని ప్రార్థించాడు. అంత వ్యాసుడు "నేను కాదు. మైత్రేయ మహర్షి వస్తున్నాడు. అతడు చెబుతాడు" అని చెప్పి అంతర్థానమయ్యాడు. (వన.ప. 8 .అ)

ఆ తరువాత మైత్రేయ మహర్షి వచ్చాడు. కుశల ప్రశ్నలు అనంతరం దుర్యోధనునితో "పాండవులతో విరోధం పెట్టుకోకు. నీకు, వారికి, కులానికి అది శ్రేయస్కరమవుతుంది. బకాసుర, హిడింబాసుర, కిమ్మీరులను సంహరించినవాడు, జరాసంధుని రెండుగా చీల్చివేసిన భీమసేనుని ఎదిరించగలవారెవరూ లేరు. పాండవ విద్వేషం మానుకో"- అని బోధించగా, దుర్యోధనుడు

### సూక్తి సుధలు



శ్లో॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం, పరదత్తానుపాలనం
పరదత్తాపహారేణ, స్వదత్తం నిష్ఫలం భవేత్

ఇతరులు గావించిన దానములను పాడుచేయక, బాగుగా సంరక్షించినచో తానిచ్చుట వల్ల కలుగు పుణ్యము కంటే ఇబ్బడిగ పుణ్యము లభించును. పరులిచ్చిన దానముల నపహరించుటవల్ల, దుర్వినియోగం గావించుటవల్ల తా నొసగిన దానములు కూడా నిష్ఫలములగును. (ఇది మన దేశంలో ప్రాచీన కాలమునుంచీ అన్ని దాన శాసనముల లోను వుంటున్న శ్లోకము)

 గుర్తింపుకోసం మనం చేసే హాహాకారమే అహంకారం. అది లేకపోతే మనసే మనిషికి పెద్ద అలంకారం

ఆ మహర్షి మాటలను లెక్కచేయక తన తొడను చరచి, నవ్వుతూ తలవంచి కాలితో నేలను రాస్తూ ఉన్నాడు. ఆ తిరస్కారాన్ని సహించక మహర్షి చేతిలోనికి నీటిని తీసుకొని, "నీ దర్పానికి తగిన ఫలాన్ని పొందుతావు. నీ ద్రోహబుద్ధి వల్ల మహాయుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధంలో భీమసేనుడు గదాఘాతంతో నీ తొడలు విరుగగొట్టి వధిస్తాడు" అని శపించాడు.


దానితో అదరి పడిన ధృతరాష్ట్రుడు మహర్షి పాదాలపై బడి అనుగ్రహించమని ప్రార్థించగా "నీ పుత్రుడు పాండవుల పట్ల ద్రోహబుద్ధిని మానుకొని శాంతి వహిస్తే నా శాపం అంటదు. అలా కానిచో నా శాపం అప్రతిహతం" అని చెప్పి మహర్షి వెళ్లిపోయాడు. (వన.ప. 10.అ)

-పాండవులు తిరిగి వస్తారేమో అని దుర్యోధనుడు దుః ఖిస్తుంటే వారు సత్య ప్రతిజ్ఞులు కనుక తిరిగిరారు అన్నాడు శకుని.

"వారు సత్య ప్రతిజ్ఞులు గనుక తిరిగిరారు. ఒకవేళ వస్తే కపట జూదంలో ఓడిద్దాం అని సలహా ఇచ్చాడు కర్ణుడు. ఈ సలహా దుర్యోధనునికి నచ్చలేదని తెలిసి మనమిపుడే వెళ్ళి పాండవులను వధిద్దాం. వాళ్లు కష్టాల్లో ఉన్నారు. శోకంలో ఉన్నారు. మిత్రులు, సహాయకులు ఎవరూ లేకుండా ఉన్నారు. కనుక వారిని వధించటానికి ఇదే సమయం, ఇపుడైతేనే మనం జయించగలుగుతాం" అన్నాడు కర్ణుడు.

ఇదీ కర్ణుని దుష్టబుద్ధి. కపట జూదంలో ఓడిస్తాడట. కపట జూద సూత్రధారి శకునికి ఈ ఆలోచన రాలేదు. కాని కర్ణునికి వచ్చింది. పాండవులు అసహాయులై, దీనులై, శోకగ్రస్థులై యున్న ప్పుడు రథాలతో, అస్త్ర శస్త్రాలతో వెళ్లి వారిపై బడితే తప్పక జయం కలుగుతుందట. ఇదీ వీరాధివీరుడని ప్రశంసించబడే

సూక్తి సుధలు



శ్లో॥ దానం విత్తాదృతం వాచః కీర్తిధర్మౌ తథాయుషః
పరోపకరణం కాయాత్, అసారాత్ సార మాహరేత్

జీవితంలో అసారములైన వాట్ల నుంచే సారవంతము లైన వాట్లను సంపాదించవలె. ధనం అశాశ్వతం-దానిని దానము చేసి కీర్తిని సంపాదించవలెను. అట్లే వాక్కు నుంచి సత్యమును, ఆయుష్షు నుంచి ధర్మము-కీర్తిని, శరీరము వల్ల పరోపకార పుణ్యమును సంపాదించవలెను.

కర్ణుని దుష్టబుద్ధి. ఈ సలహా వల్ల చివరకు జరిగిన దేమిటి? మైత్రేయ మహర్షి ద్వారా దుర్యోధనునికి శాపం. 'భీమసేన గదా ఘాతంతో తొడలు విరుగగొట్టబడి వధించబడతావు' అని వస్త్రాపహరణం సలహా ఇచ్చి దుశ్శాసనుని కొంపముంచాడు. దుర్యోధనునికి కనుసైగ చేసి దుర్యోధనుని కొంపముంచి ఇప్పుడు పాండవ వధ సలహాతో దుర్యోధనునికి శాపప్రాప్తి కలిగించాడు.

దుష్టుని యొక్క ఆలోచనలు, పనులు అన్నీ ఇలాగే దుష్ట ఫలితాలనిస్తాయి. సర్వనాశనానికి దారితీస్తాయి. దీనిని బట్టి కర్ణుడు దుష్ట చతుష్టయంలో ప్రప్రథమంగా పేర్కొనదగినవాడని అర్థమౌతుంది.

**5. ఘోషయాత్రకై బయలుదేర దీయించుటలో కర్ణుని పాత్ర**

"పాండవులు వనవాసం చేస్తూ ప్రస్తుతం ద్వైతవనంలో ఉన్నారని, శీతోష్ణాలకు వారు తపించిపోతూ, కృశించిన శరీరాలతో దీనులై ఉన్నార"ని వారి వద్ద నుండి వచ్చిన ఒక బ్రాహ్మణుడు ధృతరాష్ట్రునికి చెప్పగా, ధృతరాష్ట్రుడు ఎంతో విలపించాడు. ఇది విన్న శకుని- కర్ణ దుర్యోధనులున్న చోటికి వెళ్లి ఈ విషయం చెప్పగా, దుర్యోధనుడు ఆలోచనా మగ్నుడ య్యాడు. అది గమనించిన కర్ణుడు దుర్యోధనునితో ఇలా అంటున్నాడు.

శ్లో॥ ప్రవ్రాజ్య పాండవాన్ వీరాన్ స్వేన వీర్యేణ భారత।
భుదేజ్వే మాం పృథివీమేకో దివి శంబరహా యథా॥
(వన.237.అ.2 శ్లో)

తా : భరత నందనా! నీవు నీ పరాక్రమం చేత పాండవులను దేశం నుండి తరిమికొట్టి వనవాసులుగా చేశావు. ఇప్పుడు నీవు స్వర్గలోకంలోని ఇంద్రునివలె ఏకచ్ఛత్రాధిపత్యంతో రాజ్యాన్ని భోగించు. దివ్య ప్రకాశంతో వెలుగొందే ఏ రాజ్యలక్ష్మి పూర్వం పాండవులను సేవించిందో ఆ రాజ్యలక్ష్మి ఇప్పుడు సోదర సహి తుడవైన నీ అధీనంలోనికి వచ్చింది. నీ శత్రువులు అచిరకాలం లోనే శోకంతో దీనులై దుర్బలులై పోయారు. నీవు నీ బుద్ధి బలంతో యుధిష్ఠరుని వద్దనుండి ఈ సంపదను హరించావు. అందువల్ల ఈ సంపద నీ వద్ద దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. నీవు నీ పురుషార్థంతో బ్రాహ్మణుల వలన సన్మానించబడుతూ, రాజుల ద్వారా పూజింపబడుతూ దేవతలలో సూర్యునిలాగా ఈ భూమిపై ప్రకాశిస్తున్నావు.

మహారాజా! పాండవులిప్పుడు ద్వైతవనంలోని సరోవర సమీపంలో వనవాసులైన బ్రాహ్మణులతో కలిసి ఉంటున్నారని తెలిసింది. ఉత్కృష్టమైన రాజ్యలక్ష్మిచే సుశోభితుడవైన నీవు ఇప్పుడు అక్కడికి వెళ్లాలి. సూర్యుడు ఎలా తన తేజస్సు చేత జగత్తును తపింప జేస్తాడో అలాగే నీవు పాండుపుత్రులకు

సంతాపము కలిగించాలి. ఇప్పుడు నీవు రాజ్యాధికారివై యున్నావు. పాండవులు రాజ్య భ్రష్టులై యున్నారు. నీవు సంపదలతో తులతూగుతున్నావు. వారు సంపద్విహీనులై ఉన్నారు. నీవు సమృద్ధిశాలిగా ఉన్నావు. వారు నిర్ధనులైయున్నారు. ఇట్టి స్థితిలో నీవు ఒక్కసారి పాండవులను చూడాలి. వైభవంతో తులతూగే ఏ పురుషుని సంపదలను అతడు సుహృదులు, శత్రువులు చూస్తారో అతడే సబలుడైన పరిపూర్ణ పురుషుడు. పర్వతముపైనున్నవాడు నేలపై ఉన్న మనుషులను, వస్తువులను చూచినట్లు; అత్యున్నత స్థితిలో సుఖ సంతోషాలతో ఉన్న నీవు కష్టాలతో దీనస్థితిలో ఉన్న శత్రువులను కన్నులారా దర్శించటంకన్న పరమానందం ఏముంటుంది?

శత్రువుల యొక్క దీన స్థితిని చూడడం వల్ల కలిగే ఆనందం పుత్రలాభం వల్లగాని, రాజ్యలాభం వల్లగానీ, ధనలాభం వల్లగానీ కలగదు. వల్కలాజనములు ధరించి, వనవాసియై యున్న అర్జునుని కన్నులారా చూస్తే ఇక అంతకన్న పరమానందం ఏముంటుంది? దీనితో మనందరి యొక్క మనోరథం సిద్ధిస్తుంది.

సుందరమైన వస్త్రాలు ధరించి, సర్వాలంకార శోభితలైన నీ భార్యలు నార చీరలు ధరించి దుఃఖితురాలైయున్న ద్రుపద రాజ కుమారి ద్రౌపదిని చూడాలి. అదే సమయంలో ఆమె నీ భార్యలను చూచి, తన దురదృష్టాన్ని తలచుకొని, తన దైన్యపు బ్రతుకును నిందించుకొని దుఃఖించాలి. ఆనాడు మన చర్యలచేత ద్యూత సభలో పొందిన దానికన్న ఎక్కువ వైమనస్యమును దివ్యాలంకార శోభితలైన నీ భార్యలను చూచి పొందాలి. సంపదలచే వంచితులైన పాండవులు తమ నిరర్థకమైన జన్మలను తలచుకొని తలచుకొని దుఃఖసాగరంలో మునిగిపోవాలి. (వన.237.అ)

శ్లో॥ కర్ణస్య వచనం శ్రుత్వా రాజా దుర్యోధనస్తతః॥
దృష్టే భూత్వా పునర్దీన ఇదం వచన మబ్రవీత్॥ (వన.238.1శ్లో)

తా : కర్ణుని ఈ మాటలు విని దుర్యోధనుడు ముందు ప్రసన్నుడై ఆ తరువాత దీనుడై ఇలా అంటున్నాడు.

ఇవి కర్ణుని మాటలు – ఈ కర్ణుని మాటలలోని ధర్మాధర్మాలు– దుష్టత్వం ఏమిటో చూద్దాం.

**1.** దుర్యోధనుడు తన పరాక్రమంచేత పాండవులను వెళ్లగొట్టి, వనవాస గతులను చేశాడట. శకునిచేత కపటజూదం ఆడించటమే కర్ణుని దృష్టిలో పరాక్రమం కాబోలు.

**2.** దుర్యోధనుడు తన బుద్ధిబలంతో పాండవుల సంపద హరించాడట. శకుని మాయాపాచికలు దుర్యోధనుని బుద్ధి బలంతో తయారైనవి కాబోలు.

**3.** కష్టాలలో ఉన్నవారిని సుఖాలతో ఉన్నవారు చూచి వారికి సంతాపం కలిగించి ఇంకా బాధపడేట్లు చేయాలట. ఇది కర్ణుని దృష్టిలో సుగుణం కాబోలు.

**4.** దీన స్థితిలో ఉన్నవారిని చూస్తే కలిగే ఆనందం పుత్ర లాభం వల్లగాని, రాజ్యలాభం వల్లగానీ, ధనలాభం వల్లగానీ కలగదట. దీనినే పైశాచికానందం అంటారు.

**5.** నారచీరలు కట్టి దీనులైయున్న అర్జునుని, ద్రౌపదిని చూస్తే వారి మనోరథం సిద్ధిస్తుందట. ఇది కూడా పైశాచిక మనోరథమే.

ఇలాంటి దుష్ట లక్షణాలను బట్టి, పైశాచిక ఆనందాన్ని పొందాలనే బుద్ధినిబట్టి, తనను నమ్మిన మిత్రుణ్ణి తప్పుత్రోవ పట్టించడాన్ని బట్టి కర్ణుడు దుష్టులలో అగ్రేసరుడై దుష్టచతుష్టయంలో చేరిపోయాడు.

కర్ణుడిలా ఘోషయాత్రకు దుర్యోధనుని ప్రేరేపించటం వల్ల జరిగినదేమిటంటే 'చెఱపకురా చెడేవు' అనే సామెత ప్రకారం; పాండవులను బాధించాలని వెళ్లి, గంధర్వుల చేతిలో యుద్ధం తటస్థించగా; గంధర్వుల ధాటికి నిలువలేక వికర్ణుని రథమెక్కి పలాయనం చిత్తగించాడు కర్ణుడు. దుర్యోధనుడు కర్ణునిలా పారిపోకుండా ధైర్యంతో గంధర్వులనెదిరించగా ఆ గంధర్వులు దుర్యోధనుని ఓడించి, సోదర భార్యా సమేతుడైన దుర్యోధనుని బంధించి ఆకాశమార్గాన తీసుకవెళ్లగా, తనను, తనవారిని రక్షించమని స్వయంగా దుర్యోధనుడు ధర్మరాజును ప్రార్థించాడు. ధర్మరాజు తన సోదరులను బంపి గంధర్వులనోడించి దుర్యోధనాదులను బంధవిముక్తులను చేసి పంపించాడు. జరిగిన ఘోర అవమానాన్ని భరించలేక దుర్యోధనుడు, తిరిగి వచ్చే దారిలో ప్రాయోపవేశానికి కూర్చున్నాడు. అంటే కర్ణుని ఈ దుష్టకార్యంవల్ల దుర్యోధనుడు మరణించటానికి సిద్ధమైనాడు.

### సూక్తి సుధలు



*శ్లో॥ విద్యా వినయసంపన్నే, బ్రాహ్మణే గవి హస్తిని*
*శుని చైవ శ్వపాకే చ, పండితా స్సమదర్శినః*

*విద్యావినయ సంపన్నుడైన ఉత్తమ బ్రాహ్మణునియందు, గోవునందు, ఏనుగునందు, కుక్కయందు, చండాలుని యందు–అన్నిటియందును పండితులు సమదృష్టినే కలిగి వుంటారు. (అనగా సర్వమునందు బ్రహ్మమును చూచువారే పండితులని యర్థం)*



**మానవుని విచారాన్ని పోగొట్టగల ఒకే ఒక ఔషధం పని**

దీనిని బట్టి కర్ణుడు ఏమిచేసినా, ఏమి మాట్లాడినా, ఏ సలహా ఇచ్చినా అది దుర్యోధనుని ప్రాణానికే ఎసరు పెడుతుందనేది మనకు స్పష్టమవుతున్నది. ఇలా దుష్ట చతుష్టయంలో కర్ణుడు ప్రధాన పాత్రధారి అయ్యాడు.

**6.పాండవులు శాప హతులగుటకు దుర్వాసుని రెచ్చగొట్టుట:**

సూర్యుని అనుగ్రహం వల్ల లభించిన అక్షయ పాత్రతో పాండవులు బ్రాహ్మణులను సంతృప్తి పరుస్తూ, కష్టములను సహిస్తూ కాలం గడుపుతున్నారని తెలుసుకొని కర్ణ దుర్యోధనులు దురాలోచన చేస్తుండగా ఒకనాడు 10వేల మంది శిష్యులతో దుర్వాస మహర్షి వచ్చాడు. ఆయనకు అనేక సపర్యలు చేస్తున్నాడు దుర్యోధనుడు. దుర్యోధనుని సేవలకు మెచ్చి వరం కోరుకో మన్నాడు మహర్షి. ఇలాంటి వరాన్ని మహర్షి వల్ల పొందాలని ఇంతకు ముందే కర్ణ దుశ్శాసనులతో ఆలోచించిన దుర్యోధనుడు "మహాత్మా! మా వంశంలో జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు ఐన ధర్మరాజుకు కూడా నీవు అతిథివి కావాలి. అది కూడా సౌశీల్యవతి ద్రౌపది బ్రాహ్మణులను, పతులను భుజింపజేసి, తాను కూడా భుజించిన తరువాతనే నీవు అతిథివి కావాలని నా కోరిక" అన్నాడు దుర్వాస మహర్షి అలాగేనని చెప్పి వెళ్లాడు.

అప్పుడు దుర్యోధనుడు కర్ణుని చేయిపట్టుకొని కృతార్థుల మైతిమని సంతోషించగా **కర్ణుడు కూడా సోదరసహితుడైన దుర్యోధనునితో సంతోషిస్తూ ఇలా అంటున్నాడు.**

**శ్లో॥ దిష్ట్యా కామః సుసంవృత్తో దిష్ట్యా కౌరవ వర్ధసే!**
**దిష్ట్యైతే శత్రవో మగ్నా దుస్తరే వ్యసనార్ణవే॥**

(వన.262.అ.26శ్లో)

**శ్లో॥ దుర్వాస క్రోధజే వహ్నౌ పతితాః పాండునందనాః ।**
**స్వైరేవతే మహాపాపైః గతావై దుస్తరం తమః ॥**

(వన.262.అ.27శ్లో)

**తా : కురునందనా! అదృష్టవశమున మన కోరిక నెరవేరి నది. మహాభాగ్యం. నీవు వర్ధిల్లెదవు. నీ శత్రువులు అపార దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఇది ఎంతటి సౌభాగ్యం! పాండవులు దుర్వాస మహర్షియొక్క క్రోధాగ్నిలో పడిపోయారు. తాము చేసిన మహాపాపాలను బట్టియే వారు దుస్తరమైన నరకంలో పడిపోయారు.**

- పాండవులు మహాపాపాలు చేశారట. వారణావతానికి వెళ్లమంటే వెళ్ళటమా? అర్థరాజ్యంగా కీకారణ్య ప్రాంతాలతో కూడిన ఖాండవ ప్రస్థాన్ని ఇచ్చిపొమ్మంటే పోవటమా? వారు సర్వ సంపదలతో తులతూగుతూ ఉంటే సహించలేక, వారి సంపదను హరించుటకు మాయా జూదానికి ఆహ్వానిస్తే వచ్చి, ఆడి, ఓడటమా? అరణ్య అజ్ఞాత వాసపణముగా కపట జూదములో ఓడి, అరణ్యాలకు వెళ్లటమా? అరణ్యాలలో కూడా వారిని ప్రశాంతంగా ఉండనీయరాదని, వారిని హీనపరిచి వారి ఎదుట తమ ఆధిక్యతను చాటుటకు ఘోషయాత్రా నెపంతో వచ్చి; గంధర్వులతో తటస్థించిన యుద్ధంలో ఓడి బందీలైన దుర్యోధనాదులను భార్యలతో సహా విడిపించి పంపించటమా? ఏవి పాపాలు? పాపాలు చేసినదెవరు? దుర్మార్గులెవరు? దుష్టులెవరు? ప్రత్యక్షంగా పాండవులనెదుర్కోలేని అశక్తులు దుర్వాసుని ద్వారా పాండవులను శాపగతులను చేయుటకు ఎత్తిన ఎత్తు వీరత్వమా? దుర్జనత్వమా? ఈ కర్ణుడు - శత్రువులు దుఃఖసాగరంలో మునిగిపోయారని సంతోషించే కర్ణుడు పుణ్యాత్ముడా? సజ్జనుడా? పాండవులు పాపాత్ములా? అది నోరేనా?-

ఎన్ని రకాలుగా అన్యాయాలు చేసినా, మోసాలు చేసినా, చంపాలనుకొన్నా చేసిన ప్రయత్నాలన్నీ ఎందుకు బెడిసి కొడుతున్నాయి? మహాభారతంలోని దుష్టులలోకెల్లా దుష్టుడు కర్ణుడని - దుష్టచతుష్టయంలో అతి ముఖ్యుడని ఋజువు కావటం లేదా?-

**ఇక దుష్టత్వమే కాదు కర్ణుని వాచాలత్వం ఎట్టిదో చూద్దాం...**

**(వచ్చే సంచికలో)**

## తెలుసుకుందాం

దేశాన్ని మొదట ఆధాత్మిక భావాలతో నింపివేయుడు. తక్కిన భావాలు తదుపరి ప్రవేశించవచ్చును. ఆధ్యాత్మికత, ఆధ్యాత్మిక విజ్ఞానము అన్నిటికంటే చాల గొప్పవస్తువు. ఎలాగంటే అది పెక్కు జన్మలయొక్క బాధలనుండి జీవుని రక్షించును. జన్మ రాహిత్యమును కలుగజేయును.



ఎవని జీవితం అల్ప ప్రాపంచిక పదార్థములపై ఆధారపడియుండదో, అతడే గురువు. ఒక ఉన్నత లక్ష్యం కోసం ఆ ఏకైక లక్ష్యం కోసం జీవించండి. ఆ లక్ష్యం మహోన్నతమై, మహాశక్తివంతమై ఉండాలి. మనస్సు నందు ఆ లక్ష్యమొకటి తప్ప మరియొకటి ఏదీ వుండకూడదు. ఇతరములైన వాటికి చోటీయకూడదు. వాటికై సమయాన్ని వెచ్చించకూడదు.

 **నువ్వు భగవంతుణ్ణి ప్రేమిస్తే చాలదు, భగవంతుడు నిన్ను ప్రేమించేటట్లు నడుచుకోవాలి**

# మహాభారతం

## కర్ణుడు వాచాలత్వం 35

రచన
మహాభారత పరిశోధకులు, అభినవ వ్యాస
జ్ఞానప్రపూర్ణ శ్రీ **దేవిశెట్టి చలపతిరావు** B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట
ఫోన్ : 08647-254716, సెల్ : 80085 39770
visit:www.srichalapathirao.com

(గత సంచిక తరువాయి)



కర్ణుని యొక్క వాచాలత్వం ఎట్టిదో మహాభారత గ్రంథం ఏమి చెబుతున్నదో పరిశీలిద్దాం. ఇంతవరకు కర్ణుని దుష్టత్వాన్ని చూశాం. ఇక కర్ణుని వాచాలత్వం ఎట్టిదో పలకకూడని పలుకులెన్ని పలికాడో చూద్దాం.

**1. కుమారాస్త్ర విద్యా ప్రదర్శన సందర్భంగా అనుచిత పలుకులు!**

కురు కుమారుల అస్త్ర విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత ద్రోణాచార్యుడు ధృతరాష్ట్రుని వద్దకెళ్లి, "మహారాజా! నీ బిడ్డలందరూ అస్త్ర శస్త్ర విద్యలన్నింటియందు నిష్ణాతులయ్యారు. మీరు అనుమతిస్తే కుమారుల అస్త్రవిద్యా ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తాను" అన్నాడు. ధృతరాష్ట్రుడు ఎంతో సంతోషించి అనుమతిని ప్రసాదించాడు.

కుమారాస్త్ర విద్యా ప్రదర్శన జరుగుతున్నది. ధర్మరాజు బల్లెం విసరటంలో నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. భీమ దుర్యోధనులు గదా యుద్ధ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అర్జునుడు వివిధ దివ్యాస్త్రాలను ప్రయోగించి సభికులను ఆశ్చర్య చకితులను చేశాడు. అప్పుడు ప్రవేశించాడు కర్ణుడు. పరశురాముని వద్ద ధనుర్విద్యను, అస్త్రవిద్యను, బ్రహ్మాస్త్రాన్ని పొంది వచ్చిన కర్ణుడు రంగ భూమిలో ప్రవేశించి, కృపద్రోణులకు నమస్కరించి, అర్జునునితో– **"అర్జునా! నేను నీవు చూపిన విద్యలకన్నా అధికంగా చూపగలను. నీ పరాక్రమానికి గర్వించకు"** అన్నాడు.

అసలు కర్ణుడిలా ప్రవేశించటం ఉచితమైన పనేనా? ఇది కురు కుమారుల అస్త్రవిద్యా ప్రదర్శనకు ఏర్పాటు చేయబడిన రంగభూమి, అందుకే దీనిని 'కుమారాస్త్ర విద్యా ప్రదర్శనము' అన్నారు. పోనీ 'ద్రోణాచార్యుడు శిష్యులను పరీక్షించడానికి ఏర్పాటు చేసిన ప్రదర్శన గనుక, తాను కూడా ఒకప్పుడు ద్రోణాచార్యుని శిష్యుడే గనుక పాల్గొనే అధికారం ఉంది' అని కర్ణుడు భావించాడనుకుందాం. అలాగైతే ద్రోణాచార్యుని వద్ద కురు కుమారులతోపాటు ధనుర్విద్యను అభ్యసించిన దేశ దేశాల రాజ కుమారులున్నారు గదా! ఎవరిదాకానో ఎందుకు ద్రోణాచార్యుని సహాధ్యాయి ద్రుపద మహారాజు కుమారులు శిఖండి, దృష్టద్యుమ్ను లున్నారుగదా! యదు వంశీయులైన రాజపుత్రులెందరో ఉన్నారుగదా! మరి వారెవ్వరైనా ఇందులో పాల్గొన్నారా? పోనీ ప్రత్యేకంగా కర్ణునికి ఆహ్వానమేమైనా ఉన్నదా? మరెందుకు ప్రవేశించినట్లు? బల ప్రదర్శనకా? నేను గొప్ప వీరుణ్ణని, అర్జునుని కన్న మిచిన వాడినని ఋజువు చేసుకోవడానికా? నేను నీ కన్నా అధికంగా విద్యలను చూపగలను అంటున్నాడు కర్ణుడు. ఎవరడిగారు? నీ పరాక్రమానికి గర్వించకు– అంటున్నాడు, పిలవకుండా ఇతరుల వ్యవహారంలో తలదూర్చి నేను గొప్ప వీరుణ్ణని పలికే నీదా గర్వం? అర్జుననిదా? ఇదే వాచాలత్వం. ఇంకేమంటున్నాడు?–

*శ్లో॥ రంగో యం సర్వ సామాన్యః కి మత్ర తవ ఫాల్గుణ।*
*వీర్య శ్రేష్ఠాశ్చ రాజానో బలం ధర్మో నువర్తతే॥*
(ఆది. 135, అ.19 శ్లో)

**తా॥** "అర్జునా! ఈ రంగమండపం అందరికీ చెందినది. ఇందులో నీదేమీ లేదు. బల పరాక్రమాలలో శ్రేష్ఠులెవరో వారే రాజుగా పిలువబడతారు. ధర్మం కూడా బలాన్నే అనుసరిస్తుంది" అన్నాడు. రంగమండపం అందరిదట. ఇందులో అర్జుననిదేమీ లేదట. బలపరాక్రమాలున్నవాడే రాజట. ధర్మం బలాన్ని అనుసరిస్తుందట. అంటే బలమున్న వాడిదే ధర్మం అని. ఇది కర్ణుని వాచాలత్వం, అసందర్భ ప్రలాపం. ఇంకా ఏమన్నాడు?

మాటలతో కాక బాణాలతో సమాధానం చెప్పు. ఈ రోజు నేను నీ గురువు సమక్షంలోనే నీ తలను త్రెగవేస్తాను – అంటే రంగభూమి తలలు తెగవేయడానికి ఏర్పాటు చేయబడ్డదన్న మాట. ఇదీ కర్ణుని వరుస. నోటికి వచ్చినట్లు ప్రేలటం చిన్నతనం నుండే అలవాటయింది. ఇదే చివరిదాకా కొనసాగించాడు కర్ణుడు.

అయితే కర్ణుడిలా నోటికి వచ్చినట్లు ప్రేలినందుకు ప్రతిఫలంగా దుర్యోధనునితో సఖ్యత ఏర్పడ్డది. అంగరాజ్యం తనకు వచ్చింది. కాకపోతే అర్జునుణ్ణి పొడిచేస్తాను, నరికేస్తాను అని

ప్రగల్భాలు పలికిన కర్ణుడు, ఆ వెంటనే గురుదక్షిణ సమర్పించటానికై దుర్యోధనాదులతో కలసి ద్రుపదునిపై దండెత్తినప్పుడు, ద్రుపదుడు 28 నిశిత బాణాలతో కర్ణుని అంగసంధులలో తాడనం చేయగా యుద్ధభూమి నుండి పారిపోయి వచ్చాడు. దుర్యోధనాదులు ద్రుపదుని చేతిలో ఓడి తిరిగి వచ్చారు. అర్జునుడు భీముని సాయంతో ద్రుపదునిపై దండెత్తి ద్రుపదుని జయించి, బంధించి తెచ్చి ద్రోణాచార్యునికి గురుదక్షిణ సమర్పించాడు.

మాటిమాటికి ఓడిపోతున్నా, ఓడిపోయి పారిపోతున్నా నేనే వీరాధి వీరుణ్ణని ప్రగల్భాలు పలకటం, దుర్యోధనుని నమ్మించటం కర్ణునికి పరిపాటయిపోయింది.

ఇక కర్ణుని వాచాలత్వానికి పరాకాష్ట ద్యూత సభలో ద్రౌపదిని తులనాడుట. అదేమిటో చూద్దాం.

**2. ద్యూత సభలో ద్రౌపదీ పాండవులను తులనాడిన వాచాలత్వం**

"నేను ధర్మవిజితనా? అధర్మ విజితనా? ధర్మనిర్ణయం చేయండి" అని ద్రౌపది సభాసదులను ప్రశ్నించగా ఎవ్వరూ సమాధానం చెప్పకపోవటంతో ధృతరాష్ట్రుని పుత్రుడు, దుర్యోధనుని సోదరుడు ఐన వికర్ణుడు ధర్మనిర్ణయం చేస్తూ "ధర్మరాజు తనను తాను ఒడ్డుకొని ఓడిపోయిన తర్వాత; తనంత తానుగా గాక శకుని ప్రేరణతో పందెం వేశాడు కనుక ద్రౌపదీ పణం చెల్లదని - ద్రౌపది అధర్మ విజిత" అని చెప్పి అట్టి ద్రౌపదిని - రజస్వలయై ఏకవస్త్రయైన ద్రౌపదిని సభకు తీసుకురావటం అధర్మమని - తప్పని చెప్పాడు. దానికి సమాధానంగా కర్ణుడు, **ధర్మరాజు ఓటమిలో ద్రౌపది ఓటమి కూడా ఉన్నదని చెబుతూ ద్రౌపదిని సభకు తీసుకరావటంలో ఏ తప్పులేదని చెప్పటానికి ఏమన్నాడో చూడండి. స్త్రీకి దైవం నిర్ణయించిన భర్త ఒక్కరే ఉండాలి. కాని ఈమెకు ఐదుగురు భర్తలున్నారు. కనుక ఈమె బంధకి, ఇట్టిదానిని ఏకవస్త్రయేకాదు, వివస్త్రను చేసి తెచ్చినా తప్పులేదు. పాండవులు శకునిచే ధర్మబద్ధంగా గెలుచుకోబడ్డారు. ద్రౌపది పాండవుల సొత్తు గనుక ఆమె కూడా ధర్మంగా జయించబడినట్లే**- అన్నాడు కర్ణుడు.

ఇక్కడే కర్ణుని వాచాలత్వం, అసభ్యంగా, హీనుడిలా, త్రాగుబోతులా మాట్లాడటం మనకు కన్పిస్తుంది. **పాండవులు శకునిచే ధర్మంగా జయించబడ్డారట. ఇది మాయా జూదమని, శకుని కపటంతోనే పాండవులు జయించబడ్డారని కర్ణునికి తెలియదా? ఈ ప్రణాళికలో ముందు నుంచి చివరి వరకు ఉన్నవాడే గదా కర్ణుడు. ఇది ఒకటి-**

ధర్మరాజు ఓటమిలో ద్రౌపది ఓటమి ఉన్నదట. మరి ధర్మరాజు ఓడితే ద్రౌపది కూడా ఓడినట్లే అయితే శకుని "ఓ ధర్మనందనా! నీకింకా ఓటు పడని ధనం ఉన్నది. ఆమె ద్రౌపది. ఇప్పుడు ఆమెను పణంగా పెట్టి ఆమెద్వారా నీ దాస్యాన్ని తొలగించుకో...." అని ఎందుకన్నాడు? శకుని అలా అంటుంటే ఈ ధర్మమూర్తి కర్ణుడు ద్రౌపది ఇప్పటికే ఓడిపోయి దాసి అయింది. నీవు మళ్ళీ ప్రత్యేకంగా పణం పెట్టించడం ఎందుకు? అని శకునిని అడ్డుకోలేదేం? - ఇది రెండు....

ఇక అన్నింటికన్నా సభ్యత, సంస్కారం వదలి వదరిన వాచాలత్వం ఒకటి ఉన్నది. **ద్రౌపదికి ఐదుగురు భర్తలున్నారు; స్త్రీకి దైవ విహితుడైన భర్త ఒక్కడే ఉండాలి. అందువల్ల ఈమె బంధకి. ఇట్టిదాన్ని వివస్త్రను చేసి సభకు తెచ్చినా తప్పులేదు** - అట.

ద్రౌపదికి ఐదుగురు భర్తలు అనేది దైవనిర్ణయమా? కాదా? అసలు దైవనిర్ణయం అంటే ఏమిటి? వివాహ పూర్వకంగా భార్యాభర్తలు కావటమే. మరి ద్రౌపదికి వివాహ పూర్వకంగానే దృపద దృష్టద్యుమ్నుల ఎదుట, ధౌమ్య మహర్షి సారధ్యంలో పాండవులైదుగురు రోజుకొక్కరు చొ॥న వివాహమాడి భర్తలయ్యారు గదా! అంతేకాదు ద్రౌపది పూర్వజన్మలో ఋషికన్యగా చేసిన తపస్సుకు మెచ్చి, సాక్షాత్తు పరమశివుడే పంచపతిత్వాన్ని ప్రసాదించాడుగదా! ఇది దైవనిర్ణయం కాదా!

ఇక 'బంధకి' అన్నాడు. శాస్త్రంలో బంధకి అంటే అర్థం ఏమిటి? వేశ్య అని. వివాహమాడిన భర్తను గాక పరపురుషులు నలుగురితో కలసిన స్త్రీని బంధకి (వేశ్య) అంటారు. మరి పాండవులు పరపురుషులా? భర్తలా? నోటికి వచ్చినట్లు ప్రేలటమేనా?-

ఈనాడు ఏ ద్రౌపదిని బంధకి అంటున్నాడో..

**జీవన వేదం**

## విలువైన జ్ఞానాన్ని పొందాను

ఈ టిటిసి ద్వారా నా మనసులోని బరువు దిగిపోయినట్లయింది. సత్యదర్శనం-ఆత్మస్థితి కోర్సు పూర్తయిన తర్వాత కూడా ఆ స్థితిని పొందాలని నేను చేసిన ప్రయత్నం సఫలీకృతం కాలేదు. జీవన వేదం కోర్సు పూర్తయిన తర్వాత కలిగిన అనుభూతి ఏమిటంటే నా శరీరాన్ని నేను ఆత్మస్థితిలో దర్శనం చేసుకున్నట్లుగా ఆ శరీరాన్ని చూడగానే నేను ఏమీ కాను అన్న భావన కలిగింది. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' అని సామాజిక సేవల కోసమే శరీరం వచ్చిందని అనుభూతి కలిగింది. ఇటువంటి విలువైన జ్ఞానాన్ని నా తుదిశ్వాస వరకూ అందించడమే నా బాధ్యత.

*-వెంకట్రమణ గురూజీ, ప్రొద్దుటూరు*


ధనం మనల్ని అదుపుచేయడం ప్రారంభించిన రోజున మనం నిజంగా పేదవాళ్లం.

ఆ ద్రౌపది అర్ధాంగిగా ధర్మరాజు రాజసూయ యాగం చేస్తే దానికి భీష్మ, విదుర, ధృతరాష్ట్రులు, ద్రోణ, కృప, అశ్వద్ధామలు, బాహ్లీక, సోమదత్త, భూరిశ్రవులు, శల్య, శకుని, సైంధవ, దుర్యోధన, దుశ్శాసన, వికర్ణులతో బాటుగా వెళ్లి, ఈ ద్రౌపదీ పాండవుల చేత సకల సత్కారాలు పొంది వచ్చినవాడేగదా ఈ కర్ణుడు. ఆనాడు ద్రౌపదీదేవి కులకాంతయా? ఈనాడు కులటయా? బంధకియా? అది నోరా? తాటిపత్రా?

**పూజ్యురాలైన పరమ పతివ్రతా శిరోమణిని బంధకి యనుటయే మహాపాపమైతే ఆమెను వివస్త్రను చేసి సభకు తెచ్చినా తప్పులేదంటాడా ఈ కర్ణుడు! ఇది మనుష్య లక్షణమేనా? కనీసపు మానవత్వం ఉన్నదా? సభ్యత ఉన్నదా? ఎవరేమనుకుంటారో అనే సిగ్గు- బిడియం ఉన్నాయా? సభ్య సమాజం తలదించుకొనే విధంగా మాట్లాడడం పైశాచికత్వం కాదా! ఎంతటి పాపాత్మురాలినైనా, దుర్మార్గురాలినైనా వివస్త్రను చేయాలనుకునేవాడు మనిషేనా? అలాంటివాడు ఈ కలియుగంలోనైనా మానవుడుగా పరిగణించబడతాడా?**

ఏ హానీ చేయని ఒక పతివ్రతామతల్లిని, కురువంశపు కోడలిని, ఒక సామ్రాజ్య పట్టమహిషిని, ఆ కురువంశపు పెద్దలందరి ఎదుట వివస్త్రను చెయ్యాలంటాడా? చెయ్యమని ఆదేశిస్తాడా? అసలు ఒక త్రాగుబోతైనా ఇలా మాట్లాడుతాడా? **రామాయణంలో త్రాగి వాగిన చాకలి ఒకడున్నాడు. మళ్లీ భారతకాలంలో త్రాగకుండానే అంతకన్నా ఘోరంగా వాగిన వాచాలుడు ఈ కర్ణుడున్నందుకు సభ్యత గలిగిన వారు తలలు వంచుకోవాలి. ఇది కర్ణుని వాచాలతకు పరాకాష్ట.**

ఇక ఆ తరువాత వస్త్రాపహరణమనే పరమనీచమైన, హేయమైన, పైశాచిక కృత్యానికి తెరతీసిన కర్ణుడు, ద్రౌపదీదేవి పాతివ్రత్య మహిమతో అనంత వస్త్రావిర్భావం జరిగి సభాసదులంతా ఆశ్చర్యానందాలలో మునిగిపోతే ఈ కర్ణుడప్పుడు ఏమంటున్నాడు...."**ద్రౌపదీ! నీకు ఐదుగురు భర్తలున్నా ఏం ప్రయోజనం? జూదంలో ఆలిని ఒడ్డి ఓటు పడని ఆరవ వానిని భర్తగా ఎంచుకో"** అంటూ దుర్యోధనుని వైపుకు చూచి కనుసైగ చేయగా దుర్యోధనుడు తొడపై వస్త్రాన్ని తొలగించి ద్రౌపదిని తన తొడపై కూర్చోమని సైగ చేశాడు. ఇంతలా రెచ్చిపోయి కర్ణుడు వాగిన వాగుడు వల్లనే సర్వనాశనం జరిగిందనేది నిర్వివాదాంశం.

ఇంకా సభలో కర్ణుడు ద్రౌపదిని "**ద్రౌపదీ నీవిప్పుడు కౌరవ దాసివి. దాసీ జనులతో కలిసియుండు. దుర్యోధనుని భార్యకు పాద సంవాహనము చెయ్యి (కాళ్లు ఒత్తు)" అని ఎకసెక్కెములాడాడు. ద్యూత సభలో ఇలా రెచ్చిపోయి కులకాంతపై తన వాచాలత్వాన్ని ప్రదర్శించాడు వీరాధివీరుడని అభిమానులచే ప్రశంసించబడే వాచాలుడైన కర్ణుడు.**

**3. ప్రాయోపవేశగతుడైన దుర్యోధనునితో చేసిన ప్రసంగం :**

అరణ్యాలలో ఉన్న పాండవులను దుఃఖాలపాలు చేయాలనే దురాలోచనతో ఘోషయాత్ర పేరుతో ద్వైత వనం వెళ్లిన దుష్ట చతుష్టయం గంధర్వులతో యుద్ధం తటస్థించగా తీవ్రమైన యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో గంధర్వుల ధాటికి నిలువలేని కర్ణుడు వికర్ణుని రథమెక్కి పారిపోగా, దుర్యోధనుడు సోదర సహితుడై గంధర్వులనెదిరించి పోరాడాడు. కాని గంధర్వులు విజయం సాధించి, సోదర భార్యా సహితుడైన దుర్యోధనుని బంధించి ఆకాశమార్గాన తీసుకువెళుతుండగా, ఇది తెలిసిన ధర్మరాజు భీమార్జునలను పంపించాడు. వారు గంధర్వులను జయించి దుర్యోధనాదులను బంధవిముక్తులను గావించారు. అలా ధర్మరాజు దయాదాక్షిణ్యాలతో బంధవిముక్తుడైన దురభిమాని దుర్యోధనుడు హస్తినాపురికి బయలు దేరి, మార్గమధ్యంలో ఒకానొక ప్రదేశంలో సేనలను ఆపి, ఖిన్నుడై కూర్చున్నప్పుడు రణరంగంనుండి పారిపోయిన కర్ణుడు వచ్చి సంతోషంతో దుర్యోధనునితో ఇలా అంటున్నాడు.-

**"దుర్యోధనా! కామరూపులైన ఆ గంధర్వులను జయించి ఇలా జీవించి ఉండటం, మనం మరల కలుసుకోవటం నాకెంతో ఆనందంగా ఉన్నది. నేను క్షతగాత్రుడనై రణరంగము విడిచిపోక తప్పలేదు"** అన్నాడు.

అంటే యుద్ధం ఎలా జరిగిందో- ఎవరు గెలిచారో- ఏమి జరిగిందో తెలుసుకొనే వీలులేనంత దూరం **'వెనుకకు తిరిగి చూడకుండా పారిపోయాడన్న'** మాట కర్ణుడు.

కర్ణుని మాటలు విన్న దుర్యోధనుడు, "రాధేయా! జరిగినది ఏమిటో తెలియక మాట్లాడుతున్న నీ మాటలను తప్పుపట్టను.

### సూక్తి సుధలు



**శ్లో|| ఉపాధ్యాయాన్ దశాచార్య,**
**ఆచార్యాణాం శతం పితా**
**సహస్రంతు పితౄన్ మాతా**
**గౌరవేణాతి రిచ్యతే**

పదిమంది ఉపాధ్యాయులకంటే ఆచార్యుడు అధిక గౌరవార్హుడు. నూర్గురు ఆచార్యులకంటే తండ్రి, తండ్రి కంటే వేయిరెట్లు తల్లిన్నీ పూజ్యనీయులు.



**మన శక్తి కన్నా మన సహనమే అద్భుత విజయాలు సాధిస్తుంది.**

ఈ ఉపద్రవం నుండి మా అందరిని కాపాడినవారు పాండవులు. మమ్ము బంధించిన గంధర్వరాజు, ఏ సంకల్పంతో మనం ఇక్కడకు వచ్చామో- అంతా పూస గ్రుచ్చినట్లు వారి దగ్గర చెబుతుంటే నేను తల పైకెత్తలేక ఖిన్నుడనైపోయాను. నేను స్త్రీల సమక్షంలో బంధింపబడి, దీనుడనై ధర్మరాజు వద్దకు తీసుకుపో బడ్డాను. ఇంతకంటే ఘోర దుఃఖం ఇంకేముంటుంది? ఏ పాండవులు నాచేత రాజ్య భ్రష్టులయ్యారో, ఏ పాండవులకు నేను నిత్య శత్రువునో, ఆ పాండవులచేత నేను బంధవిముక్తుడ నయ్యాను. ఏ పాండవుల ప్రాణాలు తీయాలనుకున్నానో, ఆ పాండవులు నాకు ప్రాణదానం చేశారు. రాధేయా! ఆ గంధ ర్వులు నన్ను వధించినా నాకు శ్రేయస్సు కలిగేది. ఇలా బ్రతకడం వ్యర్థం.

**రాధేయా! నీతి తప్పిన వారు సంపదలను, విద్యను, ప్రాభవాన్ని పొంది కూడా చిరకాలము పొదవలసిన శుభములను పొందలేరు. దానికి మదోన్మత్తుడనైన నేనే నిదర్శనం.** చేయరాని దుష్కార్యమును చేసి స్వయంకృతాపరాధంగా ఈ దురవస్థను తెచ్చి పెట్టుకున్నాను. కనుక ఇక నేను బ్రతుకను. దుశ్శాసనుని రాజ్యాధికారిగా చేస్తాను. అని ప్రాయోపవేశానికి కూర్చున్నాడు దుర్యోధనుడు. (వన ప. 249 అ.1.33 శ్లో)

అప్పుడు కర్ణుడు దుర్యోధనునితో, "దుర్యోధనా! దుఃఖిస్తూ ఉంటే దుఃఖం పెరుగుతుందేగాని తగ్గదు. దుఃఖాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి. మన దుఃఖం శత్రువులకు సంతోషదాయకం అనే విషయం మరచి పోవద్దు.

*శ్లో॥ కర్తవ్యం హికృతం రాజన్ పాండవై స్తత్ర మోక్షణం*
*నిత్యమేవ ప్రియం కార్యం రాజ్ఞో విషయవాసిభిః*
(వన ప.249 అ.39 శ్లో)

*శ్లో॥ పాల్యమానా స్త్వయాతేహి నివసంతి గతజ్వరాః*
*నార్హన్త్యేవంగతే మన్యుం కర్తుం ప్రాకృతవద్ యదా*
(వన ప.249 అ.40 శ్లో)

**తా॥ రాజా! పాండవులు నిన్ను గంధర్వుల చెరనుండి విడిపించి వారి కర్తవ్యాన్ని వారు నిర్వర్తించారు. రాజుయొక్క రాజ్యంలో నివసించే వారు ఎల్లప్పుడూ ఆ రాజుకు ప్రీతి కలి గిస్తూ ఉండాలి. నీవు రాజువు. పాండవులు నీ దాసులు. కనుక నిన్ను రక్షించుట వారి విధి. నీ చేత రక్షించబడుతూ వారు ఇక్కడ నిశ్చింతగా నివసిస్తున్నారు. ఈ స్థితిలో నీవు అల్ప మానవుని లాగ దీనుడిలాగ విచారించటం తగదు. పాండవులు నిన్ను రక్షించుటలో చిత్రమేమున్నది?** (39-40)

*శ్లో॥ న చైత త్సాధు యద్రాజన్ పాండవాస్త్వాం నృపోత్తమం*
*స్వసేనయా సంప్రయాంతం నానుయాంతిస్మ పృష్ఠతః*
(వన ప 250. అ. 6 శ్లో)

**తా॥ "ఓ రాజా! శ్రేష్ఠ మహారాజువైన నీవు నీ సేనలతో వనంలో సంచరిస్తున్నావు. ఇలాంటి సందర్భంలో ఇక్కడ నివసిస్తున్న పాండవులు నిన్ను అనుసరించి రాకపోవటం వారి తప్పు. నీకు సహాయ పడకపోతే అది వారి తప్పు అవుతుంది. వారెప్పుడో పూర్వమే నీకు దాసులయ్యారు. కనుక నీకు సాయ పడటం వారి విధి"** అని చెప్పి నీవు మరణిస్తే నేనూ నీతో బాటే మరణిస్తాను - అన్నాడు కర్ణుడు. అయినా దుర్యోధనుడు తన మరణ సంకల్పాన్ని విరమించలేదు.

ఇక్కడ కర్ణుడు మాట్లాడిన మాటలలో ఏదైనా నిజం ఉందేమో చూద్దాం. 1. పాండవులు ఎప్పుడో దుర్యోధనునికి దాసులట. అందువల్ల దుర్యోధనుని విడిపించి కర్తవ్యాన్ని పాలించారట.

పాండవులు ఎప్పుడు దాసులయ్యారు? మొదటి జూదంలో. ఆ తరువాత ద్రౌపదీ వస్త్రాపహరణం, అనంత వస్త్రావిర్భావం, అప్పటి ఉత్పాతాలకు భయపడిన ధృతరాష్ట్రుడు పాండవులను దాస్య విముక్తులను గావించి, వారి రాజ్యాన్ని వారికిచ్చి పంపిం చాడు. **కనుక పాండవులు దాసులు అనేమాట మదోన్మత్తుడై చేసే ప్రలాపమేగాని నిజంకాదు. వారు దాసులు కాదుగనుక దుర్యోధనుని రక్షించవలసిన కర్తవ్యం వారికేమీ లేదు. కేవలం వారి ఉపకార బుద్ధి వల్లనే రక్షించటం జరిగింది.**

**2.** వారు నీ చేత రక్షింపబడుతూ ఇక్కడ నిశ్చింతగా నివసిస్తున్నారు -అట. **పాండవులు వనాలలో దుర్యోధనునిచేత రక్షించబడుతున్నారా?** ఏమి రక్షణ ఇస్తున్నాడు దుర్యోధనుడు? పాండవులు అశక్తులై ఏ రక్షణను దుర్యోధనుని కోరారు? అసలు రక్షణ ఇవ్వటం మాట అటుంచి, వారి మానాన వారిని బ్రతక నివ్వక వారిని అవమాన పరచాలని ఇప్పుడు ఘోషయాత్రా నెపంతో వచ్చారు. ఇంతకు ముందు వారిని వధించాలని

**సూక్తి సుధలు**



*శ్లో॥ జ్ఞాతిభి ర్వంచ్యతే నైవ*
*చోరేణాపి న నీయతే*
*దానేన న క్షయం యాతి*
*విద్యారత్నం మహాధనమ్*

జ్ఞానము పెన్నిధి వంటిది. అది జ్ఞాతులు వంచించి తీసుకోడానికి వీలు లేనిది. దొంగలు అపహరించ జాలనిది. దానము చేసినా తరుగులేనిది. అది ఒక అనర్ఘ రత్నము.


**గెలవాలంటే ఓటమికి కారణాలు తెలియాలి.**

ప్రయాణమై కూడా వ్యాసుని మాటలతో ఆగిపోయారు. కనుక **దుర్యోధనుడు పాండవులకు రక్షకుడు కాదు భక్షకుడు. అయినా సరే. ఎవరేమనుకుంటే నాకేం అని త్రాడు బారి కూర్చుని మాట్లాడుతున్నాడు కర్ణుడు.**

3. మహారాజువైన నీవు సేనలతో వచ్చినప్పుడు పాండవులు నిన్ననుసరించి నీ వెనక రాకపోవడం తప్పు. నీకు సహాయం చేయపోతే తప్పు.అట.

**మొగుణ్ణి కొట్టి మొగసాలకెక్కటం అంటే ఇదే. పాండవులను పరాభవించాలని వచ్చిన దుర్యోధనాదులను పాండవులు వెనుక వుండి అనుసరిస్తూ రక్షించాలట. మేం సేనలతో మీరున్న చోటకు వస్తున్నాం అని దుర్యోధనుడుగాని, ఈ కర్ణుడు గాని కబురు చేశారా పాండవులకు? కనీసం వచ్చిన తర్వాతైనా చెప్పారా? ఏం చెబుతారు పాపం! "కష్టాలలో ఉన్న మిమ్ము సుఖాలతో ఉన్న మేము మా వైభవాన్ని చూపి అవమానించాలని వచ్చాం" అని చెబుతారా? ఇదీ కర్ణుని నైజం. వాచాలత్వం. అసందర్భ ప్రలాపం. అబద్ధాలతో జీవించటం.**

కర్ణుని మాటలలో ఏ మాత్రం సమంజసత్వం లేకపోవటం వల్లనేమో దుర్యోధనుడా మాటలనసలు పట్టించుకోలేదు. ఈ సందర్భంలో శకుని ఏమన్నాడో చూడండి.

"దుర్యోధనా! నాచేత హరించబడి నీకర్పించబడిన గొప్పదైన పాండవ సంపదను మూర్ఖత్వంతో విడిచిపెడతావా? పాండవులు నిన్ను రక్షిస్తేనే నీకు ఇంత దుఃఖం కలుగుతున్నదే వారసలు నిన్ను అనాదరిస్తే ఏం జరిగేది? నీవిలా శోకించి పాండవులు చేసిన మేలును భగ్నం చేయకు. వారు నిన్ను రక్షించినందుకు సంతోషించి, వారిని ఆదరించవలసిన నీవు విరుద్ధంగా ప్రవర్తించటం న్యాయం కాదు. ప్రాణత్యాగం చేయకు. నీవిప్పుడు పాండ**వులయెడ కృతజ్ఞత కలిగియుండి, వారిని రావించి వారి పైతృక రాజ్య సింహాసనంపై వారిని నిల్పు. దీనివల్ల నీకు సుఖం కలుగుతుంది."** (వన ప.251 అ.2-9 శ్లో)

ఇక్కడ శకుని మాటలను పరిశీలిస్తే ఎక్కడా ఒక్క అబద్ధం లేదు. అసందర్భ ప్రలాపం లేదు. పాండవుల సంపదను హరించి నీకు ఇచ్చానని అంగీకరిస్తున్నాడు. పాండవులు చేసిన సహాయానికి ప్రతిగా నీవు వారి రాజ్యాన్ని వారికిచ్చి కృతజ్ఞత చూపమన్నాడు. పాండవులు రక్షించినందుకు దుఃఖిస్తున్నావు. వాళ్ళు రక్షించకపోతే మన గతి ఏమయ్యేదో ఆలోచించమన్నాడు.

దీనిని బట్టి దుష్ట చతుష్టయములోని శకునికన్నా దుష్టుడు, వాచాలుడు, ధర్మదూరుడు కర్ణుడు- అని అర్థమౌతుంది. కపటియైనప్పటికీ శకుని ధర్మంగా, క్షత్రియోచితంగా మాట్లాడాడు.

**4. ఘోషయాత్రా పరాభవంపై భీష్ముని మాటలపై కర్ణుడు చేసిన నిందావాక్యం**

ఘోరమైన అవమానంతో తిరిగివచ్చిన దుర్యోధనునితో భీష్ముడు, "దుర్యోధనా! వద్దని చెప్పినా వినకుండా వెళ్ళావు. గంధర్వుల చేతిలో బందీవై పాండవులచేత విడిపించబడ్డావు. **గంధర్వయుద్ధంలో కర్ణుడు నిన్ను వదిలి ప్రాణభయంతో పారిపోయాడు గదా! కర్ణుని యొక్క పరాక్రమం ఏమిటో భీమార్జునుల పరాక్రమం ఏమిటో తెలిసిందిగదా! కనుక పాండవులతో సంధి చేసుకోవటం నీకు క్షేమకరం"** అన్నాడు. ఈ మాటలకు దుర్యోధనుడు నవ్వి అక్కడనుండి లేచి వెళ్ళాడు. అతని వెంట కర్ణుడు, దుశ్శాసనులు లేచి వెళ్లారు. భీష్ముడు కూడా వెళ్లిపోవటంతో దుష్టులు నలుగురు మళ్లీ అక్కడికే చేరారు. కర్తవ్యాన్ని గురించి ఆలోచిస్తూ కర్ణుడిలా అంటున్నాడు. **"దుర్యోధనా! మనలను నిందించటం, పాండవులను ప్రశంసించటం భీష్మునికి అలవాటే. నీవు నాకు అనుజ్ఞ ఇస్తే నలుగురు పాండవులు చేసిన దిగ్విజయాన్ని నేనొక్కడినే చేస్తా. "సంపశ్యతు 'సుదుర్బుద్ధిః భీష్మ కురు కులాధమః" ఈ కురు కులాధముడైన భీష్ముడు, దుర్బుద్ధి ఐన భీష్ముడు నా ఈ పరాక్రమాన్ని తన కళ్ళతో చూడాలి-** అన్నాడు.

**భీష్ముడు దుర్బుద్ధి, కురుకులాధముడట. ఈ కర్ణుడు కురుకుల శ్రేష్ఠుడేమో- అతడికే తెలియాలి. ఇలాంటి వాచాలుడు మహాభారతంలో మనకు మరొకడు కనిపించడు.**

- ఇక కర్ణుని స్వామిభక్తి ఎట్టిదో చూద్దాం.

**(వచ్చే సంచికలో)**

## తెలుసుకుందాం



సమస్త దుఃఖములకు కారణం అజ్ఞానము. మనుష్యునకు మనుష్యునకు, దేశమునకు దేశమునకు, భూమికి చంద్రునికి, చంద్రునకు సూర్యునకు మధ్య భేదమును చూచుటయే అజ్ఞానము. అనేకత్వమును గూర్చిన భావనయే అజ్ఞానము. అణువణువునకు మధ్య భేదమును పరికించుటవలననే దుఃఖము సంప్రాప్తమగుచున్నది. కానీ ఈ భిన్నత్వము వాస్తవముగా కల్పితమనియు, అసత్యమనియు వేదాంతము పలుకుచున్నది.

**సూక్తిమాలిక** | **వివేకవంతుడు ముందు ఆలోచించి తర్వాత మాట్లాడతాడు. అవివేకి మాట్లాడి, తర్వాత ఆలోచిస్తాడు**

# మహాభారతం

రచన
మహాభారత పరిశోధకులు, అభినవ వ్యాస
జ్ఞానప్రపూర్ణ శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట
ఫోన్ : 08647-254716, సెల్ : 80085 39770
visit:www.srichalapathirao.com

## కర్ణుడు స్వామిభక్తి 36

(గత సంచిక తరువాయి)

సాధారణంగా లోకంలో కర్ణుడు గొప్ప స్వామిభక్తి పరాయణుడని, గొప్ప మిత్రుడు, స్నేహశీలియని, తన యజమాని శ్రేయస్సు కొరకు తన మానప్రాణాలను అడ్డువేసేవాడని అనుకుంటూ ఉంటారు. దుర్యోధనుడు చేసిన దుష్టకార్యాలలో సహకరించటానికి కారణం అతడి స్వామిభక్తియే అని సమర్థించజూస్తారు. అయితే కర్ణుడు నిజంగా గొప్ప స్వామిభక్తి పరాయణుడేనా? – చూద్దాం. అసలు స్వామిభక్తి అంటే ఏమిటి?

### స్వామిభక్తి

1. తన యజమాని యొక్క శ్రేయస్సు కొరకు నిరంతరము పాటుబడుట.

2. తన యజమాని చేసే పనులలోని మంచి చెడ్డలను విచారించి, మంచి పనులయందు యజమానులను ప్రవర్తింపజేయుట, చెడ్డ పనులనుండి విరమింపజేయుట.

3. తన యజమానికి అపద తటస్థించినప్పుడు తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా రక్షించే ప్రయత్నం చేయుట.

4. తన యజమాని యొక్క ప్రతిష్ఠను కాపాడుటకు ప్రయత్నించుట.

5. తన యజమాని వద్ద తన గురించిన నిజాలు ఏవీ దాచకుండా ఉన్నది ఉన్నట్లుగా తెలియజేయుట.

'భారవి' అనే మహాకవి ప్రభుభక్తి పరాయణుని లక్షణాలను తెలియజేస్తూ....

శ్లో॥ సకిం సఖా సాధు నశాస్తి యో ఉ ధి పం ।
హితాన్నయస్సం శ్రుణుతే సకిం ప్రభుః ॥

తా: **"ప్రభువుకు సన్మార్గరూపమైన హితోపదేశమును చేయని సఖుడు కుత్సితుడైన సఖుడని, అటువంటి హితోపదేశాన్ని పెడచెవిని పెట్టే ప్రభువు కుత్సితుడైన ప్రభువని"** అన్నాడు. దీనికి చక్కని ఉదాహరణ కర్ణ దుర్యోధనులే.

మహాభారతంలో నిజమైన స్వామిభక్తి పరాయణుడు-



స్వామిభక్తులలో ఉత్తమోత్తముడు విదురుడే. మొదటినుండి చివరి వరకు అతడు ధృతరాష్ట్రుని శ్రేయస్సు కోసం ఎన్నో విధాలుగా పాటుబడ్డాడు. తన మాటలను, సూచనలను, పెడచెవిని పెడుతున్నా సరే సర్వకాల సర్వావస్థలలోను హితాన్నే తెలియజేశాడు. దుర్యోధనాదులను అదుపులో పెట్టుకోమని, పాండవుల పట్ల అనాదరం చూపవద్దని, వాళ్ళకు అన్యాయం చేయవద్దని, జూదం అనర్థహేతువని, ద్రౌపదిని పరాభవించి చేజేతులా సర్వనాశనాన్ని కొని తెచ్చుకోవద్దని, పాండవులకు అర్థరాజ్యమిమ్మని, శ్రీకృష్ణుని రాయబారాన్ని విఫలం చేయవద్దని, తన మాటను వినకపోతే దుర్యోధనుని విడిచిపెట్టి కులాన్ని రక్షించుకోమని, పాండవులతో యుద్ధం వంశనాశనానికి కారణమౌతుందని అనేక విధాలుగా చెప్పిచూశాడు. ఒకసారి ధృతరాష్ట్రుడు తనను నిందించి వెళ్ళగొట్టినా సరే ధృతరాష్ట్రుని పై కోపించక అతడి శ్రేయస్సునే కోరుకున్నాడు.

చివరకు కురుక్షేత్ర సంగ్రామంలో తన నూరుగురు కుమారులను, రాజ్యాన్ని కోల్పోయి దిక్కులేని వాడిగా ధర్మరాజు పంచన జీవిస్తున్న ధృతరాష్ట్రుని విడిచిపెట్టక వెంటనంటి ఉన్నాడు. 13 సంవత్సరాల తర్వాత భీమసేన వాగ్బాణ పీడితుడై జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్న ధృతరాష్ట్రుని – తపస్సు కొరకై వనములకు బయలుదేర దీయించి, తానుకూడా గాంధారీ ధృతరాష్ట్రులతో బాటు తపోవనాలకు వెళ్ళిపోయాడు విదురుడు. విదురుడు తన శ్రేయస్సు కొరకు చెప్పిన హితోపదేశాలను పెడచెవిని పెట్టి కురువంశనాశనానికి, వందమంది కుమారులను పోగొట్టుకొని పుత్రశోకానికి తానే కారణమైనందుకు కుమిలి కుమిలి ఏడ్చాడు ధృతరాష్ట్రుడు తన జీవిత చరమాంకంలో. అందుకే విదురుడు స్వామిభక్తి పరాయణులలో శ్రేష్ఠుడు అని చెప్పటం.

కాని కర్ణుడు మాత్రం అందుకు పూర్తిగ విరుద్ధం. కర్ణుని స్వామిభక్తి ఎట్టిదో చూద్దాం.

**1. కర్ణుడు దుర్యోధనుని శ్రేయస్సుకై పాటుబడ్డాడా?**


**బాధ్యతలను విస్మరించేవారు ప్రయోజనాలను కూడా కోల్పోతారు**

కర్ణదుర్యోధనుల స్నేహం ధన సంబంధమైనది, స్వప్రయోజనం కొరకే ఏర్పడిన స్నేహం. కురుపాండవులు జన్మించక ముందే కృపాచార్యుని కడకు విద్యాభ్యాసానికి వచ్చినవాడు కర్ణుడు. అతడు విద్యాభ్యాసం చేస్తుండగా కృపాచార్యుని వద్దకు వచ్చినవారు కురు పాండవులు. అందరూ కలసి ధనుర్విద్యాభ్యాసం చేస్తున్నారు. అర్జునుడు ధనుర్విద్యలో తనకు అన్ని విధాలుగా పోటీదారుడు కావటంతో అతడిపై కర్ణునికి అసూయ, స్పర్ధ ఉండేవి. ఆ కారణంగా అర్జునుని పైన, పాండవులపైన ద్వేషం పెంచుకున్న కర్ణుడు, పాండవులపై ప్రతీకారం తీర్చుకోవాలని తహతహలాడుతున్నాడు. ఇదే సమయంలో దుర్యోధనుడు కూడా పాండవులను ద్వేషిస్తున్నాడు. వారిని హతమార్చాలని ప్రయత్నిస్తున్నాడు. ఎందుకంటే కురుసామ్రాజ్యానికి ఉత్తరాధికారి, కురుకుమారులందరిలో జ్యేష్ఠుడైన ధర్మరాజు గనుక, ధర్మరాజును అంతం చేస్తే ఇక తనకెదురుండదు గనుక; ధర్మరాజును అంతం చేయాలంటే మహాబలుడైన భీముడుండగా సాధ్యం కాదు గనుక, ముందుగా భీముణ్ణి చంపటానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇలా కర్ణునికీ పాండవులపైన ద్వేషం గనుకనే కర్ణ దుర్యోధనులిద్దరూ స్నేహితులయ్యారు. ఎవరి ప్రయోజనం వారికున్నది. అందుకే కర్ణుడు–

**శ్లో॥సంధాయధార్త రాష్ట్రేణ పార్థానాం విప్రియేరతః ।**
**యోద్ధుమాశంసతే నిత్యం ఫాల్గునేన మహాత్మ నా ॥**
(వన.309అ. 19శ్లో)

తా: **ధృతరాష్ట్ర పుత్రుడైన దుర్యోధనునితో కలసి పాండవులకు అపకారం చేయటం యందు నిమగ్నమయ్యాడు. ఎల్లప్పుడూ అర్జుననితో యుద్ధం చేయాలనే కోరికను వెలిబుచ్చుతుండేవాడు.**

ఈ కోరిక వల్లనే కుమారాస్త్ర విద్యాప్రదర్శన సమయంలో రంగభూమిలో ప్రవేశించి అర్జునునితో ద్వంద్వయుద్ధం చేయాలనే కోరికను వ్యక్తంచేశాడు. ఆ సమయంలో ద్వంద్వయుద్ధ నియమం ప్రకారం రాజైనవాడే రాజుతో ద్వంద్వయుద్ధం చేయాలనే మాట రావటంతో, దుర్యోధనుడు వెంటనే కర్ణుని అంగ రాజ్యాభిషిక్తుని గావిస్తానని చెప్పి, భీష్మ ధృతరాష్ట్ర అనుమతితో అంగరాజ్యాభిషేకం చేశాడు. **అంగరాజ్యం ఇచ్చి తనను గౌరవించినందుకు కర్ణుడు; పాండవుల రాజ్యాన్ని హరించటానికి దుర్యోధనుడు ఇద్దరూ పాండవులపై కత్తిగట్టారు. దీనిద్వారా అర్జునునిపై పగతీర్చుకోవాలనే తన కోరిక నెరవేరుతుందని కర్ణుడు; పాండవులనంతం చేయుటలో కర్ణుడు తనకు సాయపడతాడని దుర్యోధనుడు ఇలా స్వప్రయోజనాల నాశించి స్నేహితులయ్యారే తప్ప ఇరువురు ఒకరి శ్రేయస్సునొకరు కాంక్షించిన వారు కారు. కాకపోతే ఇద్దరూ పాండవులపై పగబట్టినవారే.**

ఇలా స్నేహం చేసినప్పటికీ దుర్యోధనుని శ్రేయస్సును కాంక్షించాడా కర్ణుడు? – 'పాండవులను హతమార్చి దుర్యోధనుడే ఈ సకల భూమండలానికి చక్రవర్తి కావాలి' అనే కాంక్ష కర్ణునికి ఉన్నదా? లేక అర్జుననిపై అక్కసు తీర్చుకోవటమేనా? కర్ణుని మాటలే చూద్దాం....

అంపశయ్యపై పడియున్న భీష్ముని వద్దకు ఆ రాత్రి ఏకాంతంగా కర్ణుడు వచ్చి "ఓ కురుశ్రేష్ఠ! మహావీర! భీష్మ! నేను రాధేయుడను. నిత్యము నీ దృష్టిలో ఉన్నవాడను. ఎల్లప్పుడూ నీకు ద్వేషుడనై ప్రవర్తించుచున్నవాడను." అనగా భీష్ముడు కర్ణుని తన వద్దకు రమ్మని సైగచేసి, దగ్గరకు తీసుకొని, "నాకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ నాపై స్పర్ధ వహించిన నీవు రాధేయుడవు కావు. కౌంతేయుడవే. ఇది నేను నారద వేదవ్యాస మహర్షుల వల్ల వినియున్నాను. నీయందు నాకు ద్వేషము లేదు.

**శ్లో॥తేజోవధ నిమిత్తంతు పురుషం త్వా ఉ హ మబ్రువం।**
**అకస్మాత్ పాండవాన్ సర్వానవాక్షిపసి సువ్రత ॥**
**శ్లో॥యేనా ఉ సి బహుశోరాజ్ఞా చోదిత సూత నందన ।**
**జా ఉ తోసి ధర్మలోపేన తతస్తే బుద్ధి రీదృశీ ॥**
**శ్లో॥నీచాశ్రయాన్ మత్సరేణ ద్వేషిణీ గుణి నామపి ।**
**తేనాసి బహుశో రూక్షం శ్రావితః కురుసంసది ॥**
(భీష్మ.ప.122 అ. 11, 12, 13 శ్లో)

తా: కర్ణా! నీ ఉత్సాహాన్ని, దర్పాన్ని తగ్గించటం కోసమే అప్పుడప్పుడు నీతో పరుషంగా మాట్లాడుతూ ఉండేవాణ్ణి. ఎందుకంటే నీవు దుర్యోధన ప్రేరితుడవై అకారణంగా పాండవులను నిరసిస్తూ ఉన్నావు. నీవు ధర్మలోపంతో (కన్యావస్థలో కుంతీదేవి గర్భమునందు) జన్మించి నీచ కులము నాశ్రయించుట వల్ల నీ బుద్ధి ఇలాంటి దయింది. మాత్సర్యంతో (అసూయతో) గుణవంతులను కూడ ద్వేషించే స్వభావం కలిగియున్నది. అందు వల్లనే కురుసభలో నిన్ను పరుషోక్తులతో మందలించవలసి

అనుభవమాలిక

**ఇంత ఎఫెక్టివ్‌గా వున్న కార్యక్రమం మరెక్కడా లేదు**

పదిరోజుల శిక్షణా కార్యక్రమంలో నాలో ఎప్పటినుండో కొనసాగుతున్న ఒత్తిడి చాలా వరకు తగ్గింది. మనసు శరీరం తేలికైనట్లుగా వుంది. చాలా చోట్ల యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నాను, కానీ ఇంత ఎఫెక్టివ్‌గా వున్న కార్యక్రమం మరొకటి లేదు. గురూజీ చెప్పే ప్రతి విషయం ఒళ్ళు జలదరించి నాలో మార్పు తీసుకు వచ్చింది.

**–సి హెచ్. కోటి వినాయక,**
ఎస్. ఐ., శ్రీశైలం.



**సహాయం చిన్నదైనా అవసరాన్ని బట్టి గొప్పదే**

వచ్చింది- అన్నాడు భీష్ముడు.

దానికి కర్ణుడు "భీష్మ పితామహా! నీవు చెప్పినది నిజం. నేను కౌంతేయుడనే. దుర్యోధనుని ఐశ్వర్యమునుభవించిన నేను మరొక విధంగా ప్రవర్తించలేను.

శ్లో॥మాచైతద్ వ్యాధి మరణం క్షత్రం స్యాదితి కౌరవ।
కోపితాః పాండవా నిత్యం సమాశ్రిత్య సుయోధనం॥
(భీష్మ.ప. 122 అ.26 శ్లో)

తా: "ఈ సమస్త క్షత్రియజాతి వ్యాధి మూలకంగా మరణింపకుండుటకై నేను దుర్యోధనుని ఆశ్రయించి నిత్యము పాండవులను ప్రకోపింపజేస్తున్నాను" అన్నాడు.

దీనిని బట్టి కర్ణుని బుద్ధి ఎట్టిదో తెలుస్తున్నది. నీవు పాండవులపై నిష్కారణంగా ద్రోహబుద్ధి కలిగియున్నందున నిన్ను నిరశిస్తున్నాను అని భీష్ముడు అన్నాడు. 'నాది నిష్కారణంగా పాండవులను ద్వేషించే బుద్ధి కాదు- అని కర్ణుడు చెప్పలేదు. క్షత్రియ జాతి వ్యాధి మూలకంగా మరణించకుండుటకు - అంటే యుద్ధమరణం చెందుటకు పాండవులను ప్రకోపింప చేస్తున్నానని అన్నాడు. అంటే పాండవులు అధర్మపరులు అని అనలేకపోయాడు. నీచాశ్రయం వల్ల నీబుద్ధి ఇలాంటిదయిందన్నాడు భీష్ముడు. "అబ్బే నేను ఉత్తములను ఆశ్రయించి ఉన్నాను. నా బుద్ధి చాలా మంచిది- అని చెప్పలేకపోయాడు కర్ణుడు.

దీనిని బట్టి కర్ణునికి కావలసింది దుర్యోధనునికి రాజ్యప్రాప్తి కాదు. పాండవ సంహారం మూలకంగా అర్జునునిపైగల తన అక్కసును తీర్చుకోవటమే.

ఇక కర్ణుడు దుర్యోధనునికి ఎంతటి శ్రేయోభిలాషియో! ఎంతటి స్వామిభక్తి గలవాడో స్వయంగా అతడి మాటల ద్వారానే తెలుసుకుందాం.

శ్రీకృష్ణుడు పాండవరాయబారిగా వచ్చి, విఫలుడై తిరిగి వెళ్ళేటప్పుడు ఆయన రథాన్ని అనుసరించి భీష్మ ద్రోణ కృప అశ్వత్థామ కర్ణాదులు నగర పొలిమేరల వరకు సాగనంపి తిరుగు ప్రయాణమయ్యారు. అప్పుడు శ్రీకృష్ణుడు కర్ణుని తన రథంపై ఎక్కించుకొని కొంత దూరం వెళ్ళి, ఏకాంత ప్రదేశంలో కర్ణునితో "కర్ణా! నీవు రాధేయుడవు కావు. కౌంతేయుడవే. కనుక నీవు అటువచ్చి నీ సోదరులతో కలసి యుండు. ఈ సమస్త భూమండలాన్ని నీవే పాలించవచ్చు అని చెప్పగా కర్ణుడు, నేను కుంతీదేవికి సూర్యానుగ్రహం వల్ల జన్మించానని నాకు ఇంతకు ముందే తెలుసు. అయినా సూతుడు పెంచుకోవటం వల్ల నేను ఇప్పుడు వారిని వదిలి రాలేను. దుర్యోధనుని ఆశ్రయించి 13 సంవత్సరాలు రాజ్యభోగాలు అనుభవించాను. అర్జునునికి ప్రతి యోధునిగా నన్ను భావించుకొని దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధపడుతున్నాడు. కనుక నేను ఇట్టి స్థితిలో దుర్యోధనుని వదలి రాలేను. వస్తే అది నాకూ అర్జునునికీ ఇద్దరికీ అపకీర్తియే. మన మధ్య జరిగిన ఈసంభాషణను రహస్యంగా ఉంచు. ఎందుకంటే నేను తన అగ్రజుడనని తెలిస్తే ధర్మరాజు రాజ్యం చెయ్యడు. అది నాకిచ్చినప్పుడు ఈ విశాల సామ్రాజ్యాన్ని నేను దుర్యోధనునికి ఇవ్వాలి. దుర్యోధనునికి రాజ్యప్రాప్తి అనర్థకరం.

శ్లో॥స ఏవ రాజా ధర్మాత్మా శాశ్వతో ఽ స్తు యుధిష్ఠిరః।
నేతా యస్య హృషీకేశో యోద్ధా యస్య ధనం జయః॥
(ఉద్యో. 141 అ. 23 శ్లో)

తా: ఎవరికి నాయకుడు హృషీకేశుడో, వీరుడు అర్జునుడో అట్టి ధర్మాత్ముడైన యుధిష్ఠురుడే శాశ్వతంగా ఈ భూమండలానికి రాజుగా ఉండాలని నా కోరిక- అన్నాడు కర్ణుడు.

దీనిని బట్టి కర్ణుడు దుర్యోధనుని శ్రేయోభిలాషియేనా? గొప్ప స్వామిభక్తి పరాయణుడేనా? దుర్యోధనునికి నిజమైన స్నేహితుడేనా? దుర్యోధనుని వద్ద పాండవులను తూలనాడుతూ, ఇక్కడ శ్రీకృష్ణుని వద్ద పాండవులు ధర్మాత్ములని, వారేరాజ్య పాలకులు కావాలని చెప్పటం ఏ రకమైన స్వామిభక్తి? ఏ రకమైన మిత్రధర్మం?

**2. దుర్యోధనుని దుష్ట కార్యాలనుండి నిరోధించాడా?**

యజమానియొక్క క్షేమాన్ని కోరుకొనే స్వామిభక్తుడు యజమాని చేసే పనులలోని మంచి చెడ్డలను విచారించి; మంచి పనులయందు ప్రవర్తింపచేయాలి. చెడ్డ పనులనుండి విరమింపజేయాలి. మరి కర్ణుడలా చేశాడా?

భీమునకు చిన్నతనంలోనే విషం కలిసిన ఆహారాన్ని తినిపించడం, నిద్రించే సమయంలో కాళ్ళూ చేతులూ కట్టి గంగలో త్రోయించడం, తిరిగి కాలకూట విషం తినిపించటం, ధర్మజార్జు

**ఆరోగ్యము కలిగించునవి**

పరిశుద్ధమైన భోజనం; భోజనం తర్వాత నడుచుట; స్నాన పానముల యందు క్రమం తప్పక యుండుట; సక్రమ జల మల విసర్జనములు; దినం నందు రెండుసార్లు భోజనము; రాత్రి యందు పాలతో భోజనం; సకాలం నందు నిద్ర; ఎడమ ప్రక్కకు తిరిగి నిద్రించుట, సత్యం పలుకుట, సాయంకాలపు ఎండ సోకుట; కాచి వడపోసిన నీరు త్రాగుట ఆరోగ్యం కలిగించును.

**అనారోగ్యము కలిగించునవి**

మితి తప్పిన భోజనం; మానసికమైన దుఃఖం; అధిక సంచారం; జల మల నిరోధం; భోజనం చేసి స్నానం చేయుట; కొత్త నీరు త్రాగుట; మంచి గాలి సోకకుండుట; రాత్రియందు పెరుగన్నం తినుట; లేత ఎండ సోకుట; నిన్నటి కూరలు భుజించుట అనారోగ్యం కలిగించును.

నులను బంధించాలనుకోవటం మొదలైన పనులు మంచివో చెడ్డవో తెలియదా కర్ణునికి? అప్పటికి ఇంకా అంగ రాజ్యాన్ని కట్టబెట్టలేదుకదా! మరెందుకు సాయం చేశాడు? ఇదేనా మంచి వైపుకు నడిపించటం?

ఆ తరువాత లక్కయింట ఉంచి కుంతీ, పాండవులను తగలబెట్టాలనుకోవటం, పాండవుల సంపదలు హరించటానికి మాయాజూదం ఆడించటం, దుష్ట కార్యాలని, దుర్మార్గాలని తెలియదా కర్ణునికి? ఒక వీరుడు చేయవలసిన పనులేనా? మిత్రుల్లో సరైన మార్గంలో నడిపించే చర్యలేనా ఇవి? చెడ్డపనుల నుండి విరమింపజేయటం అంటే ఇదేనా?

ఇక ద్యూత సభలో దుర్యోధనుడు కొంతవరకే రెచ్చిపోతే, మరింతగా రెచ్చగొట్టడానికి ద్రౌపదిని నీచాతినీచంగా మాట్లాడటం, బంధకి యనటం, వివస్త్రను చేసినా తప్పులేదనటం, వివస్త్రను చేయమనటం, దాసీ గృహంలో ప్రవేశపెట్టమనటం, దుర్యోధనుని భార్యలకు కాళ్ళు ఒత్తమనటం, నీకు ఐదుగురు పతులున్నా ఏం ప్రయోజనం? జూదంలో అలిని ఒడ్డి ఓటు పడని అరవ వానిని పతిగా వరించమనటం ఏ స్వామి భక్తి క్రిందకు వస్తాయి. ఇవన్నీ దుర్యోధనుని ప్రీతి కొరకు మాట్లాడాడు. స్వామి భక్తుని లక్షణం ఇదేనంటారా? ఇదే కర్ణుని సుగుణం అంటారా? మంచి వైపుకు నడిపించటం అంటే ఇదేనా?

ఇలా మాట్లాడడం, పైశాచిక తాండవం చెయ్యటం సుగుణమైతే ఇక దుర్గుణాలంటే ఎలా ఉంటాయి? ఇలా మాట్లాడి కర్ణుడు దుర్యోధనునికి ఏమి మేలు చేశాడు? దుర్యోధనుని తొడలు విరుగగొట్టి వధిస్తానని, దుశ్శాసనుని రొమ్ము చీల్చి రుధిరం త్రాగుతానని భీమసేనుడు ప్రతిజ్ఞలు చేయుటకు కారణమయ్యాడు. ఇదేనా స్వామిభక్తి? ఇదేనా యజమాని శ్రేయస్సు కోరటం? ఇదేనా మంచి మార్గాన మిత్రుని యజమానిని నడపటం?

మంచి మార్గాన నడిపించక పోగా అనేక సందర్భాలలో తప్పుత్రోవన నడిపించటం జరిగింది. "వనవాసం చేస్తున్న పాండవులు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు. ఎవ్వరూ సహాయులుగా లేరు. మిత్రులు లేరు. ఇప్పుడు అన్ని విధాల బలహీనులై యున్నారు. ఇదే అదను. మనం సైన్యాలతో, అస్త్రశస్త్రాలతో, రథాలనధిరోహించి ఒక్క పెట్టున వారిపై పడి వధిద్దాం' అని పాండవులు అరణ్యాలకు వెళ్ళగానే సలహా ఇచ్చాడు కర్ణుడు. ఆ కర్ణుని సలహాపై రథాలతో బయలుదేరగా వ్యాసుడు నివారించాడు.

ఆ తర్వాత చాలాకాలానికి ఘోషయాత్ర పేరుతో వెళ్ళి వారిని పరాభవిద్దాం అని సలహా ఇచ్చాడు. అలా వెళ్ళి గంధర్వుల చేతిలో ఓడి, ధర్మరాజు చేత విడిపించబడి పరాభవం పాలయ్యారు. పాండవులను పరాభవించటం ఎలాగూ తమకు చేతకాలేదు గనుక, దుర్వాసుని ప్రయోగించి పాండవులను శాపగతులను చేయాలని సలహా ఇచ్చాడు. అదీ ఫలించలేదు. ఇదీ ఈ మహా వీరుని లక్షణం. తనను సంపూర్ణంగా నమ్మిన దుర్యోధనుని దుష్టకార్యాలవైపు మళ్ళించిన తీరు.

3. తన యజమానికి ఆపద కలిగినప్పుడు ప్రాణాలకు తెగించి రక్షించాడా కర్ణుడు?

ఘోషయాత్రా నెపంతో పాండవులను పరాభవించాలని ద్వైతవనానికి వెళ్ళిన కౌరవులకు ఆ సరోవర ప్రాంతంలో అప్పటికే అక్కడ నివాసం ఉంటున్న గంధర్వులతో యుద్ధం తటస్థించినది. ఉభయ పక్షములు అఖండంగా పోరాటం సాగిస్తున్నాయి. రాధేయుడు కులపర్వతం లాగా కదలకుండా నిలచి గంధర్వులు కురిపించే శరవర్షంలో మునిగి పోయినా, తన శక్తి కొలది వీరోచితంగా పోరాడుతున్నాడు. గంధర్వులను చీల్చి చెండాడుతుండగా గంధర్వయోధుడు చిత్రసేనుడు కర్ణునెదిరించి భీకర శరములచే పీడిస్తున్నాడు. అప్పుడు సోదర సహితుడైన దుర్యోధనుడు శకునితో కలసి కర్ణునికి సహాయముగా నిలిచి భీకర పోరాటం సాగిస్తున్నాడు. అప్పుడు మహాబలవంతులు, పరాక్రమ శాలురు అయిన గంధర్వులు ఒక్కసారిగా చుట్టుముట్టి కొందరు కర్ణుని రథాశ్వములను, కొందరు రథసారథిని వధించగా, కొందరు రథ చక్రములను ధ్వంసం చేశారు. మరి కొందరు కర్ణుని ధనస్సును ముక్కలు చేయగా, మరికొందరు ధ్వజపతాకమును కూల్చివేశారు. తీవ్రమైన సాయకాలతో కర్ణుని శరీరమును ఛేదించగా విరథుడైన కర్ణుడు వికర్ణుని రథమెక్కి యుద్ధభూమి నుండి పలాయనం సాగించాడు. ఐతే దుర్యోధనుడు మాత్రం వెనుదీయక గంధర్వులతో పోరాటం సాగిస్తున్నాడు.

**పుణ్యము**

దేవుని యందు భక్తి కలిగియుండుట; మనసు చేసిన పుణ్యం; దేవుని నామం పలుకుట నోరు చేసిన పుణ్యం; దేవుని పూజించుట చేతులు చేసిన పుణ్యం; దేవాలయానికి పోవుట కాళ్ళు చేసిన పుణ్యం; దేవుని చూడటం కనులు చేసిన పుణ్యం; దేవుని కథలు వినుట చెవులు చేసిన పుణ్యం; దేవునికి నమస్కరించడం శిరస్సు చేసిన పుణ్యం.

**పాపము**

పరుల కీడు తలచుట మనసు చేసిన పాపం; పరుష వాక్యాలు పలుకుట నోరు చేసిన పాపం; పరుల ధనాన్ని అపహరించుట చేతుల చేసిన పాపం; స్వార్థపరుల వద్దకు తిరుగుట కాళ్ళు చేసిన పాపం; పరుల నింద వినుట చెవులు చేసిన పాపం.

యుద్ధం తటస్థించినప్పుడు రాజును రక్షించుకోవటం సేనా నాయకుల ప్రథమకర్తవ్యం. ఇక్కడ కర్ణుని రక్షించటానికి దుర్యోధనుడు రాగా, దుర్యోధనుని వదలి కర్ణుడు యుద్ధభూమినుండి పారిపోయాడు. ప్రాణాలకు తెగించి యజమానిని రక్షించాల్సిన కర్ణుడు ప్రాణాలపై తీపితో దుర్యోధనుని గంధర్వుల పాలు జేసి పలాయనం చిత్తగించాడు. ఇదీ అతడి స్వామిభక్తి.

**4. తన గురించిన నిజాలను దాచకుండా చెబుతున్నాడా కర్ణుడు?**

నిజమైన స్వామిభక్తి పరుడు తన యజమాని వద్ద ముఖ్యమైన విషయాలను అంటే యజమానికి హాని కలిగే విషయాలను దాచడు. కాని కర్ణుడు పరశురాముని వద్ద అస్త్ర విద్యలను పొంది, బ్రహ్మాస్త్రాన్ని కూడా సంపాదించి, తాను బ్రాహ్మణుడు కాదనే నిజం పరశురామునికి తెలియటంతో ఆ ముని కర్ణుని శపించాడు. 'మరణ కాలంలో ఈ బ్రహ్మాస్త్రం గుర్తుకు రాదు' అని. ఇంతటి ముఖ్యమైన విషయాన్ని దుర్యోధనునికి చెప్పాడా కర్ణుడు? లేదు. పైగా నేను సకల అస్త్రాలను పొందాను అని చెప్పాడు.

అలాగే బ్రాహ్మణుని గోవత్సాన్ని పొరబాటున బాణంతో చంపటంతో ఆ బ్రాహ్మణుడు శపించాడు. 'ఓ దుర్మతీ! నీవు ఎవరిపై అసూయతో నిరంతరం జ్వలించి పోతున్నావో, ఎవ్వరిని పరాభూతుని చేయటానికి ఈ బాణ ప్రయోగ అభ్యాసం చేస్తున్నావో, అతడితో నీకు యుద్ధం తటస్థించినప్పుడు నీ రథ చక్రం భూమిలో క్రుంగిపోతుంది. అదే సమయంలో వికల మనస్కుడవైన నీ శిరస్సును నీ శత్రువు ఖండిస్తాడు' అని శపించాడు. ఈ విషయాన్ని దుర్యోధనునితో చెప్పాడా? లేదు. ఈ రెండు శాపాల గురించి జీవిత కాలంలో కర్ణుడు దుర్యోధనునకు చెప్పనే లేదు. దీనికి కారణం ఏమిటి? బ్రాహ్మణ శాపంతో అర్జునుని చేతిలో తన చావు తథ్యమని తెలిసినా నేనొక్కడినే అర్జునుని, మిగిలిన పాండవులను సంహరిస్తానని బీరాలు పలకటం ఎందుకు?

"అర్జునుడు నాకు సాటిరాడు. అతని కన్న నేను బలవంతుడను, పరాక్రమవంతుడను, నా వద్ద పరశురాముని వద్ద పొందిన దివ్యాస్త్ర సంపద ఉన్నది. దానితో నేను అవలీలగా అర్జునుని సంహరించగలను." అని ఎల్లప్పుడూ దుర్యోధనునికి చెబుతూ ఉండే కర్ణుడు ఈ శాపాల గురించి చెబితే తనపై నమ్మకం పోతుంది. అందువల్ల తనపట్ల దుర్యోధనుడంతగా అభిమానం చూపకపోవచ్చు. అందుకే శాపాలను దాచి దుర్యోధనుని మత్తులోనే ఉంచాడు.

ఇక కుంతీదేవి కర్ణుని వద్దకు వచ్చినప్పుడు ఆమె కోరికపై అర్జునుని తప్ప మిగిలిన పాండవులు నా చేత చిక్కినప్పటికీ నేను వారిని వధించనని మాట ఇచ్చాడు. ఆ విషయం దుర్యోధనునితో చెప్పాడా? చెప్పలేదు. ఆ విషయం చెబితే తాను కుంతీ పుత్రుడనని తెలిస్తే దుర్యోధనుడు తనను ఆదరించడు. అర్జునుని తప్ప మిగిలిన పాండవులను వధించనని చెబితే పాండవులనందరినీ నేనొక్కడినే వధించివేస్తానని చేసే ప్రగల్భాలకు అవకాశం ఉండదు. అందుకే భీష్మ ద్రోణులు పాండవ పక్షపాతులని నూరిపోస్తూ, వారు పాండవులను చంపరని, నేను మాత్రమే పాండవులను వధించగలనని నమ్మిస్తూ చివరి వరకూ దుర్యోధనుని ఈ భ్రమలోనే ఉంచుతూ వచ్చాడు. ఇతడా స్వామిభక్తుడు?

5. "మన సేనలో రథాతిరథులెవరో చెప్పమని దుర్యోధనుడు భీష్ముని కోరగా కర్ణునికి శాపాలున్నవి గనుక, కవచ కుండలాలు లేవు గనుక అతడు అర్ధరథుడే" అని భీష్ముడు చెప్పగా క్రోధం వహించిన కర్ణుడు "దుర్యోధనా! నేనొక్కడినే పాండవులను వధిస్తాను. కాని కీర్తి మాత్రం భీష్మునకే వస్తుంది. ఈ భీష్ముడు జీవించి ఉన్నంత వరకు నేను యుద్ధభూమిలో ప్రవేశించనని" శపథం చేశాడు. దుర్యోధనుని కోసం ప్రాణాలైనా అర్పిస్తానని ప్రగల్భాలు పలికే కర్ణుడు కేవలం భీష్ముడు తనను అవమానించినందుకు **18** రోజుల కురుక్షేత్ర సంగ్రామంలో **10** రోజులు యుద్ధంలో పాల్గొనకుండా ఇంటి వద్దనే కూర్చున్నాడు. ఇతడా దుర్యోధన శ్రేయోభిలాషి? ఇతడా స్వామి భక్తుడు? ఇతడు స్వామి భక్తుడో, స్వామి ద్రోహియో, దుర్యోధన శ్రేయస్సుకు పాటు బడ్డాడో, అర్జునుని జయించాలనే తన స్వార్థం కొరకు పాటు బడ్డాడో, ప్రాణాలపై తీపిలేనివాడో, తీపి గలవాడో గమనించాలి.

ఇక కర్ణుని యొక్క దానశీలత గురించి 'దాన కర్ణుడు?' అనే బిరుదు గురించి... **(వచ్చే సంచికలో)**

### లక్ష్మీనివాస స్థానములు

సత్యవంతుల యందును, దైవభక్తుల యందును, సలక్షణమైన గృహముల యందును, వీరుల యందును, జయధ్వజముల యందును, ఏనుగుల యందును, గోవుల యందును, ఛత్ర చామరముల యందును, తామర పువ్వుల యందును, పంట భూముల యందును, పసిపాపల నవ్వుల యందును, పూదోటల యందును, రత్నముల యందును, దీపముల యందును, అద్దములు మొదలైన మంగళ వస్తువుల యందును సౌభాగ్య లక్ష్మి నివసించును.

### అలక్ష్మి నివాస స్థానములు

అసత్యవంతుల యందును, పాతివ్రత్యములేని స్త్రీల యందును, మేక కాలి ధూళి యందును, చీపురు దుమ్ము యందును, గాడిద కాలి దుమ్ము యందును, అతినిద్ర గలవాని యందును, తాండ్ర చెట్టునందును, కాటి పొగ యందును, మంచం నీడ యందును, దీపం నీడల యందును, దురాశ పరుల మొహం నందును దౌర్భాగ్య లక్ష్మి నివసించును.


విద్య లక్ష్యం సత్యాన్ని ప్రేమించడమే కాదు, సత్యాన్ని ఆచరించడం కూడా.

# మహాభారతం

రచన
మహాభారత పరిశోధకులు, అభినవ వ్యాస
జ్ఞానప్రపూర్ణ శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట
ఫోన్ : 08647-254716, సెల్ : 80085 39770
visit:www.srichalapathirao.com

## కర్ణుడు దానశీలత

## 36

(గత సంచిక తరువాయి)



మహాభారతంలో కర్ణుడు గొప్ప దానశీలుడని, అడిగిన వారికి లేదనకుండా, ఒక్కక్షణం కూడా ఆలోచించకుండా ఏది అడిగితే దాన్ని దానం చేస్తుంటాడని, అసలు అలాంటి దాత లోకంలో మరొకడుండడని, అతనికి ఆ గుణం పుట్టుకతోనే వచ్చిందని, స్వతహాగా అతడిది దాతృత్వ గుణమని అనేక విధాలుగా అనేకమంది అనుకుంటూ ఉంటారు, చెబుతూ ఉంటారు, వింటూ ఉంటారు, ఆనందిస్తూ ఉంటారు. అంతేకాదు **కర్ణుని యొక్క దాతృత్వాన్ని ప్రశంసిస్తూ లోకంలో అనేకమైన కథలు ప్రచారంలో ఉన్నాయి. కాకపోతే ఇవన్నీ కల్పిత కథలు. కొందరు కవులు తమ కల్పనా చాతుర్యంతో వీటిని రచించటం జరిగింది. కొందరు సినిమా కవులు వీటిని చిలవలు పలవలు చేసి చక్కగా చిత్రించి ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. అంతేతప్ప ఈ కథలు మహాభారత గ్రంథంలో ఎక్కడైనా ఉన్నాయా? అని మాత్రం చూడలేదు. అలా ప్రచారమైన కథలలో బహుళ ప్రచారంలో ఉన్న కథ...**

1. కర్ణుడు తన భవనం ముందు ఒక దాన ఘంట కట్టించాడట. ఎందుకంటే ఎవరికైనా అర్ధరాత్రో అపరాత్రో ఏదైనా అవసరం కలిగితే తిన్నగా వచ్చి కర్ణుని కలుసుకోలేరు కదా! అందుకని ఎవరైనా – ఎప్పుడైనా సరే వచ్చి ఆ ఘంటను మ్రోగిస్తే వెంటనే కర్ణుడు అది విని, వచ్చి, వారి అవసరాలు తీరుస్తూ ఉండేవాడు. వారు కోరిన వాటిని ఇచ్చి పంపేవాడు...

ఈ విషయాన్ని తెలుసుకున్న దుర్యోధనుడు 'తాను దయ తలచి ఇచ్చిన అంగరాజ్యాన్ని పాలించే కర్ణుడే ఇలా ఘంట కట్టించి మరీ దానం చేస్తున్నాడే! మరి రారాజునైన నేనెందుకు అంతకన్నా గొప్పగా దానం చెయ్యకూడదు!' అని అనుకొని తను కూడా ఒక పెద్ద దాన ఘంటను తన భవనం ముందు కట్టించి, దాన ధర్మాలు చేస్తున్నాడు. ఇది తెలుసుకున్న ఇంద్రుడు ఒకరోజు బ్రాహ్మణ వేషంలో దుర్యోధనుని వద్దకు వచ్చి 'భవతీ భిక్షాందేహి' అన్నాడు. దుర్యోధనుడు ఆ బ్రాహ్మణుణ్ణి 'ఏం కావాలో కోరుకో' అన్నాడు. అప్పుడా బ్రాహ్మణుడు నేనొక యజ్ఞం తలపెట్టాను. రెండు బండ్ల ఎండు కలప కావాలన్నాడు. సరే తీసుకపో! అన్నాడు దుర్యోధనుడు. దానికా బ్రాహ్మణుడు 'రాజా! ఇప్పుడు కాదు, నేను యజ్ఞం ప్రారంభించబోయేముందు వచ్చి తీసుకపోతా'నన్నాడు. దానికి దుర్యోధనుడు సరే అన్నాడు.

అక్కణ్ణుంచి వెళ్ళిన బ్రాహ్మణ వేషధారి కర్ణుని వద్దకెళ్ళి ఇలాగే అడిగితే కర్ణుడు కూడా అలాగే వచ్చి యజ్ఞ ప్రారంభంలో తీసుకెళ్ళు అన్నాడు.

ఆ తరువాత వర్షాకాలం వచ్చింది. 7 రోజులు కుంభవృష్టి కురిసింది. ఎక్కడా ఎండు కట్టెపుల్ల లేదు, ఆ సమయంలో ఈ బ్రాహ్మణ వేషధారి వచ్చి దుర్యోధనుని వద్దకెళ్లి ఇచ్చిన మాట ప్రకారం ఎండు కలపను ఇవ్వమన్నాడు. ఇప్పుడెక్కడ ఎండుకలప దొరుకుతుంది? అని కసరి పంపించాడు దుర్యోధనుడు. ఆ బ్రాహ్మణుడు అక్కడినుండి కర్ణుని వద్దకెళ్ళి, ఇచ్చిన మాట ప్రకారం ఎండు కలపను ఇవ్వమని అడిగాడు. అప్పుడు కర్ణుడు వెంటనే తన భవనాన్ని పడగొట్టించి, అందులోని కలపను బండ్లకు ఎత్తించి పంపించాడు. బ్రాహ్మణుడు ఆ కలప బండ్లను దుర్యోధనుని కోట గుమ్మం ముందునుండి తోలించుకుపోతున్నాడు. దుర్యోధనునికీ విషయం తెలిసి దాన ఘంటను కట్టించి, దానం చెయ్యటానికి అర్హత కర్ణునికే గలదని, తనకా అర్హత లేదని గ్రహించి, తాను కట్టించిన దాన ఘంటను తీసేయించాడట. **ఇదీ ఒక కథ. బహుళ ప్రచారంలో ఉన్న కల్పిత కథ, మహా భారతంలో లేని కథ.**

2. ఇక మరొక కథ. ఒకరోజున కర్ణుడు అభ్యంగన స్నానం చేస్తు తైలంతో నిండిన స్వర్ణ పాత్రను ఎడమ చేతిలో ఉంచుకొని, కుడిచేతితో ఆ తైలాన్ని శరీరానికి పట్టించుకుంటున్నాడట. ఆ సమయంలో ఒక వేద పండితుడు కర్ణుని వద్దకు వచ్చి తనకేదైనా ధన సహాయం చేయమని అర్థించాడట. కర్ణుడు వెంటనే తన ఎడమ చేతిలోని బంగారుపాత్రను కుడిచేతిలోనికి తీసుకోకుండా, ఎడమ చేత్తోనే దానమిచ్చాడట. అప్పుడా పండితుడు 'మహారాజా! మీరు ధర్మాలు తెలిసినవారు. అటువంటి వారు ఎడమ

చేత్తో తైలం నిండిన పాత్రను దానం చేయటం సమంజసమేనా? అని ప్రశ్నించాడట. అప్పుడు కర్ణుడు 'పండితోత్తమా! మనసు యొక్క ప్రభావం మీకు తెలియనిది కాదు, ఎడమ చేతినుండి పాత్ర కుడిచేతికి మారే వ్యవధిలో యీ చంచలమైన మనసు మారిపోవచ్చుగదా! అందుకే తక్షణమే ఈ పాత్రను మీకు దానం చేశాను-' అన్నాడట. దానితో పండితుడు ఆశ్చర్యపోయాడట! ఇది మరొక కల్పిత కథ, మహాభారతంలో ఎక్కడా లేని కథ.

**3. మేం మాత్రం తక్కువ తిన్నామా? అని సినిమా కవి మరొక కథను కల్పించాడు. అదేమిటంటే - కురుక్షేత్ర యుద్ధ భూమిలో 17వ రోజు కర్ణుడు అర్జునుని చేతిలో సంహరింప బడ్డాడు. అప్పుడు శ్రీకృష్ణుడు మారువేషంలో అర్జునునితో సహా కలసివచ్చి. కొనప్రాణంతో ఉన్న కర్ణుని దానం అడిగాడట. ఆ సమయంలో తనవద్ద ఏమీ లేదని గ్రహించిన కర్ణుడు వెంటనే తన బంగారపు పన్నును పీకి ఇచ్చాడట... (పన్ను ఎప్పుడు పోయిందో బంగారపు పన్ను ఎప్పుడు కట్టించుకున్నాడో) అప్పుడు శ్రీకృష్ణుడు కర్ణుని దాతృత్వాన్ని ప్రశంసించాడట. ఇది మూడవ కల్పిత కథ. మహాభారతంలో లేని కథ.**

ఇంకా ఇలాంటి కథలు ఉన్నాయో లేవో తెలీదు. ఇంకా ఏమేమి కథలు కల్పించబడతాయో తెలియదుగాని, **ఈ కథలు ఏవీ కూడా కనీసం ఒక్క కథ కూడా లక్ష శ్లోకాలు గల సంస్కృత మహాభారతంలోగాని, 48000 పద్యాలతో ఉన్న ఆంధ్ర మహా భారతంలోగాని లేనే లేవు అనేది స్పష్టం. ఇంద్రునికి కవచ కుండలాలు ఇచ్చిన గాథ తప్ప మహాభారతంలో ఇంక ఏ ఒక్క కథ లేదు. (కవచకుండల దానం విషయం తరువాత ప్రత్యే కంగా, సవివరంగా తెలుసుకుందాం)**

**'కర్ణుడు దాతగా' ఒక్క కథ కూడా లేకపోతే కర్ణునిగొప్ప దాతయని, దానకర్ణుడని లోకంలో అందరూ అంటున్నారు గదా! ఎందుకంటున్నారు? కర్ణుడు గొప్ప దాతయే కాకపోతే కవచ కుండలాలు హరించాలనుకున్న దేవేంద్రుడు వాటిని దానపూర్వ కంగానే గ్రహించాలని ఎందుకనుకున్నాడు? మహాభారతంలో ఎవరూ ఎక్కడా కర్ణుని దాత అని అనలేదా?**

కర్ణుని గొప్ప దాతగా నిరూపించే గాథ ఒక్కటి కూడా సంస్కృత మహాభారతంలోగాని, ఆంధ్ర మహాభారతంలోగాని లేదు అనేది సత్యం. అయితే కర్ణుని గొప్ప దాతగా దుర్యోధనుడు, సూర్యుడు, ఇంద్రుడు, భీష్ముడు.... ఇలా కొందరు ప్రశంసించారు. అలాగే కర్ణుడు కూడా తనను తాను గొప్ప దాతగా ప్రశంసించు కున్నాడు. అయితే కర్ణుడు ఇలా దాతగా ఎప్పటినుండి అయ్యాడో మహాభారతంలో స్పష్టంగా చెప్పబడింది. అదేమిటో చూద్దాం...

**కర్ణుని దాతృత్వ ప్రతిజ్ఞ**

పాండవులను పరాభవించాలనే కోరికతో కర్ణుని సలహాపై దుర్యోధనుడు కర్ణ, శకుని, దుశ్శాసనులతోను, చతురంగ బలాల తోను, రథముల నధిరోహించి ధర్మరాజాదులు నివసిస్తున్న ద్వైత వనానికి వెళ్లారు. అక్కడ సరోవర ప్రాంతంలో అప్పటికే వచ్చి యున్న గంధర్వులతో యుద్ధం తటస్థించినది. ఆ యుద్ధంలో కర్ణుడు గంధర్వుల ధాటికి నిలువలేక పారిపోగా, దుర్యోధనుడు ధైర్యంతో ఎదురునిలిచి పోరాడి పరాజయం పాలయ్యాడు. గంధ ర్వులు దుర్యోధనునితో సహా అతని సోదరులను, వారి భార్యలను బంధించి ఆకాశమార్గంలో తీసుకొని వెళుతుండగా, సైనికులు ఆ సమీపంలోనే యజ్ఞదీక్షలో ఉన్న ధర్మరాజుకు ఈ విషయం చెప్పి రక్షించమన్నారు. ధర్మరాజు భీమార్జునులను పంపగా వారు గంధర్వులను చక్రబంధంలో ఇరికించి, ధర్మరాజు వద్దకు తీసుక రాగా, ధర్మరాజు గంధర్వులకు చెప్పి దుర్యోధనాదులను చెర నుండి విడిపించాడు. **ఆ అవమానం భరించలేక దుర్యోధనుడు ప్రాయోపవేశానికి కూర్చొనగా శకుని, కర్ణులు అనేక విధాల నచ్చచెప్పారు. ఐనప్పటికి దుర్యోధనుడు తన ప్రయత్నం మాన లేదు.** (వన.ప. 242 - 251 అ. సంక్షిప్తంగా)

**ఆనాటి రాత్రి దేవతలచేత జయించబడ్డ పాతాళ వాసులైన దైత్య దానవులు దుర్యోధనుని తమ వద్దకు రప్పించుకొనుటకు అధర్వవేదోక్త పద్ధతిన హోమాన్ని నిర్వహించి 'కృత్య' అను రాక్షసిని ఆవిర్భవింపజేశారు.** ఆ 'కృత్య' పని యేమి? యని అడుగగా, దుర్యోధనుని తమ వద్దకు తీసుకొని రమ్మని ఆజ్ఞాపించారు. ఆ 'కృత్య' అవలీలగా దుర్యోధనుని వారి వద్దకు తీసుకొని వచ్చినది. (వన.ప. 251 అ. 21- 30 శ్లో)

ఆ దుర్యోధనునితో పాతాళవాసులైన దైత్య దానవులిలా అంటున్నారు. 'సుయోధనా! నీవీ సాహసం చేయవద్దు. నీ శరీర నిర్మాణం ఎలా జరిగిందో చెబుతున్నాం. విను, మేము పూర్వం తపస్సు చేసి శంకరుని వల్ల నిన్ను పొందాం. నీ శరీరంలో నాభికి పైభాగం వజ్ర సదృశమై శస్త్రాస్త్రములకు అభేద్యమై

**ఏరోజు తలస్నానం చేస్తే ఏ ఫలం కలుగుతుంది?**

ఆదివారం - తాపం పోతుంది.
సోమవారం - అందం పెరుగుతుంది.
మంగళవారం- అమంగళం.
బుధవారం- వ్యాపార, వ్యవహార అభివృద్ధి.
గురువారం- ధన నాశనం.
శుక్రవారం- అనుకోని ఆపదలు కలుగుతాయి.
శనివారం- మహాభోగాలు కలిసి వస్తాయి.
ఈ స్నానవిధి పురుషులకే.

యున్నది. ఇక నాభికి దిగువభాగం పుష్పకోమలమై, స్త్రీజన మనోహరమైన రూపంలో ఉన్నది. నీవు భయపడవలసినదేమీ లేదు. భగదత్తుడు, (నరకుని కుమారుడు) మొదలైన వీరులు దివ్యాస్త్రాలతో నీ శత్రువులను సంహరిస్తారు. నీకు సహాయ పడుటకు అనేకమంది దానవ వీరులు మానవలోకంలో జన్మించి యున్నారు. అంతేకాదు...

**శ్లో॥ భీష్మద్రోణకృపాదీంశ్చ ప్రవేక్ష్యం త్య పరే ఉసురాః**
**యైరావిష్టా ఘృణాంత్యక్త్వా యోత్స్యంతే తవవైరిభిః ॥**

(వన.ప 252 అ. 11శ్లో)

తా॥ అనేకమంది అసురులు భీష్మ, ద్రోణ, కృపాచార్యుల శరీరాలనావహించి, ఆ ఆవేశంతో నిర్దయులై నీ శత్రువులను నిర్దాక్షిణ్యంగా సంహరించి వేస్తారు. నీకు ఏ అర్జునుని వల్ల భయం కలదో ఆ భయాన్ని పోగొట్టటానికి 'అర్జున వధోపా యాన్ని కూడా ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చియున్నాం.'

**శ్లో॥ హతస్య నరకస్యాత్మా కర్ణమూర్తి ముపాశ్రితః**
**తద్వైరం సంస్మరన్ వీర యోత్స్యతే కేశవార్జునౌ॥**

(వన.ప. 252 అ. 20శ్లో)

**తా॥ శ్రీకృష్ణుని చేతిలో వధించబడిన నరకాసురుని ఆత్మ కర్ణుని యందు ఆవేశిస్తుంది. వెనుకటి వైరాన్ని తలచుకుంటూ అతడు (నరకాసురుడు) రణరంగంలో కృష్ణార్జునలను ఢీకొని భయంకర యుద్ధం చేస్తాడు.**

పరాక్రమ శాలియగు కర్ణుడు పార్థుని తప్పక జయిస్తాడు. నీవీ భూమండలమునంతటినీ పాలిస్తావు. దేవతా పక్షమునకు పాండవులు దిక్కు నీవు మాకు దిక్కు- అని చెప్పి 'కృత్య' ద్వారా దుర్యోధనుని యధాస్థానములో ప్రవేశ పెట్టారు. (వన.ప. 252 అ. 1- 23శ్లో)

దుర్యోధనుడీ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. పాండవులను తప్పక జయించుదుననే నిశ్చయంతో ఆమరణ దీక్షను వదలి హస్తినకు ప్రయాణమయ్యాడు.

హస్తినకు చేరిన దుష్ట చతుష్టయాన్ని చూచి, జరిగిన విషయం గ్రహించిన భీష్ముడు **"కర్ణుని పరాక్రమం ఏ పాటిదో గంధర్వుల యుద్ధంలో తెలిసింది గదా!"** అని పరిహాసం **చేయగా, కర్ణుడు దుర్యోధనునితో "దుర్యోధనా! కురుకులాధ ముడైన ఈ భీష్ముడు మనలను ఎప్పుడూ నిందిస్తూనే ఉంటాడు. పాండవులు నలుగురూ చేసిన దిగ్విజయాన్ని నేనొక్కడనే చేస్తాను. నాకనుజ్ఞ ఇవ్వు నా బలమును చూచి ఈ భీష్ముడు తనను తానే నిందించుకుంటాడు."** అనగా దుర్యోధనుడు అనుమతించాడు. కర్ణుడు దిగ్విజయం చేసి అనేకమంది రాజులను జయించి రాగా, దుర్యోధనుడు సంతోషంతో కర్ణుని కౌగలించుకుని "యుధిష్ఠ రుని రాజసూయం చూచిన తర్వాత నేను కూడా రాజసూయం చేయాలని అనుకుంటున్నాను" అనగా కర్ణుడు సంతోషించాడు. అయితే రాజసూయం చేసిన ధర్మరాజు బ్రతికి ఉండగా, రాజ సూయం చేయని తండ్రి బ్రతికి ఉండగా రాజసూయం చేయ రాదని పురోహితుడు చెప్పి, రాజసూయంతో సమానమైన వైష్ణవ యాగాన్ని చేయమనగా, దుర్యోధనుడంగీకరించాడు.

ఆ తరువాత వైభవోపేతంగా వైష్ణవ యాగం ముగిసింది. దుర్యోధనుడు తల్లిదండ్రులకు, భీష్మ ద్రోణాదులకు వందనము చేసి, సోదరులచే పరివేష్టితుడై సింహాసనముపై ఆశీనుడయ్యాడు. (వన.ప. 253-256 అ. సంక్షిప్తంగా)

**ఆ సమయంలో కర్ణుడు దుర్యోధనునితో, "మహారాజా! ఈ మహా క్రతువు సమాప్తమైనది. ఇక పాండవులు యుద్ధంలో హతులైన తరువాత నీవు రాజసూయం చేయాలి. అప్పుడు నేను నిన్ను మరల అభినందించాలి.." అనగా దుర్యోధనుడు "నీవు పలికినది సత్యం. దురాత్ములైన పాండవులను వధించి నేను రాజసూయాన్ని చేయాలి." అంటూ కర్ణుని కౌగలించుకుని, చుట్టూ ఉన్నవారితో "నేను పాండవులను వధించుట ఎన్నడో? రాజసూయ మహాక్రతువును నిర్వహించుట ఎన్నడో?" అన్నాడు.**

(వన.ప. 257 అ. 1-15శ్లో)

*శ్లో॥ తమ బ్రవీత్ తదా కర్ణః శ్రుణు మే రాజకుంజర!*
పాదౌ న ధావయే తావద్ యావన్న నిహతో ఉర్జున ॥

(వనప. 257 అ. 16శ్లో)

***శ్లో॥ కీలాలజం నఖాదేయం కరిష్యే వా ఉసురవ్రతం***
***నా స్తీతి నైవ వక్ష్యామి యాచితో యేనకే నచిత్ ॥***

(వనప. 257. అ. 17శ్లో)

తా॥ అప్పుడు కర్ణుడు దుర్యోధనునితో "రాజసింహా! నా యీ ప్రతిజ్ఞను విను. నేను అర్జునుని వధింపనంత వరకు ఇత రులచే పాదములు కడిగించుకోను. (16) మద్య మాంసములను ముట్టను. అసుర వ్రతాన్ని (క్రూర కర్మలను) అవలంబించను. ఎవ్వరు దేనికై నన్ను యాచించినా (నాస్తి) లేదు- అని అనను - ఇదీ కర్ణుని దాన ప్రతిజ్ఞ.

ఆ ప్రతిజ్ఞ చేసిన నాటినుండి కర్ణుడు ప్రతిదినము సూర్యో పాస్తి చేస్తూ ఉండే సమయంలో అనేకమంది విప్రులు ధనం కొరకు వస్తూ ఉన్నారు. అలా వచ్చినవాడికి కర్ణుడు ఏమి అర్థించి నప్పటికీ వారి కోరికలను తీరుస్తూ, కోరిన ధనాన్ని ఇచ్చి పంపి స్తున్నాడు. ఇలా అర్థులైన వారికి లేదనకుండా ఇస్తూ ఉండటంతో అనేకమంది తమ కోరికలను వెల్లడించేవారు. ఇది తెలిసే ఇంద్రుడు బ్రాహ్మణ వేషంతో వచ్చి కర్ణుని సహజ కవచ కుండ లాలను అర్థించాలనుకున్నాడు. 'ఎవ్వరేమడిగినా లేదన'నని ప్రతిజ్ఞ చేసిన కర్ణుడు తప్పక కవచ కుండలములనిచ్చునని భావిం చియే ఇంద్రుడలా రావటం జరిగింది. ఆ ప్రతిజ్ఞను బట్టియే -



**సుఖం అధికారమందు లేదు-సచ్ఛరిత్ర యందు కలదు.**

# మహాభారత పాఠకులకు రచయిత వివరణ

ధ్యానమాలిక డిసెంబరు 2011 సంచిక లేఖామాలికలో పి.నాగేశ్వరరావుగారు తమ లేఖలో 'మహాభారతంలో కర్ణుడి గురించి కసిగా రాస్తున్నారేమో అనిపిస్తుంది' అని వ్రాశారు. ఇలాంటి భావాలే ఇంకా అనేకమందికి ఉండవచ్చు, ఉంటాయి కూడా. దీనికి కారణం అనేకమంది సినిమా కవులు, రచయితలు, విమర్శకులు వ్యాస మహాభారతాన్ని అస్తవ్యస్తం చేసి కర్ణుని పాత్రను మలచటం వల్లనే. గ్రంథాన్ని చదవకుండా సినిమాలను, టి.వీ.సీరియల్స్‌ను మాత్రం చూసి, అదే నిజమని నమ్మి, అభిప్రాయాలు ఏర్పరచుకున్నవారు యదార్థంగా కర్ణుని వ్యక్తిత్వం ఎట్టిదో గ్రంథం నుండి తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యపోతుంటారు, కోపగిస్తుంటారు, ఆవేశపడుతుంటారు. ఇలాంటి కోపావేశాలతో ధ్యానమాలికకు లేఖలు వస్తాయని కూడా భిక్షమయ్య గురూజీకి ముందే తెలియజేశాను.

అయితే ఈ ఆవేశకావేషాలకు చోటివ్వకుండా మన అభిమాన దురభిమానాలను ప్రక్కనపెట్టి యదార్థంగా గ్రంథంలో ఏమున్నదో తెలుసుకుంటేనే మనకు ప్రయోజనం. ఎందుకంటే మహాభారత గ్రంథంలోని వివిధ పాత్రల ద్వారా సమాజంలోని వ్యక్తులకు అనేక జీవన సత్యాలను, ఉత్తమ సందేశాలను వ్యాసమహర్షి అందించారు. నిజమైన జిజ్ఞాస గలవారు మహాభారతం నుండి ఆ సందేశాలను గ్రహించి, సందేహాలను తొలగించుకొని, జీవితాన్ని ధర్మమార్గంలో గడిపి, ధర్మార్థకామ మోక్షములనే చతుర్విధ పురుషార్థాలను సాధించాలి.

మహాభారతంపై 25 సం॥లు పరిశోధన చేసిన నేనుఈ వ్యాస పరంపరను ధ్యానమాలికలో ప్రారంభించినప్పటి నుండి కథా సంఘటనలను తెలియజేస్తున్నప్పుడు గాని, శ్లోకాలను ఉటంకిస్తున్నప్పుడు గాని అవి ఏ పర్వం-ఏ అధ్యాయం-ఏ నెంబరు గల శ్లోకాలో కూడా తెలియజేస్తున్నాను. మహాభారత గాథ జరిగే సమయంలో మనమెవ్వరమూ లేం. కనుక ఏమి జరిగిందో మనకు తెలియదు. మనకున్న ఒకే ఒక్క ఆధారం ఈ ఇతిహాసాన్ని మనకందించిన వ్యాసమహర్షి యొక్క గ్రంథమే. మనం ఏ విమర్శ చేసినా, ఏ విశ్లేషణ చేసినా ఈ గ్రంథం ఆధారంగానే చేయాలి గాని సినిమాలలో చూపిన దాన్ని బట్టి కాదు గదా! కనుక నేను వ్రాసిన కథ గాని, ఇచ్చిన శ్లోకాలు గాని, నిజంగా వ్యాసమహాభారతంలో ఉన్నాయా? లేక కల్పించినవా? లేక ఉన్నదాన్ని వ్యత్యస్తం చేసి వ్రాసినవా? అని నిజమైన జిజ్ఞాస గలవారు పరిశీలన చేయాలి. చేయండి.

ఇలా పరిశీలన చేయాలంటే ఎలా? గ్రంథాలయాల్లో ఈ గ్రంథాలు లభించవచ్చు. లేదా గీతా ప్రెస్ గోరక్‌పూర్ (యు.పి) వారి పరిశోధిత గ్రంథాన్ని వారికి వ్రాసి తెప్పించుకోవచ్చు. అయితే ఇవి హిందీలో ఉంటాయి. తెలుగు మాత్రమే తెలిసినవారికి ఎలా? ఇదే గీతాప్రెస్ వారి లక్ష శ్లోకాల గ్రంథాన్ని యధాతథంగా (శ్లోకాలు లేకుండా) తెలుగులో భావాన్ని అందిస్తూ ఇటీవలే శ్రీలలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్ వారు ప్రింటు చేయించారు. విజయవాడనుండి వాటిని తెప్పించుకొని పరిశీలించవచ్చు. ఇంకా ఏదైనా సందేహాలుంటే జిజ్ఞాస గలవారు నాకు ఫోన్ చేయవచ్చు.

పి.నాగేశ్వరరావు గారు ఏప్రిల్ 2010 ధ్యానమాలిక లేఖామాలికలో 'మహాభారతం రచన ద్వారా నాలో ధర్మజిజ్ఞాస కలిగింది' అని వ్రాశారు. దీనిని బట్టి వారు నా మహాభారత వ్యాసాలను క్రమం తప్పకుండా చదువుతున్న జిజ్ఞాసులని తెలుస్తున్నది. వారే నవంబరు 2011 నాటిలేఖలో 'మహాభారతంలో కర్ణుడు ఎంతటి దుష్టుడైనప్పటికీ దానమనే సుగుణం, త్యాగమనే సద్గుణం కర్ణునిలో ఉంది. అయినప్పటికీ దుష్టచతుష్టయంలో ఒకడుగా మిగిలాడు. మహాభారత విశ్లేషణ బాగుంది' అని వ్రాశారు. ఇందుకు వారిని అభినందిస్తున్నాను. ఈ వివరణ కేవలం వారి కొరకు మాత్రమే కాదు. 'ఎంతనిష్ఠురమైనా నిజాన్ని తెలుసుకోవాలి' అని భావించే అనేకమంది పాఠకుల కొరకు అని గమనించ ప్రార్థన.

**-దేవిశెట్టి చలపతిరావు** (రచయిత) చిలకలూరిపేట

కర్ణుడు కవచ కుండలాలను ఇంద్రునికిస్తే ప్రాణాపాయం కలుగుతుంది గనక, ఎలాగైనా సరే ఇవ్వవద్దు అని చెప్పటానికి - సూర్యభగవానుడు కర్ణుని వద్దకు రావటం జరిగింది. పాండవుల అరణ్యవాసం 10 సంవత్సరాలు ముగిసిన తరువాతనే కర్ణుడిలా ప్రతిజ్ఞ చేయటం జరిగింది. కనుక సుమారు 3 సంవత్సరాలు ఈ విధంగా కర్ణుడు దాన ధర్మాలు చేశాడు. అంటే ఇది సహజ స్వభావసిద్ధమైన దాతృత్వం కాదు. అర్జునుని వధించేంత వరకే ఈ దానధర్మాలు చేస్తానని- అంటే అడిగిన వారికి లేదకుండా ఇస్తానని - కర్ణుడు ప్రతిజ్ఞ చేయటం జరిగింది. ఇది కాలనిర్ణయంతో కూడిన దాతృత్వం అన్నమాట. ఐనా గొప్పదే.

ఈ రకమైన ప్రతిజ్ఞలేవీ లేకుండానే రాజులు దానధర్మాలు చేస్తుంటారు. రాజులకు - ప్రధానంగా క్షత్రియులకు ఇది సహజ గుణం. భీష్మ, ద్రోణాదులు, ధృతరాష్ట్ర, పాండురాజులు, దుర్యోధనాదులు, ధర్మజ భీమార్జునులు, అందరూ తమ తమ స్థాయిలను



K

బట్టి దానధర్మాలు చేసినవారే.

కర్ణుని గురించి ప్రత్యేకంగా దానకర్ణుడు అని చెప్పుకొనే వారెందరో ఉన్నారు. కాని అర్జునుడు దానగుణం కలిగిన వాడని గాని, గొప్ప దానాలు చేశాడనిగాని ఎవరూ అనరు. కాని కురుక్షేత్ర సంగ్రామంలో 17వ రోజున ఈ రోజు నేనో?, అర్జునుడో? ఎవరో ఒక్కరే ఈ భూమి మీద ఉంటారు' అని ప్రతిజ్ఞ చేసి యుద్ధరంగం లోనికి వచ్చాడు కర్ణుడు. 'ఈ రోజు కర్ణుని వధించి గాని తిరిగిరాను. నా ముఖం నీకు చూపించను' అని ధర్మరాజు వద్ద ప్రతిజ్ఞ చేసి యుద్ధరంగంలోనికి ప్రవేశించాడు అర్జునుడు. సాయం సమయానికి బ్రాహ్మణ శాపం వల్ల కర్ణుని రథ చక్రాలు భూమిలోనికి క్రుంగిపోగా, ఒకింతసేపు ఆగమని కర్ణుడు అర్జునుని కోరాడు. నిరాయుధునిపై బాణాలు వేయరాదని నీతి సూత్రాలు వల్లించాడు. రథాన్ని పైకెత్త ప్రయత్నిస్తే భూమి పైకి లేచిందిగాని శాప ప్రభావంతో రథ చక్రం మాత్రం అంగుళం కూడా పైకి లేవలేదు. అట్టి స్థితిలో శ్రీకృష్ణుని ప్రోత్సాహంతో అర్జునుడు కర్ణుని వధించుటకు బాణం ప్రయోగించబోతూ-

*"ఏను తపశ్చరణంబున*
*దానంబున గురుజనాభి దర్పణం*
*బున నిత్యానూన వ్రతశీలుడ*
*నేని కర్ణుందలద్రెంచు నీ శరమనియెన్"*

- (ఆం.మ.భా. కర్ణ.ప)

అని బాణం వేశాడు. ఆ బాణం కర్ణుని తలను త్రెగవేసింది. అంటే అర్జునుడు కూడా దానం వ్రతంగా గలిగిన వాడేనని అర్థమౌతున్నది. ఇక్కడ అర్జునుడు ప్రత్యేకంగా ఏదో కోరికతో, కాల నియమం ప్రకారం దానం చేసినవాడు కాదు. ఇది స్వభావ సిద్ధగుణం.

దుర్యోధనుడు కూడా అనేక దానధర్మాలు చేశాడు. సామంత రాజుల ప్రియంకోసం, వారిని తన వైపు త్రిప్పుకొనుటకోసం, ప్రజలను తన వైపు త్రిప్పుకొనటంకోసం అనేక దానాలు చేశాడు.

## ❀ ❀ ❀ తెలుసుకుందాం ❀ ❀ ❀



ప్రతి ప్రాణియొక్క హృదయం నందు దాగియుండునదియు, అందరియందును సమానముగా వెలయుచుండునదియు అగు ఆత్మను గూర్చియే నేను బోధించుదును. అట్టి ఆత్మను తెలిసికొనువారును, అట్టి ఆత్మ ప్రకాశమందు స్థితి కలిగి యుండువారునగు కొద్దిమంది అయిననూ ప్రపంచమునంతటినీ తేజోవంతముగా నొనర్పగలరు.

ఈ మాటను దుర్యోధనుడే స్వయంగా తండ్రితో చెప్పాడు. "ప్రజలంతా ధర్మరాజు రాజ్యాన్నే కోరుతున్నారు. దాని నెటింగి గాదె దాన సమ్మానంబుల ప్రకృతి జనులను నా వశం చేసుకుంటున్నాను" అని కర్ణుని తనవైపున స్థిరం చేసుకోవటానికి అంగ రాజ్యాన్నే ఇచ్చివేశాడు. ధనానికి దానం- భోగం ఈ రెండే ప్రధానం గనుక దానధర్మాలు చేస్తూ భోగాలనుభవించాడు. అయితే ఇది కూడా ఏదో ప్రతిఫలాపేక్షతో చేసినదే గనుక సరైన దానం కాదు.

**మరి నిజమైన దానం ఎలా ఉండాలి? ఏదైనా ప్రతిఫలాన్ని స్వీకరించిగాని, లేదా భవిష్యత్తులో వారివల్ల తనకు ఏదో ఒక విధమైన ప్రయోజనం సిద్ధిస్తుందని గాని కాకుండా ఉపకార బుద్ధితో, దయా స్వభావంతో, లోకకళ్యాణ కాంక్షతో, బాధా నివారణ దృష్టితో స్వభావసిద్ధంగా చేసే దానమే నిజమైన దానం.**

ఇలాంటి దానాలు చేసిన వారిలో సుప్రసిద్ధులు, ఇతరులెవ్వరికీ శక్యం కానటువంటి గొప్ప దానాలు చేసినవారు... శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి, దధీచి మొ॥వారున్నారు.

శిబి చక్రవర్తి తన శరీరంలోని కండలను కోసి ఇచ్చినవాడు. ప్రతిఫలం కోరకుండా, బలిచక్రవర్తి తన సర్వస్వాన్ని అర్పించాడు, ఇచ్చిన మాటకు కట్టుబడి.

దధీచి మహర్షి దేవతల మేలుకొరకు ప్రాణత్యాగం చేసి వెన్నెముకను ఇచ్చాడు.

అలాంటి వారిని గొప్ప దానగుణం కలిగిన వారుగా, త్యాగ మూర్తులుగా చెప్పుకోవాలి. అంతేగాని ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించిగాని, ఇతరులను వధించాలనే కోరికతో ప్రతిజ్ఞ చేసిగాని, తాను కష్టపడి సంపాదించిన దానిని కాక, ఇతరుల నుండి దానంగా స్వీకరించిన దానిని గాని దానం ఇవ్వటం సరైన దానం కాదు, గొప్ప దానం కూడ కాదు.

అయితే కర్ణుని 'దానకర్ణుడు' అని లోకంలో అందరూ అంటున్నారే. మరి కర్ణుడు అంత గొప్ప దానం ఏమి చేశాడు? శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి, దధీచి గొప్పదానాలు చేసినా వారికి పేరుముందు 'దాన' అనే బిరుదును తగిలించి 'దానశిబి', 'దాన బలి', 'దాన దధీచి' అని అనటం లేదు. మరి వారి కన్న గొప్ప దానం ఏం చేశాడని కర్ణుణ్ణి 'దాన కర్ణుడు' అంటున్నారు?- ఎందుకంటే-

దేవేంద్రునికి, కవచకుండలాలు దానం ఇవ్వటం వల్లనే - తన శరీరంపై సహజంగా, పుట్టుకతోనే ఉన్న కవచ కుండలాలను కోసి ఇవ్వటం వల్లనే 'దాన కర్ణుడు' అంటున్నారు. అయితే ఈ కవచకుండల దానం ఎటువంటిదో, ఎలా ఇచ్చాడో, కర్ణునికి దేవేంద్రునికి మధ్య ఏమి జరిగిందో, కర్ణుని దాతృత్వ నిష్ఠ ఎలాంటిదో ఇక తెలుసుకుందాం... **-సశేషం**

 **సామర్థ్యం కన్నా ఆత్మవిశ్వాసలోపమే వైఫల్యానికి కారణం**

# మహాభారతం

## కర్ణుడు 37

కర్ణుడు

రచన
మహాభారత పరిశోధకులు, అభినవ వ్యాస
జ్ఞానప్రపూర్ణ శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట
ఫోన్ : 08647-254716, సెల్ : 80085 39770
visit:www.srichalapathirao.com

(గత సంచిక తరువాయి)

కర్ణుని 'దాన కర్ణుని'గా కీర్తించుటకు కారణమైన కవచకుండల దానం ఎటువంటిదో; అసలు అప్పుడు సూర్యునికి కర్ణునికి మధ్య జరిగిన సంభాషణ ఏమిటో, ఇంద్రునికి కర్ణునికి మధ్య జరిగిన సంభాషణ ఏమిటో మహాభారత గ్రంథం నుండి సంపూర్ణంగా తెలుసుకొని ఆపైన కర్ణుని దాతృత్వ నిష్ఠను గురించి విశ్లేషణ చేద్దాం.



**1. సూర్యభగవానుడు కర్ణునికి స్వప్నంలో కనిపించి మాట్లాడుట:**

(వనపర్వం 300 అధ్యాయం 5వ శ్లోకం నుండి 302 అధ్యాయం 21వ శ్లోకం వరకు)

*శ్లో॥ ద్వాదశే సమతి క్రాంతే వర్షేప్రాప్తే త్రయోదశే,*
*పాండూనాం హిత కృచ్ఛక్రః కర్ణం భిక్షితు ముద్యతః ॥*

(వన ప. 300 అ.5 శ్లో)

తా॥ పాండవుల వనవాస దీక్ష 12 సం॥లు గడిచి 13 వ సంవత్సరం ప్రారంభం కాబోతుండగా పాండవుల హితకారియైన దేవేంద్రుడు కర్ణుని కవచకుండలాలను యాచించ దలచాడు.

ఆ విషయాన్ని గ్రహించిన సూర్యుడు పుత్రప్రేమతోను, దయతోను కర్ణునికి స్వప్నంలో బ్రాహ్మణ వేషంలో కనిపించి ఇలా అన్నాడు, "కర్ణా! నీ హితాన్ని కోరి చెప్పే నా మాటలు విను. పాండవుల మేలుకోరి దేవేంద్రుడు బ్రాహ్మణ వేషంలో నీ కవచ కుండలాలను అర్థించటానికి వస్తాడు. **'నీవు అడిగిన వారికి లేదనకుండా ఇస్తావని, తిరిగి వారిని నీవేమీ అడగవనే నీ నియమం' ఈ జగత్తులో అందరికీ తెలుసు. నీ దానశీలత ఎట్టిదో తెలిసిన ఇంద్రుడు నీ కవచకుండలాలను దానమడుగుటకు రాబోతున్నాడు. వాటిని అతడు అర్థించినా నీవు మాత్రం చల్లగా, అనునయంగా మాట్లాడి, వీటిని మాత్రం ఇవ్వవద్దు. వీటిని కోరినప్పుడల్లా ధనమో, బంగారమో, లేక రత్నాలు, స్త్రీలు, గోవులు, భూమి- ఇలా ఏవైనా సరే ఇచ్చి, వీటిని మాత్రం ఇవ్వకుండా తప్పించుకో.** నీకు జన్మతో బాటుగా వచ్చిన ఈ కవచ కుండలాలు అమృతమయాలు. అంటే ఇవి అమృతం నుండి పుట్టినవి. ఇవి ఇచ్చావా! నీకు మరణం తప్పదు. ఇవి ఉంటే యుద్ధరంగంలో నీవు శత్రువులకు అవధ్యుడవౌతావు. నీవు జీవించాలంటే వీటిని రక్షించుకో" అన్నాడు. (వన ప. 300. అ. 6-20 శ్లో)

అది విని కర్ణుడు, "మహాత్మా! నాకు హితాన్ని కలిగించడానికి దయతో ఈ బ్రాహ్మణ వేషంలో వచ్చిన మీరు ఎవరు?" అని అడుగగా, "నేను సూర్యుడను, స్నేహవశమున నీకు దర్శనమిచ్చి, నీకు హితాన్ని చెబుతున్నాను. నా మాటవింటే నీకు శుభం కలుగుతుంది" అన్నాడు సూర్యుడు. దానికి కర్ణుడు, **"మహాత్మా! మీ హితవచనాలు తప్పక నాకు శుభాన్ని కలిగిస్తాయి. నిజమే, ఐతే నన్ను నా వ్రతం నుండి విముఖుడిని** చేయవద్దని ప్రార్థిస్తున్నాను. శ్రేష్ఠ బ్రాహ్మణులు యాచిస్తే నా ప్రాణాలైనా ఇస్తాను. ఇది నా వ్రతం. పాండవ హితం కోరి **బ్రాహ్మణ వేషంలో సాక్షాత్తు ఇంద్రుడే వచ్చి అర్థిస్తే నేను తప్పక నా కవచ కుండలాలు ఇస్తాను. దీనితో నాకు ముల్లోకాల్లోనూ కీర్తి వస్తుంది. నా లాంటి వీరుడు ప్రాణాలిచ్చి అయినా కీర్తిని పొందాలి. కీర్తి కోసం మృత్యువును అంగీకరిస్తాను. కనుక ఇంద్రునికి శ్రేష్ఠమైన భిక్షనిచ్చి ఉత్తమ గతిని పొందుతాను"** అన్నాడు. (వన ప. 300. అ. 21-39శ్లో)

అంతట సూర్యుడు "కర్ణా! నీవు నీ తల్లిదండ్రులకు, భార్యాబిడ్డలకు, మిత్రులకు కీడు తలపెట్టకు, బ్రతికి ఉన్నప్పుడే కీర్తికి విలువ. చనిపోయినవాడు బూడిదైపోతాడు. చనిపోయిన వాడికి కీర్తి శవానికి చేసిన అలంకారం వంటిదే. ఈ విషయంలో ఒక దేవ రహస్యం ఉంది. అందుకే నేను ఇంతగా చెబుతున్నాను. ఇంద్రుడు అర్థించినా సరే నీవు మాత్రం నీ కవచకుండలాలనివ్వవద్దు. ఎందుకంటే, నీవు అర్జునునితో ఎడతెగని స్పర్థను పెట్టుకున్నావు. ఈ కవచ కుండలాలున్నంత వరకు అర్జునుడు నిన్ను వధించలేడు. అందుకే అర్జునికి మేలు చేయడానికి ఇంద్రుడు నీ వద్దకు వస్తున్నాడు" అన్నాడు.

(301 అ. 1. 18 శ్లో)

 **ఆత్మవిశ్వాసం కోల్పోయినవాడు ఎంతబలవంతుడైనా చిన్న చీమకన్నా హీనమే**

"సూర్యదేవా! నన్ను క్షమించండి, నేను అబద్ధానికి భయపడినట్లు మరణానికి కూడా భయపడను. విశేషించి బ్రాహ్మణులకు ప్రాణమైనా ఇవ్వడానికి వెనుకాడను. నీవు అర్జునుని తలచుకొని నా కొరకు భయపడవద్దు. నాకు గల అస్త్రబలం మీకూ తెలుసు. నేను పరశురాముని వద్ద, ద్రోణాచార్యుని వద్ద అనేక దివ్యాస్త్రాలు పొందాను. నేను యుద్ధంలో అర్జునుని తప్పక జయిస్తాను. కనుక యాచనకై వచ్చిన ఇంద్రునికి ఈ కవచ కుండలాలనిచ్చి, నా వ్రతాన్ని నిలుపుకొనుటకు నాకు అనుమతి దయచేయండి" అని ప్రార్థించాడు కర్ణుడు.

అంతట సూర్యుడు, "కర్ణా! నీ కవచ కుండలాలను ఇంద్రునికి ఇవ్వక తప్పని పక్షంలో నీవు కూడా ఇంద్రుని వద్ద నుండి నీ విజయం కొరకు ఒక అస్త్రాన్ని అడిగి తీసుకో. ఇంద్రుని వద్ద అమోఘమైన 'శక్తి' ఉన్నది. అది యుద్ధంలో వందలాది శత్రువులను సంహరించిగాని తిరిగి చేతికి రాదు. కవచ కుండలాలకు బదులుగా ఆ 'శక్తి'ని ఇచ్చే షరతు మీదనే నీవు దేవేంద్రుని కోరికను నెరవేర్చు. ఆ ఇంద్రుని 'శక్తి' ద్వారా నీ శత్రువులందరినీ యుద్ధంలో వధించగలుగుతావు" అని సలహా ఇచ్చి సూర్యుడు అంతర్ధానమయ్యాడు.

కర్ణుడు నిద్ర లేస్తూనే స్వప్నాన్ని తలచుకొని శక్తికోసం ఇలా నిశ్చయించుకున్నాడు. "దేవేంద్రుడు నా కవచ కుండలాల కొరకు యాచిస్తే నేను శక్తిని తీసుకొని మాత్రమే వీటిని ఇస్తాను" అని. ఆ తరువాత కర్ణుడు నిత్యకృత్యములాచరించి, సూర్యుని ఉపాసించి, తన స్వప్న వృత్తాంతమును సూర్యునికి నివేదించగా "నీవు కలలో చూచినదంతయూ సత్యమే.." అని సూర్యుడు అన్నాడు.

*శ్లో॥ తతస్తత్వ మితి జ్ఞాత్వా రాధేయః పరవీరహా।*
*శక్తి మేవాభి కాంక్షన్ వై వాసవం ప్రత్యపాలయత్॥*
(వన ప. 302. అ.21శ్లో)

తా॥ అప్పుడు శత్రు సంహారకుడైన రాధేయుడు స్వప్న వృత్తాంతమంతయు సత్యముగా గ్రహించి, శక్తిని తీసుకోవాలనే కోరికతో ఇంద్రుని రాక కోసం ఎదురుచూస్తున్నాడు.

**2. అర్థించవచ్చిన ఇంద్రునికి కర్ణునికి మధ్య జరిగిన సంభాషణ : (వన ప.310, అ.1 - 35శ్లో)**

కర్ణుడు సూర్యోపాస్తి చేయుచుండగా బ్రాహ్మణ వేషంలో దేవేంద్రుడు వచ్చి 'భిక్షాందేహి' అని కర్ణుని అర్థించాడు. కర్ణుడు అతడికి స్వాగతం పలికి "విప్రోత్తమా! స్వర్ణ కంఠాభరణాలు ధరించిన సుందరీమణుల నిమ్మంటావా? అసంఖ్యాకమైన గోవులనిమ్మంటావా? లేక సస్య సమృద్ధమైన గ్రామాలను కోరుకుంటావా? ఏమి కావాలో కోరుకో!" అన్నాడు. దానికా బ్రాహ్మణ వేషధారి, "అనఘా! నీవు సత్యవ్రతుడవైతే నీ సహజ కవచకుండలాలను కోసి ఇవ్వు ఇదే నీనుండి నేను కోరే దానం" అన్నాడు. దానికి కర్ణుడు-

*శ్లో॥ అవనిం ప్రమదా గాశ్చ నివాసం బహువార్షికం।*
*తత్తే విప్ర ప్రదాస్యామి నతు వర్మ స కుండలం॥*
(వన ప. 310 అ.6 శ్లో)

తా॥ బ్రాహ్మణోత్తమా! నీకు భూమినిగాని, తరుణ వయస్కులైన సుందరీ మణులనుగాని, గోవులను గాని, చాలాకాలం జీవించటానికి కావలసిన సంపదలను గాని ఇస్తాను. కాని ఈ కవచ కుండలాలను మాత్రం ఇవ్వను" అన్నాడు. కర్ణుడెన్నో విధాల అనునయించాడు. ఆశ చూపించాడు. కాని ఆ బ్రాహ్మణ వేషధారి కవచకుండలాలను తప్ప మరి దేనినీ స్వీకరించటానికి అంగీకరించలేదు. అంత కర్ణుడు, "ఓ బ్రాహ్మణోత్తమా! ఈ కవచం నాకు పుట్టుకతోనే శరీరంతో కూడి వచ్చినది. ఈ కుండలాలు అమృతమయాలు. వీటివల్లనే నేను ఈ జగత్తులో అవధ్యుడనై యున్నాను. కనుక నేను వీటిని విడిచి పెట్టజాలను. నీవు నా సమస్త రాజ్యాన్ని తీసుకో, వీటిని వదులుకుంటే నాకు మరణం తప్పదు" అన్నాడు. అయినప్పటికీ ఆ కపట బ్రాహ్మణుడు అవి తప్ప మరి వేటినీ అంగీకరించలేదు. ఇంతవరకు జరిగిన విషయాన్ని ఒకసారి విశ్లేషణ చేద్దాం.

'అడిగిన వారికి లేదనకుండా ఇవ్వటం కర్ణుని నియమం' అని సూర్యభగవానుడు చెప్పాడు. కర్ణుడు కూడా 'శ్రేష్ఠ బ్రాహ్మణులు యాచిస్తే నా ప్రాణాలైనా ఇస్తాను. ఇది నా వ్రతం. నన్ను నా వ్రతం నుండి విముఖుణ్ణి చేయవద్దు" అని సూర్యుని ప్రార్థించాడు. అంతేకాదు ఇంద్రుడే వచ్చి అర్థిస్తే నేను తప్పక నా కవచకుండలాలను ఇస్తాను- అని సూర్యునితో తన నిశ్చయాన్ని చెప్పాడు కర్ణుడు. కాని జరిగిందేమిటి? ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి 'భిక్షాందేహి' అని అనగానే "ఏమి కావాలో

**లక్ష్మీదేవి ఉండని దెక్కడ?**



నిన్నటి బట్టలు ధరించినవారి దగ్గర, రెండు సంధ్యకాలాల్లో నిద్రపోయే ఇంట్లో లక్ష్మి వుండదు. ధనానికీ, ధాన్యానికీ, పుస్తకానికీ, పెద్దలకీ కాళ్లు తగిలితే శ్రీలక్ష్మీదేవికి కోపం వస్తుంది.

అన్నింటికీ మించి స్త్రీలు కన్నీరు పెట్టుకునే చోట ఆమె ఉండకపోవటమే కాదు, ఆ పరిసరాల్లో కూడా ఉండదు. స్త్రీ కంటి నుంచి కన్నీరు జారిందంటే లక్ష్మీదేవి అక్క జ్యేష్ఠాదేవికి పిలుపు నిచ్చినట్టే.

సూక్తిమాలిక — ఆధ్యాత్మికమార్గం సంసారులకే కానీ అహంకారులకు కాదు

కోరుకో" అన్న కర్ణుడు- "నీవు సత్యవ్రతుడవైతే నీ కవచ కుండలాలు కోసి ఇవ్వు" అని బ్రాహ్మణ వేషధారి అడుగగానే "ఈ కవచ కుండలాలు మాత్రం ఇవ్వను" అన్నాడు. ఇదేనా అడిగిన వారికి లేదనకుండా ఇవ్వటం? శ్రేష్ఠ బ్రాహ్మణులు యాచిస్తే ప్రాణాలైనా ఇస్తానని అనటం వ్రత నియమాన్ని పాటించటమా? నేను ఇంద్రునికి తప్పక నా కవచ కుండలాలు ఇస్తాను అని సూర్యుని వద్ద నిశ్చయించి చెప్పిన కర్ణుడు ఇంద్రుడు వచ్చి అర్థించగానే "ఇవ్వను" అనటం సత్యసంధతా? పైగా "ఈ కవచ కుండలాలు అమృత మయాలు. వీటివల్లనే నేను జగత్తులో అవధ్యుడనై యున్నాను. వీటిని వదులుకుంటే నాకు మరణం తప్పదు" అన్నాడు. కర్ణుడు. శ్రేష్ఠ బ్రాహ్మణులు యాచిస్తే ప్రాణాలైనా ఇస్తానన్నవాడు ప్రాణాలు పోతాయి గనుక వీటిని ఇవ్వను అంటున్నాడంటే అతడి వ్రతం - నియమం ఎంత గట్టిదో తెలుస్తున్నది. అంటే ప్రాణాలైనా ఇస్తాడు గాని ప్రాణం పోతే ఒప్పుకోడన్నమాట. బ్రాహ్మణులు కోరితే ప్రాణాలైనా ఇస్తాను నాకీ కవచ కుండలాలొక లెక్కా? అన్న కర్ణుడేనా నేనీ కవచ కుండలాలనివ్వనంటున్నవాడు? ఇదేనా కర్ణుని సత్యసంధత? నియమ పాలన? దాన నిష్ఠ? అడిగిన దానిని కాదనకుండా ఇచ్చే మహాదాత లక్షణం ఇదేనా?-

ఇంతకూ కర్ణుడు కవచకుండలాలివ్వక పోవడానికి కారణం వాటిని ఇస్తే తనకు ప్రాణాపాయం గనుక. అంటే తనకు అంతగా ఉపయోగం లేనివాటినే దానమిస్తాడా కర్ణుడు?

కుమారుడు తండ్రితో అన్నాడు "నాన్నా గుమ్మడి కాయ కుళ్ళిపోయింది" అని. దానికా తండ్రి అన్నాడు "మన బర్రెకు వెయ్యరా తింటుంది" అన్నాడు. కుమారుడన్నాడు..."వేశాను నాన్నా, తినలేదు" అని. అప్పుడా తండ్రి "అయితే మన బ్రాహ్మణుణ్ణి పిలిచి దానమియ్యి" అన్నాడట. ఇలా ఉంది కర్ణుని త్యాగం. కోరిన వాటిని లేదనకుండా ఇచ్చే వ్రతం ఇదేనా? - ఆ తరువాత ఏమి జరిగిందో మహాభారత గ్రంథంలోనికి తొంగి చూద్దాం...

కర్ణుడెన్ని విధాల చెప్పినా కవచ కుండలాలు తప్ప మరి దేనినీ అంగీకరించని బ్రాహ్మణునితో నవ్వుతూ, "విప్రోత్తమా! నీవు సాక్షాత్తు దేవేంద్రుడవు. బ్రాహ్మణ వేషంలో నీవు వస్తున్నట్లు నాకు ముందే తెలుసు. నీవు ఈ జగత్తుకు ఈశ్వరుడవు. కనుక నీవే నాకు వరం ఇవ్వాలి. అదే సముచితం. నేను నీకు సముచితం కాదు. నీవు కోరినట్లు నేనీ కవచ కుండలాలను ఇస్తే నాకు ప్రాణహాని. నీవిలా నా వద్దనుండి పుచ్చుకుంటే నీకు మానహాని.

*శ్లో॥ తస్మాద్ వినిమయంకృత్వా కుండలే వర్మ చోత్తమం।*
*హరస్వ శక్రమామం మే న దద్యామ హా మన్యథా॥*

(310, అ.17శ్లో)

తా॥ అందువల్ల "ఓ దేవేంద్రా! వినిమయం చేసుకొని (వస్తు మారకం చేసుకొని) ఈ కవచ కుండలాలను తీసుకో. అలా కానిచో నేను వీటిని నీకు ఇవ్వలేను" అన్నాడు కర్ణుడు.

విశ్లేషణ: -అయింది. ఇప్పటిదాకా ముఖానికి వేసుకున్న రంగు కడుక్కున్నాడు. 'ఆ! నీవు బ్రాహ్మణుడవు కాదు. దేవేంద్రుడివి' అని రహస్యాన్ని ఇప్పుడే తెలుసుకున్నట్లు బయట పడ్డాడు. ఇప్పటి వరకు వచ్చినవాడు ఇంద్రుడని తెలియదా? ఏ బ్రాహ్మణుడైనా కవచ కుండలాలను కోసి ఇమ్మంటాడా? ముందే సూర్యుడు చెప్పినందున కవచ కుండలాలు కోరిన బ్రాహ్మణుడు ఇంద్రుడని తెలిసినా, తెలియనట్లుగా ఇంత నటన ఎందుకు? ఈ నటన కూడా మహాదాతల లక్షణమా? ఇంతకూ ఏమీ తెలియనట్లు ఈ అమాయకపు నటన ఎందుకంటే సూర్యుడు చెప్పినట్లుగా అసలు కవచ కుండలాలు ఇవ్వకుండా పంపటానికే. ఏదో ఆశ చూపి, అనునయించి పంపటానికి సాధ్యం కాకపోవటంతో, తప్పని పరిస్థితిలో, తన నటనకు ముగింపు పలికి ఇప్పుడు, "ఆ! తెలిసింది. నీవు దేవేంద్రుడవు. నేను నిన్ను కోరవచ్చు గాని నీవు నన్ను కోరరాదు" అని ఒక పాచిక విసిరాడు. కాని ఈ పాచికా పారలేదు.

ఇక తప్పించుకొనే వీలు లేదు కనుక, సూర్యుని చివరి సలహా ప్రకారం, తన అంతిమ కోరిక ప్రకారం కథ నడిపించాడు. ఈ కవచ కుండలాలు ఇస్తే నాకు ప్రాణహాని, నీకు మానహాని, కనుక వినిమయం చేసుకుందాం.(తస్మాత్ వినిమయం కృత్వా) అని వస్తుమార్పిడికే దిగాడు. "ఈ కవచ కుండలాలలకు బదులుగా నీవు నాకు కోరిన దానిని ఇచ్చినప్పుడే వీటినిస్తాను. లేకపోతే ఇవ్వలేను" అన్నాడు. తన లోలోపల కోరికను నెరవేర్చుకొనుటకు ఇలా గట్టి పునాదినే వేసుకున్నాడు. ఆ తరువాత ఏం జరిగింది?-

కర్ణుని ఈ షరతును తెలుసుకొని దేవేంద్రుడు, "కర్ణా! నేను నీ వద్దకు వచ్చే విషయాన్ని ముందుగానే తెలుసుకున్న సూర్యుడు నీకీ విషయాన్ని చెప్పినట్లు నాకు తెలుసు. సరే, నీ ఇష్ట ప్రకారమే వినిమయం చేసుకుందాం. నా వజ్రాయుధాన్ని తప్ప నీవేం కోరుకుంటావో కోరుకో- అనగా...

వైశంపాయన ఉవాచ:

శ్లో॥ తతః కర్ణః ప్రహృష్టస్తు ఉపసంగమ్య వాసవం।
అమోఘం శక్తి మభ్యేత్య వవ్రే సంపూర్ణ మానసః॥

(310 అ. 20శ్లో)

తా॥ అంతట కర్ణుడు అత్యంత సంతోషంతో దేవేంద్రుని సమీపించి, సఫల మనోరథుడై దేవేంద్రుని యొక్క అమోఘ 'శక్తి'ని కోరుకున్నాడు.

"దేవేంద్రా! సేనాగ్రభాగంలోని శత్రు సమూహాలను సంహ

రించే నీ అమోఘమైన 'శక్తి'ని నాకు ఇచ్చి, ఆ తరువాత ఈ కవచ కుండలాలను తీసుకో" అన్నాడు కర్ణుడు.

విశ్లేషణ:– తన వస్తు మారక బేరానికి ఇంద్రుడు అంగీక రించటంతో కర్ణునికి చెప్పలేనంత సంతోషం వేసింది. **తన కోరిక నెరవేరినందుకు సంతోషాన్ని దాచుకోలేక ఇంద్రుని సమీపించి, 'అమోఘమైన నీ 'శక్తి'ని ఇవ్వమని' కోరాడు. అంటే సూర్యుని దగ్గర "శ్రేష్ఠ బ్రాహ్మణులు యాచిస్తే నా ప్రాణాలైనా ఇస్తాను. నాకీ కవచ కుండాలలొక లెక్కా?" అనీ; "సాక్షాత్తు ఇంద్రుడే వచ్చి యాచిస్తే నా ప్రాణాలైనా ఇస్తాను. నాకీ కవచ కుండలాలొక లెక్కా?" అనీ, అబద్ధానికి భయపడినట్లు మరణా నికి కూడా భయపడను" అనీ; అర్జునుని తలచుకొని మీరు భయపడవద్దు. నా అస్త్రబలం ఏమిటో మీకు తెలుసు, నేను యుద్ధంలో అర్జునుని తప్పక వధిస్తాను" అనీ – ఎన్ని బడాయిలు పోయినా చివరకు ఆ సూర్యుడు చెప్పినట్లే 'శక్తిని నాకిచ్చి కవచ కుండలాలు తీసుకో'** అన్నాడు కర్ణుడు.

**"శక్తి మే వా భి కాంక్షన్ వై వాసవం ప్రత్య సాలయత్"** శక్తిని తీసుకోవాలనే తీవ్రమైన కోరికతో ఇంద్రుని కొరకై ఎదురు చూసిన దానికి ఫలితం దక్కినందుకు కర్ణుని ఆనందం వర్ణనా తీతం. అందుకే "కర్ణః ప్రహృష్టస్తు" అన్నది. ఎందుకు **కర్ణునికి 'శక్తి'పై అంత కాంక్ష? కవచ కుండలాలు పోయిన దానికన్నా దేవేంద్రుని 'శక్తి' లభిస్తే ఎక్కువ లాభం అని కర్ణుడెందుకు ఆలోచించాడు?** ఆ విషయాన్ని తర్వాత చూద్దాం.

**అయితే ఇలా ఒక వస్తువును బదులుగా తీసుకొని, మన దగ్గరున్న దాన్ని ఎదుటి వానికిస్తే అది దానమా? లేక వస్తు మారక బేరమా? అనేది ఆలోచించవలసిన విషయం. –** ఇలా శక్తిని కోరుకున్న తర్వాత ఏమి జరిగింది?–

కర్ణుడలా శక్తిని కోరటంతో దేవేంద్రుడు, "కర్ణా! ఈ శక్తి నా చేత విడువబడి, అనేకమంది శత్రువులను వధించి తిరిగి నా చేతికి వస్తుంది. అయితే నీవు ఈ శక్తిని ప్రయోగించినప్పుడు ఒక తేజోవంతుడు, పరాక్రమ శాలి, దుర్జయుడు ఐన మహా వీరుణ్ణి ఒక్కరిని మాత్రం వధించి, తిరిగి నా చేతికి వస్తుంది. ఈ షరతుపై వినిమయం చేసుకుందాం" అన్నాడు. అప్పుడు కర్ణుడు–

***శ్లో॥ ఏకమేవా౾ హ మిచ్ఛామి రిపుం హంతుం మహాహవే!***
***గర్జంతం ప్రతపంతంచ యతో మమభయం భవేత్॥***
(310 అ. 26శ్లో)

**తా॥ "దేవా! నాకు భయం కలిగిస్తున్న శత్రువు ఒక్కడే ఉన్నాడు. మహాయుద్ధంలో అతడిని వధించటమే నా కోరిక. దుర్జయుడైన ఆ శత్రువును ఈ శక్తితో వధిస్తాను"** అన్నాడు.

దానిపై దేవేంద్రుడు, "కర్ణా! నీవు ఎవరికొరకై ఈ శక్తిని కోరుతున్నావో అతడికి శ్రీమన్నారాయణుడు రక్షగా ఉన్నాడు. కనుక నీ కోరిక నెరవేరదు. ఐతే ప్రబలుడై గర్జించే ఒక మహా వీరుణ్ణి ఇది తప్పక వధించగలదు. ఇందులో సందేహం లేదు" అన్నాడు. ఆ మాటకు కర్ణుడు **"అలాగే, ఒక్క వీరుణ్ణి సంహరించే 'శక్తి'నే నాకిమ్ము" అని పలికి, ఇప్పుడు నా కవచ కుండలాలు ఛేదించి ఇస్తే, నా శరీరం భీభత్సంగా ఉంటుంది గదా! ఎలా?"** అనగా, ఇంద్రుడు "నీ శరీరంపై ఒక్క గాయం కూడా కాదు. సూర్యునితో సమానమైన రంగు, తేజస్సు నీకు సంభవిస్తుంది" అన్నాడు. ఆ తరువాత ఇంద్రుడే మళ్ళీ అంటున్నాడు, "కర్ణా! మరొక విషయం గుర్తుంచుకో. శత్రువును వధించటానికి నీ వద్ద సమర్థమైన శస్త్రం ఉన్నప్పుడుగాని, నీకు ప్రాణహాని సమయం ప్రాప్తించనప్పుడుగాని ఈ శక్తిని ప్రయోగిస్తే అది తిరిగి నీపైనే పడుతుంది"– అన్నాడు. దానికి కర్ణుడు "దేవా! నీవు చెప్పినట్లే ప్రాణసంకట సమయంలోనే నీవు ప్రసాదించే ఈ 'శక్తి'ని ప్రయోగిస్తా" అన్నాడు.

***శ్లో॥ తతః శక్తిం ప్రజ్వలితాం ప్రతి గృహ్యావిశాంపతే!***
***శస్త్రం గృహీత్వా నిశితం సర్వగాత్రాణ్య కృంతత॥***
(వనప. 310 అ. 35శ్లో)

**తా॥ అంతట ఇంద్రుని ప్రజ్వలిత 'శక్తి'ని ముందుగా తీసు కొని కర్ణుడు ఆ తరువాత పదునైన కత్తితో తన శరీర అంగాల నుండి కవచ కుండలాలను కోసి ఇచ్చాడు. ఇదీ కథ.**

**విశ్లేషణ :– అడిగిన వారికి లేదనకుండా ఇవ్వటమేగాని తిరిగి వారినేమీ అడగట కర్ణుడు.** ఈ నియమం జగత్తులో **అందరికీ** తెలుసునట. మరి ఇప్పుడెందుకు శక్తిని అడిగాడు? **అదీ ముందుగా శక్తిని ఇచ్చి, తరువాతనే కవచ కుండలాలను తీసుకో మంటున్నాడే. ఏమైంది అతడి నియమం? అబద్ధానికి భయపడి**


## వివేకామృతం


- మనిషికి సహాయం అంటూ ఏదీ లేదు. ఇంతకు ముందు ఎన్నడూ లేదు, ఇప్పుడూ లేదు, ఇకపై వుండదు. నీవు అనంతశక్తి సమన్వితుడవు. నీలోని శక్తి ద్వారానే నీ కష్టాల నుండి బయటపడాలి. నిన్ను నీవే రక్షించుకోవాలి. నీకు సహాయం చేసేవారెవరూ ఎన్నడూ లేరు. అలా ఉన్నారని భావించడం ఒక మధుర భ్రాంతి. దీనివలన ఏ మేలూ ఒనగూరదు.
- సంఘటితంగా పనిచేయడం కావాలి. నీవు నన్ను అర్థం చేసుకుంటావా? మీకెవరికైనా బుర్రలో ఈపాటి మేధాశక్తి ఉందా? ఉంటే మీ మనస్సును పనిచేయనివ్వండి.

 **బడి నుండి సమాధి వరకూ నిత్యం విద్యాభ్యాసం చేస్తూనే వుండాలి.**

K

నట్లు మరణానికి కూడా భయపడని వాణ్ణి అని గదా! కర్ణుడు బడాయికి పోయింది. మరి ఇది అబద్ధం కాదా? సినిమాలలో, హరికథలలో, బుర్రకథలలో కర్ణుని గొప్పదాతగా చెప్పేవారు మహాభారత గ్రంథాన్ని చూచిన వారేనా?

కవచ కుండలాలు కావాలంటే ముందుగా నీ దగ్గరున్న 'శక్తి'ని ఇవ్వాలని షరతు పెట్టాడు కర్ణుడు. 'ఒక్క శత్రువును మాత్రమే చంపుతుందనే షరతు పెట్టి ఇచ్చాడు ఇంద్రుడు. ఎప్పుడు పడితే అప్పుడు ప్రయోగించరాదని, యుద్ధరంగంలో అన్ని అస్త్రాలు వ్యర్థమై, ప్రాణ సంకటం తటస్థించినప్పుడే ఈ శక్తిని ప్రయోగించాలనే షరతుకూడా పెట్టాడు ఇంద్రుడు. అన్నింటికీ సరేనని పుచ్చుకున్నాడు కర్ణుడు. ఎందుకు?' కవచ కుండలాలు పోయినా శక్తి ఉంటే చాలు, అదే తనకు ఈ బేరంలో లాభం' అని. అలా ఎందుకనుకున్నాడు కర్ణుడు? ఏమిటా లాభం?

తనకు అర్జునుని చంపటమే ప్రధానం. అదొక్కటే తనకు అసాధ్యమైన కార్యం. కవచ కుండలాలు ఇతరులు తనను వధించకుండా సాయపడతాయేగాని ఇతరులను వధించటానికి పనికిరాదు. 'నా అస్త్రసంపద ఎట్టిదో మీకూ తెలుసు, అర్జునుని తప్పక నేను వధించగలను' అని సూర్యుని వద్ద ఎన్ని ప్రగల్భాలు పలికినా, ఎన్నిసార్లు 'నేను అర్జునుని వధింపగలను' అని దుర్యోధనుని వద్ద నమ్మబలికినా తన బలం అర్జునుని ముందు ఏ పాటిదో కర్ణునికి తెలుసు. కవచకుండలాలున్నప్పుడే దుర్యోధనునికి సహాయంగా వెళ్ళి, ద్రుపదునితో యుద్ధం చేసి ఓడి పారిపోయిన వాడు కర్ణుడు. కవచ కుండలాలున్నప్పుడే ఘోషయాత్రకై చతురంగ బలాలతో వెళ్ళి, గంధర్వులతో పోరి, పారిపోయి వచ్చినవాడు కర్ణుడు. ఆ ద్రుపదుని, ఈ గంధర్వులను భీముని సహాయంతో పారిపోయి వచ్చినవాడు కర్ణుడు. ఆ ద్రుపదుని, ఈ గంధర్వులను భీముని సహాయంతో జయించినవాడు అర్జునుడు, ఇక ద్రౌపదీ స్వయంవర సమయంలో బ్రాహ్మణ వేషంలో ఉన్న అర్జునునితో పోరి ఓడి పారిపోయి వచ్చినవాడు ఈ కర్ణుడు. అప్పుడూ ఈ కవచకుండలాలున్నాయి. పరశురాముని వద్దనుండి నేర్చుకున్న బ్రహ్మాస్త్రం ప్రాణాపాయ సమయంలో గుర్తురాదు. ఇక ఎన్ని దివ్యాస్త్రాలున్నా వాటికన్నా ఎక్కువగా అర్జునుని వద్ద ఉన్నాయి. కనుక అర్జునుని జయించాలంటే 'అమోఘమైన ఈ ఇంద్రదత్త 'శక్తి' ఉపయోగపడుతుంది తప్ప ఇక వేరే ఉపాయం లేదు అని బాగా ఆలోచించి, నిశ్చయించుకొని దేవేంద్రుడు రాకముందే శక్తిని తీసుకోవాలనే కోరికతో దేవేంద్రునికై ఎదురుచూస్తూ ఉన్నాడు కర్ణుడు. పైగా ఈ వస్తుమారకపు బేరంలో ఇంకొక లాభం కూడా ఉంది. తన కవచ కుండలాలు ఎదటి వానికి ఉపయోగపడవు. కాని తాను తీసుకొనే 'శక్తి' తనకు తప్పక ఉపయోగపడుతుంది. అందుకే ఎంతో శ్రమపడి, తన ప్రతిజ్ఞను గాలికి వదిలేస్శి, నియమాలను ఉల్లంఘించి, అబద్ధాలాడి, ముందు ఇవ్వనని చెప్పి, ఆ తరువాత బేరం పెట్టి, ముందుగా శక్తిని తీసుకొని, ఆ తర్వాతనే కవచ కుండలాలను కోసి ఇచ్చాడు. ఒకవేళ ముందుగా తాను కవచ కుండలాలను ఇస్తే ఇంద్రుడు మరికొన్ని షరతులు పెట్టి ఇస్తాననవచ్చు. లేదా అసలు ఇవ్వకుండానే అదృశ్యుడైపోవచ్చు. అందుకే ఈ మొత్తం 'డీల్'ను చాలా జాగ్రత్తగా నడిపాడు కర్ణుడు.

మరి 'శక్తి'ని ముందుగా అడిగిపుచ్చుకొని, ఆ తరువాతే కవచ కుండలాలను ఇవ్వటం దానమా? వస్తు మారక బేరమా? కర్ణుడు అసలు దాతయేనా? లేక మహా దాతా? బ్రాహ్మణులకు లేదనకుండా ఇస్తానని గదా కర్ణుని ప్రతిన. వచ్చినవాడు బ్రాహ్మణుడు కాదుగదా! ఇవ్వకుండా తిప్పి పంపవచ్చుగదా! మరెందుకు పంపలేదు? అలా పంపితే తనకు గొప్ప నష్టం. అర్జునుని వధించే గొప్ప అవకాశం చేజారిపోతుంది. అందుకే తన ప్రతిజ్ఞను అడ్డుపెట్టుకొని ఈ లాభాన్నిచ్చే బేరాన్ని కొనసాగించాడు.

మరి ఇంత చేసినా కర్ణునికి ప్రయోజనం కలిగిందా? లేదు. కర్ణుడు రెంటికి కాదు. ముమ్మాటికి చెడ్డాడు. 1. కవచ కుండలాలు పోయాయి. దానివల్ల మరణం ప్రాప్తించింది. 2. తీసుకున్న శక్తి నిరుపయోగం అయింది. ఘటోత్కచ వధకు ఉపయోగపడ్డదేగాని అర్జునుని వధించటానికి ఉపయోగపడలేదు. 3. పోనీ దాత అయ్యాడా? అంటే అదీ లేదు. కాని లోకులు మాత్రం 'దానకర్ణుడు' అని అంటున్నారు. ఎందుకిలా అంటున్నారు? లోకంలో ఎవరైనా ఒక రు.10 ల వస్తువును పుచ్చుకొని, ఒక రూపాయిని అతడికిచ్చి నేను రూపాయి దానం చేశాను' అని గొప్పలు చెప్పుకొనే వాణ్ణిచూచి 'వీడు గొప్ప దానకర్ణుడురా' అని ఎవరో ఎగతాళి చేసి ఉంటారు. ఎందుకంటే శక్తిని పుచ్చుకొని, కవచకుండలాలిచ్చి గొప్ప దానం చేసిన వాడిలాగా కర్ణుడు బడాయికి పోయాడు కనుక, గ్రంథ విషయం తెలియని అందరూ ఇది అర్థం చేసుకోలేక గొప్పదాత అనే ఉద్దేశంతోనే కర్ణుని దానకర్ణుడు అంటున్నారు. అయితే ఈ మొత్తం వ్యవహారంలో శరీరాన్ని కోసేటప్పుడు ఆ బాధను భరించటం నిస్సందేహంగా సాహసమే, సహనమే, శిబి చక్రవర్తి ఏ ప్రతిఫలం కోరకుండానే శరీరంలోని కండలు కోసి ఇచ్చాడు. కాని కర్ణుడు ప్రతిఫలం ముందుగా పుచ్చుకొనియే తన శరీరంనుండి కవచ కుండలాలు కోసి ఇచ్చాడు. అయినా కర్ణుని 'దానకర్ణుడు' అంటున్నారు. ఎందుకంటున్నారు? తెలియక అంటున్నారు. అయితే ఇక కర్ణుని పరాక్రమం...

(వచ్చే సంచికలో)

# మహాభారతం

## కర్ణుడు కర్ణుడు

**38**

రచన
మహాభారత పరిశోధకులు, అభినవ వ్యాస
జ్ఞానప్రపూర్ణ **శ్రీ దేవిశెట్టి చలపతిరావు** B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట
ఫోన్ : 08647-254716, సెల్ : 80085 39770
visit:www.srichalapathirao.com

(గత సంచిక తరువాయి)

**సూ**ర్యభగవానుని వల్ల కుంతీదేవికి కన్యావస్థలో జన్మించిన వాడు కర్ణుడు. అతడు సూర్యుని ప్రకాశంతో, అగ్నితేజస్సుతో, సహజ కవచ కుండలాలతో జన్మించాడు. **మహాపరాక్రమశాలి, బాహుబలం కలవాడు. అందులో ఏమాత్రం సందేహంలేదు. కొన్ని సందర్భాలలో భీష్మ ద్రోణుల లాగా, కృపాచార్య అశ్వత్థామలలాగ, సాత్యకి దృష్టద్యుమ్నుల లాగా అరివీరభయంకరంగా పోరాడిన వాడు.** ద్రోణాచార్యుని వద్ద, పరశురామునివద్ద అనేక దివ్యాస్త్రాలను సంపాదించినవాడు. ధనుర్విద్యలో గొప్ప అభ్యాసం చేసినవాడు. అందువల్ల కర్ణుని వంటి శౌర్యధనుడు, అస్త్రవేత్త, పరాక్రమశాలి. అజేయవీరుడు మహాభారతంలో మరొకడెవరూ లేడని లోకంలో అందరూ భావిస్తూవుంటారు. ఇదే విషయాన్ని సినిమాలు, టి.వి. సీరియల్స్ బాగా ఎక్కువ చేసి చూపించాయి, చూపిస్తున్నాయి. లోకంలో జనులకున్న ఈ భావానికి వ్యతిరేకంగా చెప్పి ఎందుకు జనాగ్రహానికి గురికావాలి? అని భావిస్తూ కొందరు కథకులు, పౌరాణికులు, రచయితలు కూడా తాన అంటే తందాన అని వంత పాడుతూ వుంటారు. అయితే మహాభారత గ్రంథంలో వ్యాసుడు అలాగే వ్రాయటం జరిగిందా? కర్ణుడు అర్జునునితో, భీమునితో సమానమైన వాడేనా? వారికన్నా ఇంకా ఎక్కువ పరాక్రమశాలియా? అతడు యుద్ధాలలో ప్రాణభయం లేకుండా, వెను దిరగకుండా పోరాడినవాడా? లేక అప్పుడప్పుడూ యుద్ధరంగం నుండి పారిపోయినవాడా? యుద్ధ ధర్మాన్ని అతిక్రమించనివాడా? సమయానుకూలంగా అధర్మానికి ఒడిగట్టినవాడా? **ఈ సందేహాలను తీర్చుకోవాలంటే కర్ణుని యుద్ధానికి సంబంధించిన సంఘటనలు మహాభారతంలో ఏమి ఉన్నాయో వాటిని తెలుసుకుంటూ విశ్లేషణ చేద్దాం.**

**1. గురుదక్షిణ కొరకై ద్రుపదునిపై దండెత్తి యుద్ధము చేయుట;**
(ఆది. ప. 137అ)

(విద్యాభ్యాసము పూర్తికావటంతోనే కర్ణుడు, కురుపాండవులు చేసిన మొదటియుద్ధం ఇదే) రాజకుమారులు అస్త్రవిద్యలో నైపుణ్యం సంపాదించారు. గురుదక్షిణ స్వీకరించటానికి సిద్ధమైన ద్రోణాచార్యుడు శిష్యులందరినీ పిలిచి, "పాంచాలరాజు ద్రుపదుని బంధించి నా వద్దకు తీసుకొనిరండి. ఇదే మీరు నాకు ఇవ్వవలసిన గురుదక్షిణ" అన్నాడు. "అలాగే, ఇప్పుడే ద్రుపదుని బంధించి తీసుకొని వస్తాం" అంటూ దుర్యోధనుడు, కర్ణుడు, యుయుత్సుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, జలసంధుడు, సులోచనుడు, శకుని ఇంకా అనేకమంది క్షత్రియవీరులు మేం ముందు యుద్ధం చేస్తామంటే, మేం ముందు చేస్తాం' అంటూ రథాలనెక్కి పాంచాలం వైపు పరుగులు తీశారు. ద్రుపదుడు ఇది తెలుసుకొని సోదరులతో కలసి యుద్ధసన్నద్ధుడై కురువీరులను ఎదిరించి భయంకరయుద్ధం కావించారు. (1-10శ్లో)

ద్రుపదుడు అన్ని వైపులనుండీ కౌరవులపైకి బాణాలవలను విసరి కౌరవసేనను మూర్ఛ పోగొట్టాడు. ఒంటరిగా రథంపై కూర్చొని వేగంగా పరాక్రమిస్తున్న ద్రుపదుని చూచి కౌరవులు తమపై అనేకమంది బాణవర్షం కురిపిస్తున్నట్లుగా భయపడిపోతున్నారు. ఆ సమయంలో పాంచాల ప్రజల ఇళ్ళలో వేలకొద్దీ శంఖాలు, భేరులు, మృదంగాలు మ్రోగాయి. పాంచాలసైనికుల ధనుష్టంకార ధ్వని, సింహనాదాల ధ్వని గగన తలాన్ని తాకుతున్నది. అప్పుడు దుర్యోధనుడు, వికర్ణుడు, సుబాహువు, దీర్ఘలోచనుడు, దుశ్శాసనుడు తీవ్ర క్రోధంతో శరవృష్టిని కురిపించారు. ద్రుపదుడు తీవ్రంగా గాయపడి కూడా కౌరవసేనలను తన తీవ్ర బాణాలతో పీడించాడు. మండుతున్న అలాతచక్రంలా తిరుగుతూ దుర్యోధనుని, వికర్ణుని, కర్ణుని, ఇతర రాజకుమారులను, అనేక సేనలను బాణాలతో తృప్తిపరుస్తున్నాడు. పరాక్రమశాలి ద్రుపదుడు దుశ్శాసనుని పది బాణాలతోను, వికర్ణుని ఇరవై బాణాలతోను, శకునిని ముప్పయ్ తీక్షణ శరాలతోను గాయపరిచాడు. యుద్ధంలో శతృభయంకరుడైన ద్రుపదుడు ఆ తరువాత కర్ణ దుర్యోధనుల అంగసంధులలో వేరువేరుగా ఇరవై ఎనిమిది చొప్పున తీవ్ర సాయకాలను ప్రయోగించి, తీవ్రంగా బాధించి వెంటనే సింహనాదం చేశాడు. ద్రుపదుడు ప్రయోగించిన బాణాలతో శరీరం ఛిన్నాభిన్నం **కావటంతో కర్ణుడు భయభీతుడై రథం దిగి పారిపోయాడు. ఇదిగో ఆ శ్లోకం....**

**శ్లో॥** పాంచాల శరభిన్నాంగో భయమాసాద్య వై వృషః
కర్ణో రథాదవ ప్లుత్య పలాయన పరో ఽ భవత్ ॥
(15-25శ్లో)

దానితో ఆర్తనాదాలు చేస్తూ కౌరవులు యుద్ధభూమినుండి పరుగులు తీశారు. వారి ఆర్తనాదాలను విని యుద్ధానికి బయలుదేరారు పాండవులు. యుధిష్ఠిరుని యుద్ధం చేయవద్దని చెప్పి అర్జునుడు నకుల సహదేవులను తన చక్రరక్షకులుగా చేసికొని బయలుదేరగా భీముడు గదను చేతబట్టి సేనకు ముందు నిలిచాడు. దండధరుడైన యమధర్మరాజులా గదాధారియై గజసమూహంపై విరుచుకుపడ్డాడు భీముడు. పర్వతాకారంతో ఉన్న ద్రుపదుని ఏనుగులు భీమసేనుని గదాఘాతాలకు తలలు పగిలి వజ్రపుదెబ్బకు నేలకూలిన పర్వతాలవలె భూమిపై పడిపోతున్నాయి. భీమసేనుడు ఏనుగులను, గుర్రాలను, రథాలను, పదాతులను చీల్చి చెండాడుతున్నాడు. (28-34శ్లో)

అర్జునుడు తీవ్ర శరవర్షాన్ని కురిపిస్తూ ద్రుపదుని మీదికి వెళ్ళాడు. అన్నిదిక్కులా అశ్వసమూహాలను, రథాలను, ఏనుగులను నేలగూలుస్తూ ప్రళయకాలాగ్నిలాగ ప్రజ్వరిల్లాడు. దెబ్బతిన్న పాంచాలురు, సృంజయులు అర్జునుని చుట్టుముట్టి శరవర్షం కురిపిస్తున్నారు. **అర్జునుడు బాణాలను సంధించటానికి, విడవడానికి మధ్య వ్యవధానమే లేకుండా పాంచాల సేనలను ఆక్రమించాడు.** తన సోదరుడైన సత్యజిత్తుతో కలసి అర్జునుని పైకి వచ్చాడు ద్రుపదుడు. మధ్యలోనే అడ్డుకున్నాడు అర్జునుడు. ద్రుపదునిపైకి వెళుతున్న అర్జునుని ఎదుర్కొన్నాడు సత్యజిత్తు. అర్జున సత్యజిత్తుల మధ్య భయంకరమైన యుద్ధం జరిగింది. అర్జునుడు మర్మభేదకములైన పదిబాణాలతో సత్యజిత్తును గాయపరిచాడు. సత్యవిక్రముడైన సత్యజిత్తు వంద బాణాలతో అర్జునుని బాధించాడు.

అర్జునుడు ఒకవైపున ద్రుపదుని శరవర్షం తనను కప్పుతున్నా నారి సారించి వేగంగా బాణాలను విడిచి సత్యజిత్తు ధనుస్సును ముక్కలు చేసి, ద్రుపదునిపైకి ఉరికాడు. సత్యజిత్తు తీవ్రవేగంతో మరొక ధనుస్సును చేతబట్టి అర్జునుని, అతడి గుర్రాలను, సారథిని గాయపరిచాడు. అది సహించక అర్జునుడు తీవ్రబాణాలతో సత్యజిత్తు గుర్రాలను, సారథిని, పిడికిలిని గాయపరచి, ధ్వజాన్ని పడగొట్టి, ధనుస్సును ముక్కలు చేశాడు. మరల ధనుస్సులను చేతబట్టగా వాటిని కూడా ధ్వంసం చేసి సింహనాదం చేశాడు అర్జునుడు. దానితో సత్యజిత్తు రణరంగం నుండి పారిపోయాడు. అది గమనించి ద్రుపదుడు వేగంతో అర్జునునిపై బాణవర్షం కురిపించాడు.

**అర్జునుడు ద్రుపదుని ధనుస్సును ఖండించి, ధ్వజాన్ని నేలగూల్చి ఐదు బాణాలతో సారథినీ గుర్రాలను నొప్పించాడు. ద్రుపదుడు మరొక ధనుస్సును చేతబట్టేలోగా అర్జునుడు ఖడ్గాన్ని చేతబట్టి, పాంచాలరాజు రథంపైకి దూకాడు. సింహనాదం చేస్తూ గరుత్మంతుడు పామును పట్టుకొన్నట్లు ద్రుపదుని పట్టుకొని లోబరచుకున్నాడు.** దానితో పాంచాల సైనికులు భయభీతులై పదిదిక్కులకూ పారిపోసాగారు. భీముడు సేనలను చీల్చి చెండాడుతుండగా అర్జునుడు, "అన్నా! ద్రుపదుడు కురువీరులకు బంధువు, ఆయన సేనను సంహరించవద్దు, మనం గురుదక్షిణగా ద్రుపదుని మాత్రమే ఆచార్యునకు సమర్పించాలి" అనటంతో భీముడు వెనుదిరిగాడు. (28-61శ్లో) ఇదీ గురుదక్షిణ గాథ.

**విశ్లేషణ :- అర్జునుడు కృపాచార్య, ద్రోణాచార్యుల వద్ద అస్త్ర విద్యాభ్యాసం చేశాడు. కర్ణుడు ఆ ఇద్దరివద్దనే గాక పరశురాముని వద్దకూడా బ్రహ్మాస్త్రంతో సహా అనేక అస్త్రాలను పొందాడు. అంతే గాక అమృతమయమైన కవచకుండలాలు కర్ణునికి ప్రాణరక్షణగా ఉన్నాయి. అర్జునునికి అలాంటివేమీ లేవు. దుర్యోధన, దుశ్శాసన, శకునిలతో బాటుగా దుర్యోధనుని సోదరులంతా అండగా ఉన్నారు కర్ణునికి. అర్జునునికి భీమ, నకుల, సహదేవులు ముగ్గురే తోడున్నారు. అయినప్పటికీ ద్రుపదుడు కర్ణుని అంగ సంధులలో తాడనం చేయటంతో భయపడి యుద్ధరంగం నుండి పారిపోయాడు కర్ణుడు. ఈ కర్ణుని పారద్రోలిన ద్రుపదుని బంధించి తెచ్చి ద్రోణునికి గురుదక్షిణగా సమర్పించాడు అర్జునుడు. ఇక్కడ అర్జునునికి శ్రీకృష్ణుడు తోడు లేడు. కర్ణునికి కవచకుండలాలు పోలేదు. ఐనా ప్రాణభయంతో పారిపోవటం ఎందుకో పాఠకులు ఆలోచించాలి. దీనిని బట్టి కర్ణుడు అర్జునునితో సమానమా? అర్జునుని కన్న గొప్ప పరాక్రమశాలియా? అర్జునుని కన్న తక్కువ పరాక్రమశాలియా? తేలిపోయింది.** కర్ణునికి, అర్జునునికి మధ్య పరోక్షంగా జరిగిన పోటీ ఇది. ఇక ప్రత్యక్షంగా జరిగిన పోరును పరిశీలిద్దాం. అది ద్రౌపదీ స్వయం వర సమయంలోనిది.

**2. ద్రౌపదీ స్వయంవర సమయంలో కర్ణార్జునుల మధ్య జరిగిన యుద్ధం : (ఆది.ప. 189 అ).**

ద్రౌపదీ స్వయంవరానికి విచ్చేసిన రాజులంతా లక్ష్యాన్ని ఛేదించటంలో విఫలమయ్యారు. అప్పుడు బ్రాహ్మణ సమూహం మధ్యనుండి అర్జునుడు లేచివచ్చి లక్ష్యాన్ని ఛేదించాడు. ఆకాశం నుండి పుష్పవృష్టి కురిసింది. బ్రాహ్మణులు అర్జునుని ఆశీర్వదించి ప్రశంసించారు. (187అ)

### వివేకామృతం



పాశ్చాత్య నాగరికత తళకుబెళుకులతో కూడి వున్నప్పటికీ, ఆశ్చర్యకరమైన భౌతిక శక్తులను అది దిగ్దర్శనం చేసినప్పటికీ, అది అంతా నిరుపయోగమని ఈ ఉపన్యాస వేదికపై నిలబడి వారి ఎదుటనే చెబుతున్నాను. అది శుష్క దండగ. దైవమొక్కటే సత్యం. ఆత్మ ఒక్కటే సత్యం. పరమార్థమొక్కటే సత్యం. దానినే పట్టుకొనండి.

**సూక్తి** | నీ విజయాన్ని ఆశించినట్లు ఇతరుల విజయాన్నీ ఆకాంక్షించు

## సైన్స్ భూమి వేడెక్కితే ప్రమాదమా?

భూమి వేడెక్కకుండా పెరిగే వేడిని తగ్గించేందుకు శాస్త్రజ్ఞులు చేయని ప్రయత్నం లేదు.

ఇటీవల శాస్త్రజ్ఞులు జియో ఇంజనీరింగ్ ప్రాజెక్టులను అమలులోకి తెచ్చారు. అందులో భాగంగా అంతరిక్షంలో పెద్ద ఎత్తున సన్‌షేడ్స్‌ని లేదా అద్దాలను నెలకొల్పడం, సూర్య రశ్మిని తిరిగి అంతరిరక్షంలోకి పరావర్తనం చెందే ప్రయత్నం చేస్తున్నారు. వారి ప్రయత్నం విజయవంతమై భూమితల్లికి మేలు జరగాలని కోరుకుందాం.

స్వయంవరానికి వచ్చిన తమను కాదని ఒక బ్రాహ్మణునకు కన్యను కట్టబెట్టడం రాజులకు మింగుడు పడలేదు. దానితో రాజులందరూ ద్రుపదుని సంహరించటానికి సాయుధులై బయలు దేరారు. ద్రుపదుడు బ్రాహ్మణుల శరణుజొచ్చాడు. దానితో భీమార్జునులు ఆ రాజులను ఎదిరించి నిలిచారు. కవచాలు, శిరస్త్రాణాలు ధరించిన రాజులు కోపంతో ఆయుధాలెత్తిపట్టి భీమార్జునులపై దండెత్తారు. భీముడు దండధారియైన యమునిలాగా ఒక చెట్టును పెకలించి అర్జునుని ప్రక్కన నిలబడ్డాడు. అర్జునుడు ధనుస్సును చేతబట్టి యుద్ధసన్నద్ధుడయ్యాడు. (188 అ).

బ్రాహ్మణులు తమ కృష్ణాజినాలు, కమండలాలు విసురుతూ "మేము వీరితో యుద్ధం చేస్తాం. మీరు భయపడకండి" అంటూ ముందుకు వచ్చారు. అర్జునుడు నవ్వుతూ, "ఓ బ్రాహ్మణోత్తములారా! మీరు ప్రేక్షకులవలె అలా చూస్తూ నిలబడండి. వందలకొద్దీ వాడియైన బాణాలతో వీరిని నిలువరిస్తాను" అంటూ ధనుస్సును వంచి, అల్లెత్రాటిని బిగించి, భీమునితో కూడి చలించని పర్వతంలా నిలిచాడు. ఏనుగులు ఏనుగులపై పడ్డట్టు భీమార్జునులు కర్ణాది వీరులపై పడ్డారు. **అంతట మహాతేజస్వి కర్ణుడు అర్జునునితో తలపడ్డాడు.** మద్రరాజు శల్యుడు భీముని ఎదిరించాడు. దుర్యోధనాది రాజులంతా బ్రాహ్మణులతో అప్రయత్నంగాను, మృదువుగాను యుద్ధం చేస్తున్నారు. అర్జునుడు తన ధనుస్సును వంచి, తనవైపుకు వేగంగా వస్తున్న కర్ణుని తీక్షణమైన బాణాలను తన వాడిబాణాలతో ముక్కలు చేస్తున్నాడు. **అర్జునుని వాడి బాణాల ఆ ఘాతానికి కర్ణుడు మూర్ఛితుడై, తిరిగి తెప్పరిల్లుకొని అతికష్టంమీద అర్జునునితో యుద్ధం చేస్తున్నాడు. వారిద్దరూ ఎంతో నేర్పుతో, ఒకరినొకరు జయించాలనే క్రోధంతో తీవ్రంగా పోరాడుతున్నారు. వారిద్దరిలో ఎవరు ఎక్కువో, ఎవరు తక్కువో చెప్పటం కష్టంగా ఉంది.** "ఇదిగో నీ అస్త్రానికి ప్రతిగా నేనీ అస్త్రాన్ని ప్రయోగించబోతున్నాను." అని, "ఇదిగో నా భుజబలం ఏపాటిదో చూడు" అనీ, "నీ అస్త్రాన్ని ఇప్పుడే ధ్వసం చేస్తున్నాను" అంటూ వీరోక్తులు పలుకుతూ వారు తీవ్రమైన యుద్ధం చేస్తున్నారు.

(అది.ప.189 అ.1-13శ్లో)

*శ్లో॥ తతో ౽ ర్జునస్య భుజయోః వీర్యమప్రతిమం భువి।*
*జ్ఞాత్వా వైకర్త నః కర్ణః సంరద్ధః సమయోధయత్॥*
*(189 అ.14 శ్లో)*

**తా॥** అర్జునుని భుజబల పరాక్రమాలు ఈ భూమిపై సాటి లేనివని గ్రహించిన కర్ణుడు మరింత క్రోధంతో యుద్ధం చేస్తున్నాడు. (14శ్లో).

ఆ సమయంలో అర్జునుడు ప్రయోగించిన వేగవంతమైన బాణాలన్నింటినీ కర్ణుడు ఖండించి బిగ్గరగా సింహనాదం చేశాడు. అది విని సైనికులందరూ కర్ణుని ప్రశంసించారు. **వారిరువురి మధ్య అలా తీవ్రయుద్ధం సాగుతుండగా కర్ణుడు అర్జునునితో, విప్రోత్తమా! యుద్ధంలో నీ భుజబల పరాక్రమానికి సంతోషిస్తున్నాను. నీలో ఏమాత్రం భయ, విషాద చిహ్నాలు కనిపించటంలేదు. నీ అస్త్రశస్త్రాలతో నీవు విజయం పొందుతున్నందుకు ఆనందంగా ఉన్నది.** (15-16శ్లో)

*శ్లో॥ కిం త్వం సాక్షాత్ ధనుర్వేదో రామో వా విప్రసత్తమ ।*
*అథ సాక్షాద్ధరిహయః సాక్షాద్వా విష్ణురచ్యుతః॥*
(ఆది ప.189 అ.17 శ్లో)

**తా॥ విప్రోత్తమా! నీవు సాక్షాత్తు ధనుర్వేదానివా? లేక పరశురామునివా? లేక సాక్షాత్తు దేవేంద్రుడివా? లేక సాక్షాత్తు నాశనం లేని విష్ణుమూర్తివా? నీవు వీరిలో ఎవరో ఒకరివై ఉండాలి. నిన్ను నీవు దాచుకొనుటకు బ్రాహ్మణరూపం ధరించి బాహుబల పరాక్రమంతో నాతో యుద్ధం చేస్తున్నావనుకుంటున్నాను. ఎందుకంటే తీవ్రక్రోధంతో యుద్ధరంగంలో నిలిచిన నన్ను ఎదిరించాలంటే సాక్షాత్తు ఇంద్రునికో లేదా పాండవ మధ్యముడైన అర్జునునికో తప్ప మరొకరెవ్వరికీ సాధ్యం కాదు. అన్నాడు కర్ణుడు.**

కర్ణుడలా అనటంతో అర్జునుడు "కర్ణా! నేను ధనుర్వేదాన్ని కాదు, పరశురాముడనూ కాను. శస్త్రధారులలో శ్రేష్ఠుడను ఉత్తమ యోధుడను ఐన బ్రాహ్మణుడను. నిష్ఠగా గురూపదేశంతో బ్రహ్మాస్త్రాన్ని, ఐంద్రాస్త్రాన్ని పొందాను. (18-21శ్లో).

*శ్లో॥ స్థితో ౽ స్మ్య ద్యరణే జేతుం త్వాం వై వీర స్థిరోభవ॥*
*వైశంపాయన ఉవాచ:*
*ఏవముక్తస్తు రాధేయో యుద్ధాత్ కర్ణో న్యవర్తత ॥* (22 శ్లో)
*శ్లో॥ బ్రాహ్మం తేజస్తదాజయం మన్య మానో మహారథః।*
*అపరాస్మిన్ వనోద్దేశే వీరౌ శల్య వృకోదరౌః ॥* (23 శ్లో)

**తా॥ "కర్ణా! నీతో యుద్ధంచేసి నిన్ను జయించటానికి నిలిచియున్నాను. నీవు కూడా స్థిరంగా నిలిచి యుద్ధం చెయ్యి" అన్నాడు అర్జునుడు. అర్జునుని ఈ మాటలు విని కర్ణుడు "బ్రాహ్మణతేజం అజేయమైనదని" పలికి యుద్ధభూమిని విడిచి పలాయనం సాగించాడు.** మరొకచోట వీరులైన శల్యభీమసేనులు తలపడ్డారు. - **ఇదీ కర్ణార్జునుల మధ్య మొదటిసారిగా జరిగిన ప్రత్యక్షయుద్ధం.**

**విశ్లేషణ :- ఇప్పుడు కూడా కర్ణునికి అమృతమయమైన సహజ**

సూక్తి: గొప్పతనం ఎప్పుడూ నిరాడంబరంగానే వుంటుంది.

## రచయితలకు సూచనలు

ధ్యానమాలికకు రచనలు పంపేవారు తమ రచనలను పేపరుపై ఒక పక్క మాత్రమే రాయాలి. అక్షరాలు స్పష్టంగా రాయాలి. పేజీకి పదిహేను లేదా ఇరవై లైన్లకు మించి రాయకూడదు. వీలుంటే డి.టి.పి చేసి పంపినా ఫర్వాలేదు. ప్రతి రచనతోపాటు హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ప్రాచుర్యం పొందిన గ్రంథాల నుండి సేకరించిన రచనలైతే తప్పనిసరిగా ఆ గ్రంథం యొక్క పేరును రచన చివరలో పేర్కొనాలి. మీ చిరునామా, ఫోన్ నెంబరు స్పష్టంగా రాయాలి.

రచనలు పంపాల్సిన చిరునామా :

ఎడిటర్, ధ్యానమాలిక, 29-28-23, విక్రాంత్ బిల్డింగ్స్, దాసరివారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2.

కవచ కుండలాలు ఉన్నాయి. కనుక ప్రాణం పోతుందనే భయం లేదు. దుర్యోధనాదులతో సహా స్వయంవరానికి విచ్చేసిన అనేక మంది రాజులు తోడున్నారు. ఇక అర్జునునికి సైన్యంలేదు. తోడుగా ధర్మజ నకుల సహదేవులు కూడా లేరు. వారు ముందే వెళ్ళి పోయారు. ఉన్నది కేవలం భీమసేనుడొక్కడే.

ఇక శ్రీకృష్ణుని సాయం అసలే లేదు. ప్రాణభయం కలిగించని కవచ కుండలాలూ లేవు. అయినప్పటికీ కర్ణుడు అర్జునునితో యుద్ధం చేసి అతడిని జయించలేక యుద్ధరంగం నుండి వెనుదిరిగి పారిపోయాడు.

ఇంతకుముందు గురుదక్షిణ సమయంలో ద్రుపదునితో యుద్ధం చేసి, ఆ ద్రుపదుడు అంగసంధులలో తాడనం చేయటంతో భయపడి పారిపోయాడు కర్ణుడు. ఆ ద్రుపదుని ఓడించి, బంధించి, ద్రోణాచార్యునికి గురుదక్షిణగా సమర్పించాడు అర్జునుడు. ఇప్పుడు ప్రత్యక్షంగా అర్జునునితో యుద్ధం చేసి, 'బ్రాహ్మణతేజం అజేయ మ'ని పల్కి యుద్ధరంగం నుండి పారిపోయాడు కర్ణుడు. అంటే కర్ణుడు అర్జునుని చేతిలో ఓడిన వాని చేతిలో ఓడి పారిపోయాడు. ప్రత్యక్షంగా అర్జునుని చేతిలో ఓడి పారిపోయాడు.

మరి ఎప్పుడైనా, ఎక్కడైనా కర్ణుడు అర్జునుని ప్రత్యక్షంగా ఓడించాడా? లేక అర్జునుని ఓడించినవారినెవరినైనా ఓడించాడా? మహాభారతంలో ఎవరైనా చూపగలరా? అలాంటి సందర్భం ఏ ఒక్కటైనా ఉంటే చాలు కర్ణుడు అర్జునునితో సమానమైన పరాక్రమం గలవాడని గాని, అర్జునుని కన్న గొప్ప పరాక్రమశాలియని గాని అంగీకరించవచ్చు.

-ఇక కర్ణార్జునుల బలపరాక్రమాలేపాటివో తెలియజేసే మరొక పరోక్షయుద్ధాన్ని గురించి-ఘోషయాత్రా సందర్భంగా జరిగిన యుద్ధాన్ని గురించి తెలుసుకుందాం.

**3. ఘోషయాత్రా సందర్భంగా గంధర్వులతో జరిగిన యుద్ధ విశేషాలు.**

ద్వైతవనంలో నివసిస్తున్న పాండవులను పరామర్శించిన ఒక విప్రుడు ధృతరాష్ట్రుని వద్దకు వచ్చాడు. మాటల మధ్య పాండవుల ప్రసక్తి రాగా ధృతరాష్ట్రుని కోరికపై ఆ విప్రుడు పాండవులు అరణ్యాలలో పడుతున్న బాధలను గురించి తెలియజేశాడు. అది విని ధృతరాష్ట్రుడు ఎంతో బాధ నటించాడు. ఈ విషయం తెలిసిన శకుని రహస్యంగా కర్ణదుర్యోధనుల వద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పగా దుర్యోధనుడు అసంతృప్తికి గురయ్యాడు. (వనపర్వం 236 అ) ఇది గమనించిన కర్ణుడు దుర్యోధనునితో "మహారాజా! ఉత్కృష్టమైన రాజ్యలక్ష్మిచే సుశోభితుడవైన నీవు ఇప్పుడు రాజ్య విహీనులైన పాండవులకు సంతాపం కలిగించాలి. సంపద్విహీనులు, నిర్ధనులు ఐన పాండవులను సంపదలతో తులతూగుతూ సమృద్ధ శాలివైన నీవు చూడాలి. పర్వతముపైనున్నవారు నేలమీద ఉన్నవానిని చూచినట్లు, సంతోషంతో ఉన్న నీవు కష్టాలతో దీన స్థితిలో ఉన్న శత్రువులను కన్నులారా దర్శించటం కన్న పరమానందం ఇంకేముంటుంది? శత్రువులయొక్క దీనస్థితిని చూడటం వల్ల కలిగే ఆనందం పుత్రలాభం వల్లగాని, ధనలాభం వల్లగాని, రాజ్యలాభం వల్లగాని కలగదు. సంపదలచే వంచితులైన పాండవులు తమ నిరర్థకమైన జన్మలను తలచుకొని దుఃఖసాగరంలో మునిగిపోవాలి" అని దుర్యోధనుని రెచ్చగొట్టాడు.

(వనపర్వం 237. అ)

కర్ణుని మాటలు విని ముందు ప్రసన్నుడై ఆ తరువాత దీనుడై, దుర్యోధనుడు ఇలా అంటున్నాడు...."కర్ణా! నీవు అన్నదంతా నా మనస్సులో ఉన్నదే. కాని పాండవులున్న చోటుకు వెళ్ళాలంటే నా తండ్రి అనుమతి కావాలిగదా! ఆయనకు పాండవులపై జాలి. వారంటే భయం. నీవు శకుని, దుశ్శాసనులతో కలసి అరణ్యానికి వెళ్ళే ఉపాయం ఆలోచించు" అనగా మరునాడు కర్ణుడు దుర్యోధనుని వద్దకు వచ్చి, "రాజా! ఘోషయాత్ర అనే నెపంతో మనం అక్కడకు వెళదాం. దీనికి నీ తండ్రి తప్పక అనుమతిస్తాడు.." అన్నాడు.

అంత శకుని కూడా ఇదే సరైన ఉపాయం అన్నాడు. (వ.ప. 238 .అ).

అంతట కర్ణ శకుని దుశ్శాసనులతో కలసి దుర్యోధనుడు

సూక్తి: నీ ప్రతిభ, నైపుణ్యం చెడుకు ఉపయోగిస్తే నష్టపోయేది నీవే.

## చందాదారులకు విజ్ఞప్తి

చందాదారులు తమ చిరునామా మారితే, మారిన చిరునామాను 15వ తేదీలోగా మాకు తెలియజేస్తే, ఆ తదుపరి నెల ధ్యానమాలికను మీ కొత్త చిరునామాకు పంపించబడుతుంది.

ధ్యానమాలిక చందాను పునరుద్ధరించుకోవాలనుకుంటే 20వ తేదీలోగా మనియార్డరు పంపాలి. మనియార్డరు పత్రంపై చిరునామా స్పష్టంగా రాసి, మీ ఫోన్ నెంబరు కూడా తప్పునిసరిగా రాయాలి.

ధ్యానమాలిక సంచిక ప్రతి నెల మొదటి తారీఖు లోనే మీకు పంపడం జరుగుతుంది. అది మీకు 20వ తేదీ వరకూ అందకపోతే 25వ తేదీన ధ్యానమాలిక కార్యాలయానికి తెలియజేస్తే ఆ తదుపరి నెల సంచికతో పాటు మీకు అందని కాపీని కూడా కలిపి పంపిస్తాం.

–సంపాదకుడు

సమంగుడనే ఒక గొల్లవానిని ఏర్పాటుచేసుకొని, అతడిచేత గోవుల రక్షణకు ఎవరినైనా పంపమని చెప్పించి, "మహారాజా మేము ఘోషయాత్రకు వెళ్ళటానికి అనుమతించండి" అని ప్రార్థించాడు. ముందు అంగీకరించక పోయినా శకుని నచ్చచెప్పటంతో అంగీకరించాడు ధృతరాష్ట్రుడు. దానితో చతురంగబలాలతో, అంతఃపుర స్త్రీలతో కలసి బయలుదేరి ద్వైతవనం చేరి గుడారాలు వేయించాడు దుర్యోధనుడు. (వన పర్వం. 239. అ)

ఆ ద్వైతవనంలోని సరస్సు సమీపంలో ధర్మరాజు ద్రౌపదితో కలసి సాంద్యస్కం (ఒక్కరోజులో పూర్తి అయ్యే) రాజర్షి యజ్ఞాన్ని చేస్తున్నాడు. ఆ సరస్సు సమీపంలోనే క్రీడా మండపాలు నిర్మించమని దుర్యోధనుడు సేనాపతిని ఆజ్ఞాపించాడు. అప్పటికే కుబేర వనంనుండి గంధర్వరాజు తన సేవకులతో అక్కడికి వచ్చి అప్సరసలతో, దేవకుమారులతో ఆ సరస్సుచుట్టూ క్రీడావిహారం చేస్తున్నాడు. అది చూచి దుర్యోధనుని సేనలు వెనుదిరిగి వెళ్ళి చెప్పగా, 'వారిని అక్కడినుండి పారద్రోలండి' అని యుద్ధవీరులైన వారిని పంపించాడు.

గంధర్వులు వారిని హెచ్చరించి పంపారు.
(వనపర్వం 240 అ).

దుర్యోధనుడు కోపంతో సైన్యాన్ని ఆదేశించాడు. "మీరు వెళ్ళి ఆ అధర్మపరుల్ని శిక్షించండి" అని. సైనికులు గంధర్వులను ఎదిరించి ద్వైతవనంలో ప్రవేశిచారు. గంధర్వులు వారిస్తున్నా వినకుండా కురుసైనికులు గంధర్వులపై దాడిచేశారు. గంధర్వులు వారి నాయకుడు చిత్రసేనునితో చెప్పగా "ఆ దుర్మార్గులను శిక్షించండి" అని ఆదేశించాడు. దానితో భయంకరయుద్ధం ప్రారంభమైంది. గంధర్వులు ఆయుధాలు చేత ధరించి కురుసేనలపై దాడి చేయటంతో కౌరవసేనలు అన్ని దిక్కులకు పరుగెత్తారు.

ఆ సమయంలో వీరుడైన కర్ణుడు వెనుదిరగకుండా గంధర్వులపై బాణవర్షం కురిపించాడు. గంధర్వ సేనను ఛిన్నాభిన్నం చేస్తూ కర్ణుడు వీరవిహారం చేస్తుంటే, వందల, వేలకొద్దీ గంధర్వులు కర్ణునెదిరించి చుట్టుముట్టారు. దుర్యోధనాదులు కర్ణునికి సహాయంగా వచ్చి నిలిచారు. గంధర్వులంతా ఒక్కటిగా ఎత్తివచ్చి కౌరవులపై బడ్డారు. భయంకరమైన యుద్ధం సాగిపోతున్నది. గంధర్వ సేనలు డీలాపడడంతో చిత్రసేనుడు యుద్ధరంగంలో ప్రవేశించి మాయాస్త్రాన్ని ప్రయోగించటంతో కౌరవులంతా మూర్ఛిల్లారు. చిత్రసేనుని మహాసైన్యం ముందు నిలువలేక కురుసేనలు యుద్ధభయంతో పరుగులు తీశాయి. అయినా కర్ణుడు చలించని పర్వతంలా నిలిచాడు.

యుద్ధంలో గాయపడినప్పటికీ దుర్యోధన శకుని దుశ్శాసనులు కూడా గంధర్వులతో పోరాడుతూనే ఉన్నారు. గంధర్వులంతా కర్ణుని వధించాలనే వ్యూహంతో గుంపులుగా విడిపోయి కత్తులతో, పట్టిశాలతో, శూలాలతో, గదలతో, కర్ణుని చుట్టుముట్టి మోదసాగారు. ఒకడు రథాంగాన్ని ఖండించగా, మరొకడు ధ్వజాన్ని కూల్చేశాడు. కొందరు నొగలు విరగ్గొట్టగా కొందరు గుర్రాలను వధించారు. ఒకడు సారథిని చంపివేయగా, మిగిలిన వారు రథాన్ని నుగ్గు నుగ్గు చేశారు. అప్పుడు కర్ణుడు కత్తిని, డాలును చేతపట్టి తన రథం నుండి దూకి వికర్ణుని రథాన్నెక్కి ప్రాణరక్షణ కొరకు పలాయనం చిత్తగించాడు. (వన పర్వం 241 అ.)

ఇదుగో ఆ శ్లోకం....

*శ్లో॥ తతో రథా దవప్లుత్య సూతపుత్రో ఽ సి చర్మ భృత్*
*వికర్ణ రథమాస్థాయ మోక్షాయా శ్వాన చోదయత్॥*
(వన ప. 241 అ. 32 శ్లో)

గంధర్వుల ధాటికి తాళలేక కర్ణుడు పారిపోవటంతో దుర్యోధనుడు చూస్తుండగానే సైన్యమంతా పారిపోయింది. దుర్యోధనుడు మాత్రం వెనుదిరగకుండా గంధర్వులపై బాణవర్షం కురిపించాడు. గంధర్వులు దుర్యోధనుని చుట్టుముట్టి ధ్వజాన్ని, సారథిని, గుర్రాలను, తల్పాన్నీ, కవచాన్నీ నుగ్గు నుగ్గు చేసి బంధించారు. ఆ తరువాత దుశ్శాసనుని, ఇతర సోదరులను, స్త్రీలను, బంధించి ఆకాశమార్గంలో తీసుకొనిపోయారు. (వన పర్వం 242. అ).

కౌరవసేనలు చెల్లాచెదరైపోగా దుర్యోధనుని వృద్ధమంత్రులు ధర్మరాజు వద్దకెళ్ళి చెప్పగా ధర్మరాజు ఆదేశంతో భీమార్జునులు గంధర్వులనెదిరించారు. ముందు మృదుయుద్ధం చేశారు. గంధర్వులు లొంగిరాకపోవటంతో అర్జునుడు వాడియైన బాణాలను ప్రయోగించగా అప్పుడు పాండవులకు గంధర్వులకు మధ్య భీకర

యుద్ధం జరిగింది. పాండవులు నలుగురే. గంధర్వులు వేలకు వేలుగా ఉన్నారు. కర్ణ దుర్యోధనాదుల రథాలను ముక్కలు చేసినట్లు పాండవుల రథాలను కూడా ముక్కలు చేయబూనారు.

అర్జునుడు దివ్యాస్త్రాలను ప్రయోగించాడు. గంధర్వులు విజృంభించి, వీరవిహారం చేస్తుంటే, అర్జునుడు ఆగ్నేయాస్త్రంతో లక్షమంది గంధర్వులను యమలోకానికి పంపించాడు. భీమ, నకుల సహదేవులు వేలకొలది గంధర్వులను హతమార్చారు. దానితో గంధర్వులు కౌరవులను స్త్రీలతో సహా తీసుకొని ఆకాశానికి ఎగిరిపోయారు. అర్జునుడు నలువైపుల శరసమూహంతో కదల కుండా చేశాడు. గగనంలో నిలిచిన గంధర్వులు నేలపైనున్న భీమార్జున, నకుల సహదేవులపై గదలను, శక్తులను, ఋష్టులను కురిపించారు. చిత్రసేనుడు గదను ధరించి అర్జునునిపైకి ఉరికాడు.

అర్జునుడు ఆ గదను 7 ముక్కలు చేశాడు. ఆ తరువాత ఇరువురూ దివ్యాస్త్రాలతో భీకరయుద్ధం చేశారు. చిత్రసేనుడు అదృశ్యుడై మాయాయుద్ధం సాగించగా అర్జునుడు శబ్దవేధి విద్యతో చిత్రసేనునెదుర్కొన్నాడు. అర్జునుని ధాటికి నిలువలేక చిత్రసేనుడు నిజరూపంతో అర్జునుని ఎదుట నిలిచి "అర్జునా! నేను నీ మిత్రుదను, మిమ్ము అవమానించాలని వచ్చినవాడు దుర్యోధనుడు. ఇది తెలిసిన ఇంద్రుడు 'కౌరవాధములను బంధించి నా వద్దకు తీసుకు రమ్మని' ఆదేశించటంతో ఇక్కడకు వచ్చాను." అని చెప్పటంతో అందరూ ధర్మరాజు వద్దకు వెళ్ళారు. (వనపర్వం 243-246 అ)

ఇదీ వనపర్వంలోని 236వ అధ్యాయం నుండి 246వ అధ్యాయం వరకు గల ఘోషయాత్రా గాథ సంక్షిప్తంగా.

విశ్లేషణ :- ఇప్పుడు కూడా కర్ణునికి కవచకుండలాలున్నాయి. ప్రాణభయం అసలే లేదు. పైగా ద్రోణాచార్యుని వద్ద, పరశు రాముని వద్ద అనేక దివ్యాస్త్రాలను పొందాడు. మరణసమయంలోనే బ్రహ్మాస్త్రం స్ఫురించదుగాని ఇతర సమయాలలో స్ఫురిస్తుంది కనుక శాపభయం కూడా లేదు. తోడుగా దుర్యోధనాది ధార్తరాష్ట్రులు, శకుని, చతురంగబలాలతో కూడిన అపార సేనావాహిని ఉంది. మరి అర్జునునికో! సహజ కవచ కుండలాలు లేవు. తోడుగా సైన్యం అసలే లేదు. కేవలం భీమ నకుల సహదేవులు ముగ్గురు మాత్రమే తోడున్నారు. శ్రీకృష్ణుని సాయం కూడాలేదు. అయినప్ప టికీ కర్ణుడు రథం భగ్నం కావటంతో వికర్ణుని రథమెక్కి యుద్ధ భూమినుండి వెనుదిరిగి చూడకుండా పారిపోయాడు. ఎంతదూరం పారిపోయాడంటే ఇక ఇక్కడ ఏమి జరిగింది? ఎవరు యుద్ధంలో గెలిచారు? దుర్యోధనాదుల గతి ఏమైంది? అనే విషయం ఏ మాత్రం తెలియనంత దూరం పారిపోయాడు. అర్జునుడు మాత్రం గంధర్వుల అపార సేనతో సహా చిత్రసేనుని చక్రబంధంలో ఇరికిం చాడు. ఇదీ కర్ణార్జునుల మధ్యగల తేడా. ఇక మరో ప్రత్యక్షయుద్ధం ఉత్తర గోగ్రహణం.

(వచ్చే సంచికలో)

# క్యాన్సర్ కారకం ప్లాస్టిక్ వాడకం

ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళలో లభించే మంచినీటి వాడకం నేడు విపరీతంగా పెరిగిపోయింది. ఇలాంటి నీటివల్ల ఎవ రికీ ఎలాంటి నష్టం లేనప్పటికీ మనం వాడి, పారేసే ఖాళీ బాటిళ్ళ వల్ల పర్యావరణానికి మాటల్లో చెప్పలేనంత నష్టం కలుగుతోంది. చెత్తకుండీల్లో, మురికి కాలువల్లో, రోడ్లపక్కన, రైలు పట్టాల పక్కన, పార్కుల్లో, చెరువుల్లో, నదుల్లో కోట్లాది ఖాళీ వాటర్ బాటిళ్లు పడి వుంటున్నాయి. ఇవి నేలను, నీటిని కలుషితం చేస్తున్నాయి. దోమలకు, ఈగలకు, అనేక రకాల వ్యాధి క్రిములకు ఆశ్రయమిస్తూ, రోగాలను వ్యాపింప చేసేందుకు కారణాలవుతున్నాయి. నీటిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిళ్ళ వలన జలచరాల శరీరాలు విషపూరితం అవుతున్నాయి. ఇలాంటి నష్టాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఆస్ట్రేలియాలోని బండనూన్ అనే చిన్నపట్టణంలోని ప్రజలు వాటర్ బాటిళ్ల విక్రయాలను నిషేధించారు. ఇలాంటి నిర్ణ యాలు ప్రపంచంలోని అందరికీ స్ఫూర్తినిస్తాయి

నేడు మానవ సమాజం వాడుతున్న అనేక రకాల ప్లాస్టిక్ వస్తువులలో 'పాలీబ్రోమినేటెడ్ డిఫినిల్ ఈదర్స్' అనే రసాయనాలు వుంటున్నాయి. వాటిని కుప్తంగా పిబిడి యిలు అని అంటారు. టీవీలు, కంప్యూటర్లు వంటి పలు ఎలక్ట్రానిక్ సాధనాలలో కూడా పిబిడియిలు కలిగి వుండే ప్లాస్టిక్‌లు వాడుతున్నారు. గతంలో ఎలుకలు, పందికొక్కులు వంటి కొన్ని జంతువులపై జరిపిన పరిశోధనల్లో పిబిడియిల వల్ల జ్ఞాపకశక్తి, సంతాన సామర్థ్యం క్షీణించడం, థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పనిచేయకపోవడం వంటివి జరుగుతాయని స్పష్టమయింది. పిబిడియిల వల్ల మనుషుల్లో క్యాన్సర్ వచ్చే అవకాశం వుందని కూడా మరికొన్ని పరిశోధనలు వెల్లడిం చాయి. శ్వాస తీసుకునేటప్పుడు గాలి ద్వారా, ధూళి ద్వారా పిబిడియిలు మనుషుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. కాబట్టి ప్లాస్టిక్ వస్తువుల ద్వారా కలిగే ఇలాంటి నష్టాలను దృష్టిలో పెట్టుకుని పాలిథిన్ కవర్లతో సహా అన్నిరకాల ప్లాస్టిక్ వస్తు వుల వాడ కాన్ని క్రమక్రమంగా తగ్గించుకుందాం. తద్వారా మానవజాతి మనుగడను కాపాడుకుందాం. ప్రకృతి పరి రక్షణలో మనవంతు కర్తవ్యాన్ని నిర్వహిద్దాం.

-మురళీ మోహన్ గురూజీ

సూక్తి: మంచి పని ప్రతీది మొదట కష్టంగానే అనిపిస్తుంది.

# మహాభారతం

## కర్ణుడు పరాక్రమము 39

రచన
మహాభారత పరిశోధకులు, అభినవ వ్యాస
జ్ఞానప్రపూర్ణ శ్రీ **దేవిశెట్టి చలపతిరావు** B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట
ఫోన్ : 08647-254716, సెల్ : 80085 39770
visit:www.srichalapathirao.com

(గత సంచిక తరువాయి)

**4. ఉత్తర గోగ్రహణం సందర్భంగా జరిగిన యుద్ధం :**

పాండవుల అజ్ఞాత వాసాన్ని భంగపరచాలనే ఉద్దేశంతో త్రిగర్త దేశాధిపతి సుశర్మను దక్షిణ గోగ్రహణానికి పంపించి; మరునాడు దుర్యోధనుడు భీష్మ, ద్రోణ, కృప, అశ్వద్ధామ, శకుని, కర్ణులతో సోదర సహితుడై, చతురంగ బలాలను వెంటబెట్టుకొని విరాటనగరానికి ఉత్తరం వైపున ఉన్న గోవులను హరించుటకు దండెత్తి వచ్చాడు. అలా వచ్చి బలప్రయోగంతో గో సంపదను అపహరించటం మొదలుపెట్టాడు. కౌరవసేనలు 60వేల గోవులను తోలుకొని పోతూ ఉంటే గోపాలురు నగరంలో ప్రవేశించి విరాట మహారాజు కుమారుడు ఉత్తరునితో విషయాన్ని విన్నవించి గోవులను కాపాడమని ప్రార్థించారు.

(విరాట ప. 35 అ)

అది విని ఉత్తరుడు "నాకు సరియైన సారధి గనుక ఉంటే ఆ కౌరవ వీరులందరినీ జయించి గోవులను మరలిస్తాను. కాని తగిన సారధి లేడే!" అనగా సైరంధ్రిగా ఉన్న ద్రౌపది ఉత్తరునితో "రాకుమారా! మన బృహన్నల పూర్వం అర్జునునికి రధసారధిగా ఉండేవాడు. ఖాండవ వన దహన సమయంలో ఇతడే అర్జునునికి సారథ్యం వహించాడు" అని చెప్పగా ఉత్తరుడు అంగీకరించి బృహన్నలను సారధిగా చేసికొని యుద్ధానికి బయలుదేరాడు. (36 అ.)

కౌరవ సేనను చూడగానే – నేల ఈనినట్లుగా, మహాసముద్రంలా ఉన్న కౌరవసేనను, భీష్మ, ద్రోణ, కర్ణాది మహావీరులను చూడటంతోనే ఉత్తరునిశరీరం భయంతో గగుర్పాటు చెందింది. దానితో రధం దిగి పారిపోగా, బృహన్నల పట్టుకొచ్చి రధంపై కూర్చోబెట్టాడు. "నీవు భయపడకు, కౌరవులతో నేను యుద్ధం చేస్తాను. నీవు సారథ్యం చెయ్యి" అని ఉత్తరునితో చెప్పి, ఉత్తరుని సారధి స్థానంలో కూర్చోబెట్టి శమీవృక్షం వైపు పోనిమ్మని ఆదేశించాడు. అక్కడికి వెళ్ళి తన గాండీవాన్ని, అక్షయ తూణీరాలను, ఇతర ఆయుధాలను దింపించి, రధంపై ఉంచి యుద్ధానికి బయలుదేరాడు బృహన్నల వేషంలోవున్న అర్జునుడు.(41 అ)

అర్జునుడు తన దివ్య శంఖాన్ని పూరించాడు. ద్రోణాచార్యుడు అపశకునముల గురించి చెప్పాడు, అప్పుడు కర్ణుడు ద్రోణుని నిరసిస్తూ అహంకరించి మాట్లాడుతాడు. దుర్యోధనుడు 'ఇప్పుడు యుద్ధమే మన కర్తవ్యం' అన్నాడు. దానితో అందరూ యుద్ధసన్నద్ధులయ్యారు. ద్రోణుడు యుద్ధవ్యూహాన్ని రచించాడు. "దుర్యోధనుడు గోవులను మరలించుకొని దక్షిణ దిక్కుగా వెళ్ళాలి. ఎదిరించిన అర్జునుని మనం ఎదుర్కోవాలి" అని వ్యూహాన్ని చెప్పాడు. అలాగే దుర్యోధనుడు గోవులతో వెళ్ళిపోతున్నాడు. అప్పుడు అర్జునుడు యుద్ధరంగంలో ప్రవేశించి, అక్కడ ద్రోణ అశ్వద్ధాములను, ఆ వెనుక భీష్మ కృపులను, ఆ ప్రక్కన కర్ణుని ఇతర వీరులను చూచి దుర్యోధనుడు కనిపించకపోవటంతో "ఉత్తరా! ఈ రధాలన్నింటిని వదలి దుర్యోధనుడున్న వైపుకు రధాన్ని నడుపు. అతడితోనే యుద్ధం చేసి గోవులను మరలించాలి" అనటంతో ఉత్తరుడు రధాన్ని దుర్యోధనునివైపుకు నడిపించాడు. **అర్జునుడు దుర్యోధనునిపై తీవ్రశరవర్షం కురిపించి కౌరవసేనలను చీల్చి చెండాడుతున్నాడు. సేనలన్నీ చేష్టలు దక్కి అర్జునుని చేతివేగాన్ని ఆశ్చర్యంతో తిలకిస్తున్నాయి. అర్జునుడు శత్రుసేనలను పారద్రోలి, గోవులను స్వాధీనం చేసుకున్నాడు.** (53 అ)

అది గమనించి దుర్యోధనునికి రక్షగా కర్ణుడు తన రధాన్ని వేగంగా నడిపించాడు. అర్జునుడు కూడా రధాన్ని కర్ణునివైపుకు నడిపించాడు. **కర్ణార్జునులమధ్య తీవ్రమైన యుద్ధం ప్రారంభమైంది. శత్రుసేనా సమూహాలను పీడిస్తూ అమానుష పరాక్రమాన్ని ప్రదర్శిస్తున్న అర్జునుని చూసి సహింపక వికర్ణుడు, చిత్రసేనుడు, సంగ్రామజిత్తు, శత్రుసహుడు, జయుడు, శత్రంతపుడు బాణవర్షాన్ని అర్జునునిపై కురిపించాడు. అర్జునుడు విడిచిన వాడి బాణంతో శత్రుంతపుడు నేలకూలి ప్రాణాలు వదిలేశాడు. వేసవిలో అగ్ని అడవిని దహించినట్లు కౌరవసేనను తన బాణాగ్ని జ్వాలలకు ఆహుతి చేస్తున్నాడు అర్జునుడు. అర్జునుడు కర్ణుని సోదరుడైన సంగ్రామజిత్తు తలను ఖండించాడు. దానితో రెచ్చిపోయిన కర్ణుడు ఆబోతుపై దూకిన పులిలా ఉత్తరార్జునులపైకి ఉరికాడు. 12 వాడి బాణాలతో అర్జునుని గాయపరిచాడు. వెంటనే గరుత్మంతుడు పామును పట్టుకున్నట్లు ఒక్క ఉదుటున కర్ణునిపై పడ్డాడు.** ఆ ఇద్దరి యుద్ధాన్ని చూడగోరి కౌరవులంతా

**సూక్తి** మంచిమాటలు పెడచెవిన పెట్టేవారు కూడా చెవిటివారే.

**వివేకామృతం** ధ్యానం చాలా ముఖ్యమైనది. భగవంతుని (ఆత్మను) ధ్యానింపుడు. ఆధ్యాత్మిక జీవితాన్ని బడయుటకు ధ్యానం ప్రముఖ సాధనమై వున్నది. దైవధ్యానం చేయు ఈ సమయం ఒకటే మన నిత్యజీవితంలో భౌతిక వస్తు భావన లేనిది. ఆ సమయాన ఆత్మ భౌతిక వస్తుజాలరహితమై తన యందు తాను స్థితి కలిగి యుండును. అత్తఱి మనస్సు పరమాశ్చర్యకరమగు ఆత్మసంస్పర్శ కలిగివుండును



స్తబ్ధుగా నిలిచిపోయారు. అర్జునుని బాణాలలో మునిగిపోయి భీష్మాది యోధులు కనబడడంలేదు. కర్ణుడు అర్జునుని బాణాలను తన వాడి బాణాలతో ఖండించి, తన అల్లెత్రాటిని మళ్ళీ మళ్ళీ లాగి ధ్వనింపజేశాడు. దానితో కర్ణుని ప్రశంసిస్తూ కౌరవులు కరతాళ ధ్వనులు చేశారు. అర్జునుడు కూడా కర్ణుని అశ్వాలను, సూతుని, రథంతోపాటు కర్ణుని బాణాలతో పీడించి, భీష్మ, ద్రోణ, కృపులను చూస్తూ కర్ణునిపై బాణవర్షం కురిపించాడు. కర్ణుడు అర్జునుని పరాక్రమాన్ని సహింపలేక తీవ్ర శరాలతో అర్జునుని గుర్రాలను గాయపరచాడు. 3 బాణాలతో సారథిని గాయపరచి, మరో 3 బాణాలతో ధ్వజాన్ని ధ్వంసం చేశాడు. అర్జునుడు అమానుష పరాక్రమంతో కర్ణుని గాయపరిచాడు. గాండీవం నుండి వెలువడి వజ్రాయుధంలా ప్రకాశించే బాణాలతో కర్ణుని బాహువులను, తొడలను, శిరస్సును, నుదుటిని, మెడను గాయపరిచాడు. గాయపడిన ఆ కర్ణుడు ఏనుగుచేత ఓడింపబడిన మరొక ఏనుగులా రణరంగాన్ని విడిచి పారిపోయాడు. ఇదిగో ఆ శ్లోకం..

(విరాటపర్వం-54 అధ్యాయం-36 శ్లో)

శ్లో॥ సపార్థముక్తై రిషుభిః ప్రణున్నో! గజోగజేనేవ జతస్తరథీ ॥
విహాయ సంగ్రామ శిరఃప్రయాతో ।
వైకర్తనః పాండవబాణ తప్తః ॥

అలా కర్ణుడు రణరంగాన్ని విడిచి పారిపోవటంతో దుర్యోధనాది కౌరవ యోధులు తమ సేనలతో అర్జునునివైపు రాసాగారు. మహాసముద్ర వేగాన్ని చెలియలికట్ట అడ్డగించినట్లు అర్జునుడు బాణవర్షం కురిపిస్తూ కౌరవసేనను అడ్డుకున్నాడు. ద్రోణుని 73 బాణాలతో, పదింటితో దుస్సహుని, ఎనిమిదింటితో అశ్వద్ధామను, పన్నెండింటితో దుశ్శాసనుని, మూడింటితో కృపుని, అరువదితో భీష్ముని, నూరింటితో దుర్యోధనుని కొట్టాడు. ఆ వెంటనే యుద్ధభూమికి తిరిగి వచ్చిన కర్ణుని ఒకే ఒక్క బాణంతో గూబపై కొట్టాడు. ఆ తరువాత సూతుని, గుర్రాలను సంహరించాడు. దానితో కర్ణుడు విరధుడై దెబ్బతిని ఉండగా సేన అంతా చెదిరిపోయింది. ఇదిగో ఆ శ్లోకం..

(విరాట పర్వం-55 అధ్యాయం-38శ్లో)

శ్లో॥ తస్మిన్ విద్ధే మహోష్వాసే కర్ణే సర్వాస్త్ర కోవిదే।
హతాశ్వసూతే విరథే తతో ౽ నీ కమభజ్యత॥

ఆ తర్వాత అర్జునుడు తన రథాన్ని కృపాచార్యునిపైకి నడిపించాడు. ఇరువురి మధ్య భీకరమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధాన్ని చూడటానికి దేవేంద్రుడు విశ్వేదేవుల, అశ్వినుల, మరుత్తులతో సహా ఇతర దేవతలతో కూడి విమానాలలో నిలిచి సందర్శించారు. ఇరువురి మధ్య భయంకర యుద్ధం కొనసాగి; తన రథం భగ్నమై, గుర్రాలు, సారథి మరణించటంతో కృపుడు యుద్ధభూమినుండి తొలగిపోయాడు. ఆ తరువాత ద్రోణునితో, అశ్వద్ధామతో భయంకరంగా యుద్ధంచేసి జయించాడు అర్జునుడు. అశ్వద్ధామకు సాయంగా కర్ణుడు రావటంతో అర్జునుడు కర్ణునిపైకి తన రథాన్ని నడిపించాడు. ఇద్దరిమధ్య మాటల యుద్ధం నడిచింది. అర్జునుడు కర్ణుని దుర్మార్గాలను ఏకరువు పెట్టాడు. కర్ణుడు తన పరాక్రమాన్ని గురించి తెలియజేస్తూ "పార్థా! ఇంద్రుడే నీకు సాయంగా వచ్చినా నాకు భయంలేదు. ఇప్పుడు నా బలమేమిటో చూస్తావు" అన్నాడు. దానికి అర్జునుడు "రాధేయా! ఇప్పుడే గదా! నీవు నాతో యుద్ధం చేస్తూ పారిపోయింది. పారిపోయావు గనుకనే బ్రతికి ఉన్నావు. నీ తమ్ముడు మరణించాడు. తమ్ముని చంపించి యుద్ధంనుండి పారిపోయి, పెద్దల మధ్యలో నిలిచి ఇలా ప్రగల్భాలు పలికేవాడు నీవు తప్ప మరొకరెవరుంటారు?" అంటూ కర్ణునిపై శరవర్షం కురిపించాడు. కర్ణుని గుర్రాలను, చేతి తొడుగులను కొట్టి భుజాలను గాయపరిచాడు. అల్లెత్రాటిని తెగవేశాడు. కర్ణుడు వేరొక ధనస్సును చేబూని అర్జునుని చేతిపై కొట్టాడు. తిరిగి అర్జునుడు కర్ణుని ధనుస్సును ముక్కలు చేశాడు. అంతలో సైన్యం కర్ణునికి రక్షణగా రాగా, అర్జునుడు గాండీవ ప్రయుక్త బాణాలతో వారిని సంహరించాడు. నారిని చెవి వరకు లాగి, బాణాలను సంధించి కర్ణుని గుర్రాలను కొట్టాడు. అవి చచ్చి నేలకూలాయి. మరో వాడియైన బాణంతో కర్ణుని వక్షస్థలంపై కొట్టాడు. ఆ బాణం కర్ణుని కవచాన్ని చీల్చి, శరీరాన్ని తాకింది. కర్ణుడు మూర్ఛిల్లి నిశ్చేతనుడయ్యాడు. క్షణంలో తేరుకొని-

శ్లో॥స గాఢ వేదనో హిత్వా రణం ప్రాయాదుదఙ్ముఖః
తతో ౽ర్జున ఉదక్రోశ దుత్తరశ్చ మహారథః॥
(విరాట.ప. 60. అ. 27 శ్లో)

తా॥ కర్ణుడు ఆ గాఢ వేదనను భరించలేక, రణభూమిని విడిచిపెట్టి ఉత్తరదిక్కుగా పారిపోయాడు. ఇది చూచి అర్జునుడు, ఉత్తరుడూ ఇద్దరూ సింహనాదాలు చేశారు. (అ.60)

ఆ తరువాత దుశ్శాసనాదులను ఓడించి, సమస్త కౌరవ

**సూక్తి** సేవ త్యాగాన్ని నేర్పిస్తుంది. స్వార్థం స్వాహా చేయిస్తుంది.


వీరులతో భయంకర యుద్ధం గావించాడు అర్జునుడు. కౌరవసేన పలాయనం చిత్తగించింది. ఆ తరువాత భీష్ముడు అర్జునునెదిరించి ఓడిపోయి తొలగిపోయాడు. దుర్యోధనుడెదిరించి ఓడి పారిపోయాడు. తరువాత సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించి సర్వ సేనలను మూర్ఛితులను చేసి గోవులను మరలించుకపోయాడు అర్జునుడు. ఇదీ ఉత్తర గోగ్రహణం సందర్భంగా జరిగిన యుద్ధ విశేషం.

**విశ్లేషణ : ఇప్పుడు కర్ణునికి సహజ కవచ కుండలాలు లేవు. అందరిలాగా కవచాన్ని ధరించి వచ్చాడు. ఐతే అతడికి తోడుగా భీష్మ, ద్రోణ, కృప, అశ్వద్ధామలు, దుర్యోధన, దుశ్శాసనాది సోదరులు, శకుని, ఇంకా చతురంగ బలాలు-రథ, గజ, తురగ, పదాతు·· అసంఖ్యాకంగా ఉన్నారు. ఇక ద్రోణాచార్యుని వద్ద, పరశు[illegible] వద్ద గ్రహించిన దివ్యాస్త్రాలెన్నో ఉన్నాయి. పాండవులంద·· నేనొక్కడినే సంహరిస్తానని అనేక సందర్భాలలో దుర్యోధనుని నమ్మించాడు. ఇక అర్జునుని విషయానికి వస్తే ఒకే ఒక్క రథంమీద వచ్చాడు. సారథిగా ఉత్తరుడున్నాడు. కనీసం రథచక్రానికి చక్రరక్షకులు కూడా లేరు. ధర్మజ, భీమ, నకుల, సహదేవుల తోడూ లేదు. సైన్యం అసలు లేదు. శ్రీకృష్ణుని తోడు లేదు. అయినప్పటికీ ఈ యుద్ధంలో కర్ణుడు అర్జునుని చేతిలో 3 సార్లు ఓడిపోయి పారిపోయాడు. ఒక్కసారి కూడా అర్జునుని ఓడించలేకపోయాడు. దీనితో కర్ణార్జునుల పరాక్రమాలు ఏ పాటివో స్పష్టంగా ఋజువౌతున్నది.**

కర్ణునికి అర్జునునికి మధ్య బలపరాక్రమాలలో గల తేడా ఏమిటో ఘోషయాత్ర నుండి తిరిగివచ్చిన దుర్యోధనునితో భీష్ముడు కూడా ఇలా చెప్పాడు. (వనప. 253 అ)

"నాయనా దుర్యోధనా! నీవు ఘోషయాత్రకు వెళ్ళటం గాని, అక్కడ చేసిన పనిగాని నాకు నచ్చలేదు. శత్రువులు అక్కడ నిన్ను బలవంతంగా బందీగావించారు. ధర్మాత్ములైన పాండవులే నిన్ను విడిపించారు. **గంధర్వులతో జరిగిన యుద్ధంలో కర్ణుడు భయపడి, సైన్యంతో సహా పారిపోవటాన్ని నీ కళ్ళారా చూచావు. నీవు, నీ వారు ఆక్రోశిస్తుంటే మిమ్ములను రక్షించుటకు భీమార్జునులు ప్రదర్శించిన పరాక్రమాన్ని చూశావు. దుర్మతి అయిన ఈ కర్ణుని పరాక్రమాన్నీ చూశావు. ధనుర్వేదంలో కాని, శౌర్యంలో గాని కర్ణుడు పాండవులలో పావు భాగానికి కూడా సరిపోడు. కనుక పాండవులతో సంధి చేసుకో"** అని.

కర్ణుడు అర్జునుని జయించలేకపోయాడు, అతడితో యుద్ధంలో ఓడి పారిపోయాడు. అనటంవల్ల కర్ణుడు మహావీరుడు కాదు అనో, బలహీనుడు అనో అర్థంకాదు. అతడు గొప్పవీరుడే. అతడు ఎందరో రాజులను జయించాడు, కాకపోతే ఆ రాజులందరూ ఎప్పుడో ఒకప్పుడు పాండవులచేతిలో ఓడింపబడినవారే. వారిలో కొందరు గొప్ప వీరులుకూడా ఉన్నారు. అలా కర్ణుని చేత ఓడింపబడిన రాజులెవరో, వారికి కర్ణునికి ఎప్పుడు యుద్ధం జరిగిందో ఆ విషయాలను కూడా చూద్దాం.




### 5. కర్ణుని దిగ్విజయ యాత్ర:-

(వనప. 253, 254 అధ్యాయములు)

ఘోషయాత్ర సందర్భంగా కర్ణుడు గంధర్వుల చేతిలో ఓడి పారిపోవటాన్ని, పాండవులు దుర్యోధనాదులను గంధర్వుల బారి నుండి విడిపించటాన్ని తెలిపి భీష్ముడు, "పాండవులతో పావు వంతు కూడా సరిపోడు ఈ కర్ణుడు" అనటంతో దుర్యోధనుడు నవ్వి, అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయాడు. ఆ తరువాత దుర్యోధనుడు శకుని కర్ణ దుశ్శాసనులతో సమాలోచనలు చేస్తూ "ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి? మనకు మేలు జరిగే మార్గం ఏమిటి? అనగా, కర్ణుడు "దుర్యోధనా! భీష్ముడెప్పుడూ మనలను నిందిస్తూనే ఉంటాడు. నిన్ను ద్వేషిస్తూనే ఉంటాడు. కనుక నేను భీష్ముని మాటలను సహించలేను. సేనలతో సహా దిగ్విజయ యాత్రకు నన్ను అనుమతించు. పర్వత, వన, కాననలతో సహా ఈ భూమండలాన్ని జయిస్తాను. పాండవులు నలుగురూ కలసి జయించిన భూమిని నీకోసం నేను ఒంటరిగానే జయిస్తాను. దుష్టుడైన ఈ భీష్ముడు దానిని చక్కగా చూస్తాడు. ఈ రోజు నా బలాన్ని చూచి తనను తాను అసహ్యించుకొంటాడు. కనుక నాకు అనుజ్ఞ ఇవ్వు" అనగా, సంతోషంతో అంగీకరించాడు దుర్యోధనుడు. దానితో శుభముహూర్తంలో చతురంగ బలాలను వెంటబెట్టుకుని కర్ణుడు దిగ్విజయ యాత్రకు బయలుదేరాడు.

(వన.ప 253.అ)

**కర్ణుడు పెద్ద సేనతో ముందుగా ద్రుపద నగరాన్ని ముట్టడించి, మహాయుద్ధంగావించి ద్రుపదుని జయించి లోబరచుకున్నాడు.** ఆ తరువాత ద్రుపదుని అనుయాయులైన రాజులందరినీ ఓడించి వారిచేత కప్పం కట్టించాడు. **తరువాత ఉత్తర దిక్కుగా వెళ్ళి భగదత్తుని ఓడించాడు.** ఆ తరువాత హిమాలయాన్ని అధిరోహించి, అక్కడి రాజులను జయించి వశపరచు

సైన్స్

## మిడతలు



మిడత మొక్కల్ని తినే ఒక కీటకం. మిడతలు ఎక్కువగా ఆకుపచ్చ రంగు కలిగి వుంటాయి. మిడతల్లో లాంగ్ హార్న్‌డ్ గ్రాస్ హోపర్స్, షార్ట్ హార్న్‌డ్ గ్రాస్ హోపర్స్ అని రెండు రకాలుంటాయి. ఇవి అర అంగుళం నుండి నాలుగు అంగుళాల పొడవు వరకు వుంటాయి. ఇవి అడవుల్లో, ఎడారుల్లో, గడ్డి మైదానాల్లో నివసిస్తాయి. వీటికి ఆరు కాళ్ళు, రెండు జతల రెక్కలు వుంటాయి.

కున్నాడు. నేపాళప్రాంతంలోని రాజులను, పర్వత ప్రాంతీయ రాజులను ఓడించాడు. అటు నుండి తూర్పు దిక్కుగా పయనించి అంగ, వంగ, కళింగ, శుండిక, మిధిల, మాగధ, కర్కఖండ దేశాలను జయించి, ఆవశీర, అయోధ్య, అహిక్షత్ర దేశాలను కూడా జయించాడు. ఆ తరువాత వత్సభూమిలో అడుగుపెట్టి కేవల, మృత్తికావతి, మోహన, పత్తన, త్రిపురి, కోసల దేశాలను జయించి కప్పం కట్టించుకున్నాడు. తిరిగి దక్షిణ దిక్కుకు బయలు దేరి ముందు రుక్మితో యుద్ధంచేశాడు. ఇరువురికి తీవ్రయుద్ధం జరిగి చివరికి రుక్మి కర్ణునితో "కర్ణా! నీ పరాక్రమం చూచి ఆనందిస్తున్నాను. నీకు కావలసినంత బంగారాన్ని ఆనందంగా ఇస్తాను తీసుకో" అనగా రుక్మితో స్నేహం చేసుకొని పాండ్య, శ్రీశైల దేశాలవైపు బయలుదేరాడు. కేరళరాజును, నీలరాజును, వేణుదారి కుమారుని ఓడించి, దక్షిణ దిక్కు గల ఇతర రాజులను కూడా జయించాడు. **ఆపై శిశుపాలుని కుమారుడు దృష్టకేతువును ఓడించి చుట్టుపక్కల గల రాజులను జయించాడు.** సామోపాయంతో అవంతీరాజులను వశపరచుకొని, వృష్ణులతో చెలిమి చేసి పశ్చిమ దిక్కును కూడా జయించాడు. ఆ తరువాత యవనులను, బర్బరులను ఓడించి, కప్పం కట్టించుకున్నాడు. ఇలా నాలుగు దిక్కులలోని భూమిని జయించి, ఆ వీరుడు మ్లేచ్ఛ, ఆటవిక, గిరిజన, భద్ర, రోహతక, ఆగ్రేయ, మాళవాది, గణ రాజ్యాలన్నింటిని జయించాడు. తరువాత శశక, యవన రాజులను, నగ్నజిత్తును ఓడించాడు. ఇలా అందరిని ఓడించి హస్తినకు చేరాడు.

ఈ విధంగా కర్ణుడు నాలుగు దిక్కులలోగల రాజులందరిని జయించి, వారిచేత కప్పం కట్టించి, అనేక బహుమతులను పొంది తిరిగి వచ్చాడు. **పాండవ రాజసూయ యాగ సందర్భంగా భీమార్జున నకుల సహదేవులు నలుగురూ నాలుగు దిక్కులను జయిస్తే, కర్ణుడొక్కడే నాలుగు దిక్కులను జయించాడు.**

**విశ్లేషణ : ఇందులో పాంచాల రాజు ద్రుపదుని కర్ణుడు జయించాడు. ఈ ద్రుపదుని చేతిలోనే గురుదక్షిణ సమయంలో కర్ణుడు ఓడి పారిపోయాడు. మిగిలిన వారందరూ పాండవులచేత జయింపబడినవారే. కనుక అర్జునునికన్న కర్ణుడు అధికుడు అనటానికి ఆధారం ఏమీలేదు.**

### 6. కర్ణపరాక్రమాన్ని తెలిపే రెండు సంఘటనలు :

(శాంతి ప.4,5 అ)

మహాభారత యుద్ధానంతరం కర్ణుడు తమ సోదరుడే అని తెలుసుకున్న ధర్మరాజు దుఃఖిస్తూ ఉంటే నారదుడు ధర్మరాజును ఓదారుస్తూ అతడడిగిన ప్రశ్నకు సమాధానంగా ఇలా తెలిపాడు.

కళింగరాజు చిత్రాంగదుడు తన కుమార్తెకు స్వయంవరం ప్రకటించాడు. శిశుపాలుడు, జరాసంధుడు, భీష్మకుడు, వక్రుడు, నీలుడు, రుక్మి, శృగాలుడు, అశోకుడు, శతధన్వుడు, భోజుడు, మొ॥వీరులతోబాటు దుర్యోధనుడు కూడా కర్ణుని వెంటబెట్టుకొని వచ్చాడు.రాజకన్య వరమాల చేతధరించి ఒక్కొక్క రాజును దాటి వెళుతున్నది. ఆమె దుర్యోధనుని దాటి ముందుకు వెళ్ళటంతో దుర్యోధనుడు సహించక ఆమెను అడ్డగించి తన రథంపైకెక్కించి తీసుకొని వెళ్ళాడు. **రాజులంతా క్రోధంతో కర్ణ దుర్యోధనులనెదిరించగా కర్ణుడు ఒక్కొక్క బాణంతో ఆ రాజుల ధనుస్సులను భగ్నం చేశాడు.** అప్పుడు జరిగిన భీకర యుద్ధంలో కొందరు ధనుస్సులు విరిగి, కొందరి రథాలు ధ్వంసమై, కొందరి సారధులు మరణించి, కొందరి రథాశ్వాలు వధించబడి భగ్న మనోరథులై వెనుదిరిగి పోయారు. దుర్యోధనుడు కర్ణుని రక్షణలో, రాజకన్యను తీసుకొని హస్తినాపురానికి వెళ్ళిపోయాడు.

(శాంతి పర్వం. 4 అధ్యాయం)

కర్ణుని బలపరాక్రమాలను గురించి తెలుసుకొని మగధరాజు జరాసంధుడు కర్ణుని ద్వైరథ యుద్ధానికి ఆహ్వానించాడు. అంటే వేరెవ్వరూ లేకుండా ఇద్దరే రథాలనధిరోహించి యుద్ధం చేయుట. ఇద్దరూ మహాబలురు, ఇద్దరూ పరాక్రమశాలురు, ఇద్దరూ దివ్యాస్త్రవేత్తలు. ఇద్దరూ తీవ్రయుద్ధం చేస్తున్నారు. ఒకరిపై ఒకరు బాణవర్షం కురిపించారు. ఇరువురి ధనస్సులు విరిగిపోయాయి. ఇద్దరిబాణాలు అయిపోయాయి. కత్తులు విరిగి నేలపై పడ్డాయి. ఇద్దరి రథాలు భగ్నమై ఇరువురూ దిగి బాహుయుద్ధం చేశారు. **ఆ యుద్ధంలో జరాసంధుని దేహంలోని అంగసంధి (కీలు) తొలగిపోయింది. దానితో జరాసంధుడు యుద్ధం మాని కర్ణునితో 'ప్రీతోస్మి'- ప్రీతి చెందాను అని కర్ణునికి మాలినీ నగరాన్ని ఇచ్చాడు.**

**విశ్లేషణ : జరాసంధుని యుద్ధంలో ఓడించటం సామాన్య విషయం కాదు. అందులోను బాహుబలంతో చేసే మల్లయుద్ధంలో ఓడించాలంటే గొప్ప బాహుబలశాలి కావాలి.భీముడు గొప్ప బాహుబలం గలవాడు, 10 వేల ఏనుగుల బలం కలవాడు** గనుక జరాసంధుని దేహాన్ని రెండుగా చీల్చగలిగాడు. కర్ణుడు **కూడా జరాసంధుని బాహుయుద్ధంలో జయించాడు గనుక**

సూక్తి: పుణ్యమంటే పరోపకారం, పాపమంటే పర పీడనం.

## రచయితలకు సూచనలు

ధ్యానమాలికకు రచనలు పంపేవారు తమ రచ నలను పేపరుపై ఒక పక్క మాత్రమే రాయాలి. అక్షరాలు స్పష్టంగా రాయాలి. పేజీకి పదిహేను లేదా ఇరవై లైన్లకు మించి రాయకూడదు. వీలుంటే డి.టి.పి చేసి పంపినా ఫర్వాలేదు. ప్రతి రచనతోపాటు హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ప్రాచుర్యం పొందిన గ్రంథాల నుండి సేకరించిన రచనలైతే తప్పనిసరిగా ఆ గ్రంథం యొక్క పేరును రచన చివరలో పేర్కొనాలి. మీ చిరునామా, ఫోన్ నెంబరు స్పష్టంగా రాయాలి.

రచనలు పంపాల్సిన చిరునామా :
ఎడిటర్, ధ్యానమాలిక, 29-28-23, విక్రాంత్ బిల్డింగ్స్, దాసరివారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2.

**కర్ణుడు గొప్ప బాహుబలం గలవాడిగా అంగీకరించాలి.**

ఇక మహాభారత యుద్ధంలో కర్ణుని పరాక్రమం, అస్త్ర శస్త్ర విద్యాకుశలతను తెలుసుకుందాం.

**7. మహాభారత యుద్ధంలో కర్ణుని పరాక్రమ విశేషాలు:**

**18 రోజులు జరిగిన మహాభారత సంగ్రామంలో 10 రోజులపాటు యుద్ధరంగానికి దూరంగా ఉన్న కర్ణుడు, భీష్మపతనానంతరం 11వ రోజున యుద్ధరంగంలో ప్రవేశించాడు.** 11వ రోజు, 12వ రోజు మధ్యాహ్నం వరకు చెప్పుకోదగిన విశేషం లేదు. 12వ రోజు సాయంసమయానికి ముందు అర్జునుని బాణధాటికి వెనుదిరిగిన కౌరవసేనలకు అభయమిస్తూ కర్ణుడు, అర్జునునెదిరించి ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. అప్పుడు కర్ణార్జునులమధ్య ఘోరంగా సమరం సాగింది. ఆ సమయంలో అర్జునునికి సాయంగా దృష్టద్యుమ్నుడు, భీముడు, సాత్యకి రాగా, కర్ణునికి సాయంగా దుర్యోధనుడు, ద్రోణుడు, సైంధవుడు వచ్చి నిలిచారు. **అప్పుడు జరిగిన యుద్ధంలో అర్జునుడు ఏడు బాణాలతో కర్ణుని గాయపరచి, కర్ణుని తమ్ముని పదునైన బాణాలతో సంహరించాడు. 7 బాణాలతో శత్రుంజయుని సంహరించి, ఒక భల్లెంతో విపాటుని శిరస్సు ఖండించాడు. కౌరవులు చూస్తుండగానే కర్ణుని ఎదురుగానే అర్జునుడు ఒక్కడే కర్ణుని సోదరులు ముగ్గురిని వధించాడు. భీముడు కర్ణపక్షంలోని 15మంది యోధులను చంపాడు.**

ఆ తరువాత భీముడు 10 బాణాలతో కర్ణుని రథాశ్వాలను, సారథిని చంపివేశాడు. కర్ణుడు మరొక రథం ఎక్కి భీమార్జునుల నెదుర్కొనగా దృష్టద్యుమ్నుడు 73 బాణాలతో కర్ణుని గాయపరిచాడు. సాత్యకి 64 బాణాలతో కర్ణుని గుండెలమీద, చేతులమీద కొట్టి, ధనుస్సును ఖండించాడు. అప్పుడు పరస్పరం ఘోరయుద్ధం జరుగుతుండగా సూర్యాస్తమయం అయింది (ద్రోణ.ప.32 అ)

**13వ రోజు యుద్ధం, పద్మవ్యూహంలో అభిమన్యునితో కర్ణుని యుద్ధం.**

పద్మవ్యూహంలో ప్రవేశించిన అభిమన్యుడు ఎదురువచ్చిన వారి శిరస్సులను ఖండిస్తూ, సేనలను ఛిన్నాభిన్నం చేస్తూ దూసుకుపోతున్నాడు. శత్రువుల శిరస్సులతో యుద్ధభూమిని కప్పివేశాడు. వేలకొద్దీ ఏనుగులు, గుర్రాలు, రథాలు నేలకూలుతున్నాయి. ఎదిరించిన వీరులు యుద్ధభూమినుండి పారిపోవటమో, యమసదనానికి పోవటమో తప్ప మరొకమార్గం లేదు. దుర్యోధనుడెదిరించి వైదొలగాడు. శల్యుడు మూర్ఛితుడయ్యాడు. ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు, కర్ణుడు, కృతవర్మ, శకుని, బృహద్బలుడు, శల్యుడు, భూరి, భూరిశ్రవుడు, శలుడు, వృషసేనుడు ఒక్కసారిగా అభిమన్యునిపై బాణవర్షం కురిపించారు. వారందరిపై శరవర్షం కురిపించి అభిమన్యుడు యుద్ధవిముఖులను చేసి సింహనాదం చేశాడు. తిరిగి వారంతా అభిమన్యునిపై వాడియైన బాణాలు ప్రయోగించగా అభిమన్యుడు కర్ణుని కవచాన్ని, శరీరాన్ని చీల్చివేసే బాణం వేశాడు. ఆ దెబ్బతో కర్ణుడు భూకంపం వచ్చినప్పుడు చలించే పర్వతంలా చలించాడు. ఆ తరువాత శల్యసోదరుని, చక్రరక్షకులను, సంహరించాడు. మహావేగంతో వచ్చి ఎదిరించిన దుశ్శాసనుని శరీరాన్ని బాణాలతో చెక్కివేశాడు అభిమన్యుడు. దుశ్శాసనుడు మూర్ఛపోవటంతో సారథి రథాన్ని తప్పించి తీసుకెళ్ళాడు. అప్పుడు దుర్యోధనుడు కర్ణుని రెచ్చగొట్టటంతో కర్ణుడు ఉత్తమ అస్త్రాలను ప్రయోగిస్తూ అభిమన్యుని పీడించాడు. అభిమన్యుడు ఏమాత్రం చలించక తీవ్ర శరాలతో కర్ణుని ఛత్రము, ధ్వజము, సారథి, అశ్వాలతోసహా కర్ణుని గాయపరిచాడు. కర్ణుడు వంగిన ములుకులు గల బాణాలను వేశాడు. అభిమన్యుడు వాటిని సహించి, కర్ణుని ధ్వజాన్ని, ధనుస్సును ముక్కలు చేయటంతో కర్ణునికి రక్షణగా ఆయన సోదరుడు వచ్చాడు. వచ్చీ రావటంతోనే అతడు అభిమన్యుని ధ్వజం, సారథి, గుర్రాలను 10 బాణాలతో కొట్టాడు. **అభిమన్యుడు ధనస్సును బాగా వంచి ఒకేఒక్క బాణంతో కర్ణసోదరుని శిరస్సును ఖండించాడు. అది చూచి కర్ణుడు వ్యథ చెందాడు. అభిమన్యునిపై శరవర్షం కురిపించటంతో అభిమన్యుడు గ్రద్ద ఈకలు కట్టిన బాణాలతో కర్ణుని ఛేదించగా, అభిమన్యుని బాణాలతో పీడితుడైన కర్ణుడు యుద్ధ**



**సూక్తి** మంచిపనులు వెంటనే చెయ్! కాలం నీకోసం ఆగదు.

## మనసు-మర్మం



**మనసు అహంకారపూరితమై గర్వంతో వుండి, అన్నీ నాకు తెలుసు అనే భావనతో వుంటుంది.**

1. మనసు ద్వంద్వాలతో భిన్నత్వంలో పరస్పర వ్యతిరేక అంశాలను చూస్తూ వుంటుంది.
2. అది కోరికల సమూహమే. దీని ఫలితంగా మనసు భౌతిక ప్రపంచంలోనికి ఇంద్రియాల ద్వారా పరుగులు పెడుతూ ద్వంద్వాల మధ్య ఘర్షణ పడుతూ వుంటుంది. ఫలితంగా మనిషి గమనాన్ని కోల్పోతాడు.
3. తాత్కాలికమైన బాహ్యాపరమైన అంశాలతో మోహాన్ని పెంచుకోవడం చాలా ప్రమాదకరం. కుటుంబంతో సమాజంతో సత్సంబంధాలు అవసరమే కానీ వ్యామోహం చాలా ప్రమాదకరం.
4. మనసు అరిషడ్వర్గాలకు బానిస అయినప్పుడు స్పష్టతను, వివేచనా శక్తిని కోల్పోతుంది.
5. మనసు భయంకర సందర్భాలు ఉత్పన్నమైనప్పుడు వానిని అంతరంగంలో దాచుకుని అణచుకొని బయటికి వ్యక్తీకరించకుండా వుంటుంది. దీనివలన అంతరాత్మ అణచిపెట్టబడి మాయ ఆవహించి సత్యం మరుగున పడుతుంది.
6. ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు మనసు దానిని ఇతరులమీదికి నెట్టివేసి, వారిని నిందించే పనికి పూనుకుంటుంది. బాధ్యతను స్వీకరించడానికి ఇష్టపడదు.
7. మనసు అహంకారపూరితమై గర్వంతో వుండి, అన్నీ నాకు తెలుసు అనే భావనతో వుంటుంది. అది చాలా ప్రమాదకరం.
8. మనసు చైతన్యవంతంగా వున్నప్పుడు గాలికి కదిలే చెట్ల ఆకుల వలె అస్థిమితంగా చంచలంగా వుంటుంది.
9. ఆలోచనలు అస్తవ్యస్తంగా వున్నప్పుడు మనసు రుగ్మతకు గురై సమతుల్యతను కోల్పోతుంది.

భూమినుండి తొలగి వెళ్ళిపోయాడు. (ద్రోణ ప.40.41 అ)

అభిమన్యుని ధాటికి నిలువలేక కౌరవసేనలు కకావికలై పరుగులు తీస్తుండగా ద్రోణ, కృప, అశ్వద్ధామ, బృహద్బల, కర్ణ, దుర్యోధన, శకుని, కృతవర్మలు అభిమన్యునిపైకి దూకగా అభిమన్యుడు వారందరిని యుద్ధవిముఖులను చేశాడు. అంతట దుర్యోధన పుత్రుడు లక్ష్మణుడెదిరించగా అభిమన్యుడు కుబుసం విడిచిన సర్పంవంటి బాణాన్ని వదలటంతో లక్ష్మణుని శిరస్సు నేలరాలింది. దుర్యోధనుడు క్రోధంతో 'ఇతణ్ణి చంపండి' అని ఆదేశించటంతో ఆరుగురు మహారధులు చుట్టుముట్టారు. అభిమన్యుడు వారిలో బృహద్బలుని వధించాడు. **ఆ తరువాత కర్ణాభిమన్యుల మధ్య భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కర్ణుని మంత్రులు ఆరుగురిని వధించాడు అభిమన్యుడు. కర్ణుడు దూరంగా యుద్ధం చేస్తున్న ద్రోణుని వద్దకు వెళ్ళి "ఆచార్యా! మనందరిని అభిమన్యుడు చంపకముందే, అతణ్ణి వధించే ఉపాయం చెప్పండి. బాణప్రయోగంలో ఇతడి వేగాన్ని చూడండి. యుద్ధరంగంలో అర్జునుని హస్తం ఇంత కర్కశం కాదు. ఆచార్యా!"**

**శ్లో॥ స్థాతవ్యమితి తిష్ఠామి పీడ్యమానోఽభిమన్యునా।**
**తేజస్వినః కుమారస్య శరాః పరమదారుణాః॥**
(ద్రోణ. ప.48 అ.25 శ్లో)

**శ్లో॥ క్షిణ్వంతి హృదయం మేఽద్య ఘోరాః పావకతేజసః।**
**తమాచార్యో ఽబ్రవీత్ కర్ణం శనకైః ప్రహసన్నివ॥**
(ద్రోణ. ప. 48. అ.26 శ్లో)

**తా॥ "మహాతేజస్వి అభిమన్యుని బాణాలు నన్ను పీడిస్తున్నప్పటికీ యుద్ధరంగంలో నిలచి ఉండాలి కాబట్టి నిలిచాను. అభిమన్యుని పరమ దారుణమైన బాణాలు నా హృదయాన్ని చీల్చివేస్తున్నాయి. ఇవి అగ్నితో సమానమైన తేజస్సు గల బాణాలు" అన్నాడు కర్ణుడు.**

అది అభిమన్యుని చేతిలో కర్ణుడు తిన్న దెబ్బ. దీనిని స్వయంగా కర్ణుడే ఆచార్యునితో చెప్పటం ఇక్కడ గమనార్హం. ఆ తరువాత ద్రోణుని సలహాతో ఆరుగురు మహావీరులు ఒక్కసారిగా అన్ని వైపులనుంచి చుట్టుముట్టి సంహరించారు అభిమన్యుని- అందులో కర్ణుడొకడు.

ఇక ఎంతో విశిష్టమైన 14వ రోజు యుద్ధంలో కర్ణుని పరాక్రమం ఏమిటో చూద్దాం.

**(వచ్చే సంచికలో)**

**సూక్తి** మన విలువ మన మాటల నిలకడను బట్టి తెలుస్తుంది.

# మహాభారతం

## కర్ణుడు పరాక్రమము

**40**

రచన
మహాభారత పరిశోధకులు, అభినవ వ్యాస
జ్ఞానప్రపూర్ణ **శ్రీ దేవిశెట్టి చలపతిరావు** B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట
ఫోన్ : 08647-254716, సెల్ : 80085 39770
visit:www.srichalapathirao.com

(గత సంచిక తరువాయి)

పద్మవ్యూహంలో అభిమన్యునితో జరిగిన కర్ణుని యుద్ధ విశేషాలను తెలుసుకున్నాం. ఇక 14వ రోజు సైంధవ వధ సందర్భంగా ఒంటరిగా వ్యూహంలో ప్రవేశించిన భీమునితో కర్ణునికి జరిగిన యుద్ధ విశేషాలను, భీమ కర్ణుల పరాక్రమ విశేషాలను తెలుసుకుందాం.

**14వరోజు జరిగిన భీమ కర్ణుల యుద్ధవిశేషాలు :**
(ద్రోణ ప.129-139 అ)

ద్రోణాచార్యునిచే రచించబడిన అపూర్వ కౌరవసేనా వ్యూహంలో ప్రవేశించిన అర్జునుని జాడను తెలుసుకోవడానికి ధర్మరాజు భీమసేనుని పంపించాడు. అయితే వ్యూహ ముఖ ద్వారంలో నిలిచిన ద్రోణుడు భీముని నిరోధించి తీవ్రయుద్ధం చేశాడు. **భీముడు ఎంతగా పోరాడినా ద్రోణుని జయించి వ్యూహంలో ప్రవేశించడం సాధ్యపడటం లేదు. దానితో భీముడు రథం దిగి, తలను భుజంపై వాల్చి, చేతులను హృదయంపై నిలిపి, ఆబోతు వర్షాన్ని విలాసంగా గ్రహించినట్లు, భీముడు ద్రోణుని శరవర్షాన్ని స్వీకరిస్తూ, బాణాఘాతాలను సహిస్తూ, రథం నొగలుపై చేయివేసి, ద్రోణునితో సహా రథాన్ని దూరంగా విసిరివేశాడు. ద్రోణుడు రథం నుండి దూకి మరొక రథాన్నెక్కి క్షణంలో రాగా, దాన్నీ అలాగే విసిరివేశాడు భీముడు. మళ్ళీ తిరిగి ద్రోణుడు ముఖద్వారం వద్దకురాగా భీముడు రెప్పపాటు కాలంలో విసిరివేశాడు. సకల సేనలు, వీరయోధులు ఆశ్చర్యంతో చూస్తుండగా అలా ఎనిమిది రథాలను విసిరివేసి, తన సారధి వేగంగా తెచ్చిన రథాన్ని అధిరోహించి భీముడు వ్యూహంలో ప్రవేశించాడు.** క్షత్రియులను మర్దిస్తూ, కౌరవ సేనావాహినిని మథిస్తూ కృతవర్మ భోజసేనను చీల్చి చెండాడి, దరదసేనను భయపెట్టి, అప్రతిహతంగా ముందుకు సాగిపోతున్నాడు. ఆనాడు భీముని నిలువరించిన వీరుడే లేడు. అలా వెళ్ళి ముందుగా సాత్యకిని, ఆ తరువాత అర్జునుని చూచి గొప్ప సింహనాదం చేశాడు. దానితో ధర్మరాజు అర్జునుడు క్షేమంగా ఉన్నట్లు తెలుసుకొని శాంతచిత్తుడయ్యాడు.

భీమసేనుని గర్జన విని కర్ణుడు భీకరంగా సింహనాదం చేస్తూ భీమునెదిరించి నిలిచాడు. అలా నిలిచిన కర్ణునిపై పదును పెట్టిన బాణాలను ప్రయోగించాడు భీముడు. కర్ణుడు కూడా ప్రతిగా అనేక బాణాలను భీమునిపై ప్రయోగించాడు. వారిరువురి సింహనాదాలకు, తీవ్ర శరవర్షానికి రథికులు, అశ్వికుల శరీరాలు కంపించాయి. యోధుల చేతులనుండి ధనుర్బాణాలు అప్రయత్నంగా జారిపోయాయి. ఆకాశం కాకులతో, గ్రద్దలతో నిండిపోయింది. కర్ణుడు 20 బాణాలతో భీముని 5 బాణాలతో సారథిని గాయపరచగా భీముడు 64 బాణాలతో కర్ణుని శరీరాన్ని గాయపరిచాడు. కర్ణుడు తిరిగి నాలుగు బాణాలు ప్రయోగించగా వాటిని మధ్యలోనే ఖండించిన భీముడు కర్ణుని ధనుస్సును 2 ముక్కలు చేశాడు. కర్ణుడు మరొక ధనుస్సుతో భీముని గాయపరిచాడు. దానితో భీముడు 3 బాణాలతో కర్ణుని ఛాతిపై కొట్టగా రక్తం బయటకు చిమ్మింది. దానితో కర్ణుడు తీవ్రక్రోధంతో వందల, వేల బాణాలతో భీముని కప్పివేశాడు. భీముడు కత్తితో కర్ణుని వింటి నారిని త్రెంచి, బల్లెంతో కర్ణ సారథిని పడగొట్టి, గుర్రాలను చంపివేశాడు. **వెంటనే కర్ణుడు రథం నుండి దూకి, భయంతో తన కుమారుడు వృషసేనుని రథమెక్కి తొలగిపోయాడు.** దానితో భీముడు సింహనాదం చేశాడు.(129 అ) –ఇది కర్ణుని మొదటి ఓటమి.

భీమసేనుడు ఎదురువచ్చిన వీరయోధులను ఎదుర్కొంటూ, దుర్యోధన సోదరుడు దుశ్శలుని శిరస్సు ఖండించి, త్వర త్వరగా కృష్ణార్జునులున్నచోటుకు వెళ్ళబోతుండగా తిరిగి వచ్చిన కర్ణుడు భీమునెదిరించి, అతడిపై గ్రద్ద రెక్కలు గల బాణాలను వర్షించాడు. "భీమా! అర్జునుని చూడాలన్న కోరికతో నాకు వెన్నుచూపుతావా? ఇది నీకు తగదు. నా ఎదుట నిలిచి నాతో పోరాడు" అన్నాడు. కర్ణుడు (ఇదే కర్ణుని అల్పబుద్ధి. కొద్దిసేపటిక్రితం ఈ భీమునితోనే పోరాడి, ఓడిపోయి, తన కుమారుని రథమెక్కి పారిపోయిన కర్ణుడు భీమునితో ప్రగల్భాలు పలుకుతున్నాడు–రచయిత) భీముడు కర్ణునిపై బాణవర్షం కురిపించాడు. యుద్ధాన్ని ముగించాలనే సంకల్పంతో కర్ణుని సంహరించివేయాలని తీవ్రంగా గాయపరిచాడు. కర్ణుడు అస్త్ర మాయతో ఆ బాణాలను ధ్వంసం చేశాడు. భీముడు వత్స దంతాలనే బాణాలతో తిరిగి కర్ణుని గాయపరిచాడు. కర్ణుడు 5 బాణాలతో భీముని

**సూక్తి**
అదృష్టవంతుడికి జాగ్రత్త తోడైతే
ఎడారిని కూడా స్వర్గం చేసుకోగలడు.

## మన ఇంటి వైద్యం

బ్రష్ చేసుకోవడానికి ముందు లవంగనూనెను వేలికి
అద్దుకొని, దంతాలను, చిగుళ్ళను మసాజ్ చేయాలి.
ఇలా చేయడం వల్ల దంతాలమీద మరకలు పోయి,
తెల్లగా మెరుస్తాయి.

టేబుల్ స్పూన్ శనగపిండిలో రెండు టీ స్పూన్ల పచ్చి
పాలు, మూడు చుక్కల నిమ్మరసం కలపాలి. ఈ మిశ్ర
మాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకొని, ఆరిన తర్వాత శుభ్ర
పరచుకోవాలి. ఈ విధంగా చేస్తుంటే చర్మకాంతి పెరుగు
తుంది.

గుర్రాలను వేధించి, భీముని రథం చుట్టూ బాణాల వలను
నిర్మించాడు. 64 బాణాలతో భీముని కవచాన్ని ముక్కలు చేశాడు.
భీముని మర్మస్థానాలను ఛేదించే బాణాలను వేశాడు. భీముడు
ఏమాత్రం తడబాటు లేకుండా కర్ణునికి దగ్గరగా నిలిచి 32
భల్లాలతో తిరిగి కర్ణుని గాయపరిచాడు. ఒకరి బాణాలనొకరు
ఖండిస్తూ, ఒకరి శరీరాన్ని మరొకరు గాయపరుస్తూ ఇద్దరూ
తీవ్ర యుద్ధం చేస్తున్నారు. భీముడు 8 బాణాలతో కర్ణుని మర్మ
స్థానాలలో కొట్టి, వెంటనే మరొక బాణంతో కర్ణుని ధనుస్సును
ఛేదించాడు. కర్ణుని రథసారథిని, అశ్వాలను వధించి, కర్ణుని
ఛాతీని గాయపరిచాడు. **భీమసేనుని బాడిబాణాలు కర్ణుని ఛాతీని
చీల్చి నేలపై పడ్డాయి. దానితో ధనుస్సు ముక్కలై, బాణపు దెబ్బ
తిని, తీవ్రంగా కలత చెందిన కర్ణుడు రథం భగ్నమైపోవటంతో
మరొక రథాన్ని అధిరోహించడానికి అక్కడినుండి తొలగి
పోయాడు. ఇది కర్ణుని 2వ ఓటమి** (131 అ).

సంజయుని ద్వారా యుద్ధవిశేషాలు వింటున్న ధృతరాష్ట్రుడు
"సాక్షాత్తూ పరమేశ్వరుని శిష్యుడైన పరశురాముని నుండి దివ్యాస్త్ర
విద్యలను నేర్చుకున్న కర్ణుని భీముడు తేలికగా ఓడిస్తున్నాడు.
సంజయా! నా కుమారునికి కర్ణుని మీదనే పెద్ద ఆశ. అటువంటి
కర్ణుడే భీముని చేతిలో ఓడి యుద్ధవిముఖుడైతే దుర్యోధనుడేమ
న్నాడు? అగ్నిలా ప్రజ్వలిస్తున్న భీమసేనుని చూసి ఆ తరువాత
కర్ణుడేమి చేశాడు?" అని అడుగగా సంజయుడు చెబుతున్నాడు.

కర్ణుడు మరొక రథాన్ని అధిరోహించి ఎగసిపడే సముద్రం
లా భీమునిపై దాడిచేశాడు. భీముడు సానపట్టిన ప్రకాశవంతమైన
బాణాల వలతో కర్ణుని రథాన్ని కప్పి సూర్యకాంతిని అడ్డుకున్నాడు.
రెండు మదపుటేనుగులు పోరాడినట్లు ఇరువురు ఒకరినొకరు
తీసిపోకుండా పోరాడుతున్నారు. కర్ణుడు 30 బాణాలతో భీముని
గాయపరచగా, భీముడు 3 వాడి బాణాలతో కర్ణుని ధనుస్సును
ముక్కలు చేసి, రథసారథిని ఒక భల్లంతో సంహరించాడు.
అప్పుడు కర్ణుడు శక్తిని పైకెత్తి భీమునిపైకి విసిరాడు. భీముడు
7 బాణాలతో ఆ శక్తిని ఆకాశంలోనే ఖండించాడు. కర్ణుడు ఒక
మహా చాపాన్ని ధరించి 9 శరాలను విడువగా, 9 బాణాలతో
భీముడు వాటిని ఖండించాడు. అంతటితో ఆగక కర్ణుని చాపాన్ని
మధ్యకు విరిచి, కర్ణుని గుర్రాలను యమపురికి పంపి, సారథిని
రథం పైనుండి పడగొట్టాడు. కర్ణుడు ఏంచేయాలో పాలుపోక
నిశ్చేష్టుడయ్యాడు. కర్ణుని హీనస్థితిని చూసిన దుర్యోధనుడు తన
సోదరుడు దుర్జయుని కర్ణునికి సాయంగా పంపించాడు. దుర్జ
యుడు వేగంగా వచ్చి భీముని ఎదిరించి 8 బాణాలతో భీముని
గుర్రాలను, 6 బాణాలతో సారథిని, 3 బాణాలతో ధ్వజాన్ని,
7 బాణాలతో భీముని కొట్టాడు. భీముడు దుర్జయుని మర్మస్థానా
లను ఛేదించి, సారథి, గుర్రాలతో పాటు దుర్జయుని శిరస్సును
ఖండించి సింహనాదం చేశాడు. **కర్ణుడు దీనుడై ఏడుస్తూ
దుర్జయుని శరీరానికి ప్రదక్షిణం చేశాడు. భీముడు కర్ణుని విరథుని
గావించి, బాణాలతో, శతఘ్నులతో కర్ణుని కప్పివేశాడు. భీముని
బాణాలతో గాయపడి కూడా కర్ణుడు రణభూమి విడిచి పారిపో
లేదు.** (133 అ) **ఇది కర్ణుని 3వ ఓటమి.**

భీముని చేతిలో పరాజితుడైన కర్ణుడు మరొక రథాన్ని ఎక్కి
మరల భీముని గాయపరిచాడు. భీముడు సూటిగా పయనించే
10 బాణాలతో ఎదుర్కొని, ధ్వజాన్ని ఖండించి, 63 బాణాలతో
కర్ణుని గాయపరిచాడు. దానితో కర్ణుడు శరీరాన్ని చీల్చివేయగల
బాణాన్ని భీమునిపై వేయటంతో అది భీముని శరీరాన్ని చీల్చి
భూమిలోనికి పోయింది. **భీముడు క్రోధంతో పెద్ద గదను విసి
రాడు. అది కర్ణుని గుర్రాలను చంపివేసింది. రెండు క్షురాలతో
కర్ణుని ధ్వజాన్ని పడగొట్టి, బాణాలతో సారథిని చంపాడు.
దానితో కర్ణుడు కలతచెంది రథంపై నుండి దుమికి ప్రాణాలు
దక్కించుకున్నాడు.** కర్ణుడు రథాన్ని కోల్పోవటం చూసిన దుర్యో
ధనుడు, తమ్ముడు దుర్ముఖుని కర్ణునికి సాయంగా పంపాడు.
దుర్ముఖుడు వస్తూనే భీముని నివారించి, తీవ్రబాణాలు ప్రయో
గించాడు. భీముడు బాణాలతో కర్ణుని నిరోధించి 9 బాణాలతో
దుర్ముఖుని చంపివేశాడు. ఇది కర్ణుని 4వ ఓటమి (134 అ)

దుర్ముఖుడు మరణించగానే కర్ణుడు అదే రథాన్ని ఎక్కి
దుర్ముఖుని మరణానికి దుఃఖిస్తూ ముహూర్తకాలం దాడిని ఆపి,
వేడి నిట్టూర్పులు విడుస్తూ కర్తవ్య విమూఢుడయ్యాడు. ఆ వ్యవధి
లోనే భీముడు గ్రద్ద రెక్కలు గల 14 బాణాలను కర్ణునిపై ప్రయో
గించి కర్ణుని కవచాన్ని ఛేదించాడు. ఆ బాణాలు కర్ణుని రక్తాన్ని
త్రాగాయి. అయినా కర్ణుడు చలించక 14 బాణాలతో భీముని
గాయపరిచాడు. ఆ బాణాలు భీముని కుడిభుజాన్ని చీల్చి భూమి
లోనికి చొచ్చుకుపోయాయి. ఆ గాయాలతో భీముడు నెత్తురోడ
సాగాడు. ఆ స్థితిలో భీముడు ప్రయత్న పూర్వకంగా 3 బాణాలతో
కర్ణుని, 7 బాణాలతో సారథిని గాయపరిచాడు. దానితో–

**సూక్తి** నీ పక్కవాడు త్వరగా మేల్కొంటే నీవూ త్వరగా మేల్కొంటావు. — ధ్యానమాలిక

శ్లో॥ స విహ్వాలో మహారాజ కర్ణో భీమశరాహతః
ప్రాద్రవజ్జ వసైనశ్వై రణం హిత్వా మహాభయాత్
(ద్రోణ.ప.134 అ.33 శ్లో)

**తా॥ భీమసేన బాణాఘాతాలతో దెబ్బతిన్న కర్ణుడు మహా భయంతో విహ్వాలుడై యుద్ధభూమిని విడిచి పారిపోయాడు. ఇది కర్ణుని 5వ ఓటమి.** (134 అ).

ఇది విన్ని ధృతరాష్ట్రుడు "సంజయా! రణభూమిలో వేగంగా పరాక్రమించగల కర్ణుడు ఎంత ప్రయత్నించినా భీముని మించ లేక మాటిమాటికి పరాజయం పాలై పారిపోతున్నాడంటే ఛీ! పౌరుషం దండగ. దైవమే శ్రేష్ఠమనిపిస్తుంది. బుద్ధిహీనుడైన దుర్యోధనుడు గతంలో నాతో ఇలా అన్నాడు. 'కర్ణుడు బలవం తుడు, శూరుడు, మేటి విలుకాడు, అలసటను జయించినవాడు, కర్ణుడు తోడుంటే దేవతలు కూడా యుద్ధంలో నన్ను గెలువలేరు. ఇక శక్తిహీనులు, వివేకహీనులు అయిన పాండవులెంత?' అని. **విషం లేని పాములాగా ఓడి రణభూమినుండి పారిపోయిన కర్ణుని చూసి దుర్యోధనుడేమన్నాడు? ఆ తరువాత యుద్ధం ఎలా జరిగింది?"** అన్నాడు ధృతరాష్ట్రుడు.

భీమసేనుని చేతిలో కర్ణుని ఓటమిని చూసిన దుర్యోధన సోదరులు దుర్మర్షణుడు, దుస్సహుడు, దుర్మదుడు, దుర్ధరుడు, జయుడు- ఈ ఐదుగురు భీమునెదిరించి శరవర్షం కురిపిం చారు. వారికి తోడుగా కర్ణుడు తిరిగి వచ్చి భీమునెదుర్కొన్నాడు. భీముడు 25 బాణాలతో గుర్రాలు, సారథులతో సహా భీకర ధనుస్సులు ధరించిన ఐదుగురు ధార్త రాష్ట్రులను యమసదనానికి పంపించాడు. తీవ్ర క్రోధంతో కర్ణుడు భీమునివైపుకు చూశాడు. భీముడు కోపంతో కన్నెర్రజేసి, వింటిని లాగి కర్ణునివైపు తీవ్రంగా చూసి కర్ణుని శరీరంపై పదునైన బాణాలు నాటాడు. రాధేయుడు 5 బాణాలతో భీముని గాయపరిచాడు. మరలా 70 బాణాలతో భీముని గాయపరచగా, దానిని లెక్కచేయకుండా వంగిన కణు పులు గల వంద బాణాలతో భీముడు కర్ణుని దేహాన్ని గాయపరి చాడు. ఒక భల్లంతో కర్ణుని ధనుస్సుని ఖండించాడు. కర్ణుడు మరొక ధనుస్సును చేబూని బాణాలతో భీముని కప్పివేయగా, భీముడు కర్ణుని గుర్రాలను, సారథిని చంపి బదులు తీర్చుకొని అట్టహాసం చేశాడు. తిరిగి కర్ణుని ధనుస్సును ఖండించటంతో కర్ణుడు రథం నుండి దిగి గదను పట్టి భీమునిపై విసిరాడు. తన మీదకు వచ్చే గదను భీముడు బాణాలతో ధ్వంసం చేశాడు. భీముడు వదిలిన వందలకొద్దీ బాణాలను తన బాణాలతో నిలువ రించి కర్ణుడు భీముని కవచాన్ని బ్రద్దలు చేశాడు. భీముడు కోపించి 9 బాణాలతో కర్ణుని కవచాన్ని ఛేదించి, ఎడమచేతిని చీల్చివేశాడు. **భీమసేనుని బాణసమూహాలు తనను కప్పివేయగా కర్ణుడు యుద్ధవిముఖుడై రణభూమి నుండి పారిపోయాడు. ఇది కర్ణుని 6వ ఓటమి.** (136 అ)

## వివేకామృతం



అనుభవించే ఆనందంలో లౌకికత ఎంత లోపిస్తే, మనం అంత ఆధ్యాత్మ పరులం. ప్రాపంచిక సుఖాల కోసం ప్రాకులాడడం మానేద్దాం.

సహృదయత నుండి భగవద్వాణి వినిపి స్తుంది. సంకుచితమైన బుద్ధినుండి వెలు వడేది మన స్వార్థమే.

కోరికలు క్షణికమైన సంతృప్తిలో అంతులేని దుఃఖాన్ని మోసుకొస్తాయి.

కర్ణుడలా పారిపోవటంతో దుర్యోధనుడు తన సోదరులు ఏడుగురిని కర్ణునికి సాయంగా భీమునిపైకి పంపాడు. చిత్రుడు, ఉపచిత్రుడు, చిత్రాక్షుడు, చారుచిత్రుడు, శరాసనుడు, చిత్రా యుధుడు, చిత్రవర్మ అనే ఆ ఏడుగురు సోదరులు రాగా భీముడు ఒక్కొక్క బాణంతో ఒక్కొక్కరిని చంపివేశాడు. అది చూసి కర్ణుడు దుఃఖిస్తూ, విదురుని మాటలను గుర్తుకు తెచ్చుకొన్నాడు. సిద్ధం చేయబడిన మరొక రథాన్నెక్కి కర్ణుడు భీమునెదిరించాడు. ఇరువురి మధ్య భీకరపోరు జరిగింది. బాణాలతో ఇద్దరి కవ చాలు బ్రద్దలయ్యాయి. శరీరాలు నెత్తురోడుతున్నాయి. ఇద్దరూ రెండు మేఘాల్లా శరవర్షం కురిపిస్తున్నారు. ఇద్దరూ సింహ నాదాలు చేస్తున్నారు. వేల బాణాలు ప్రయోగించి కర్ణుని కప్పి వేస్తున్న భీముని పరాక్రమాన్ని చూస్తూ అర్జున, కృష్ణ, సాత్యకులు ప్రశంసించారు.

తీవ్రకోపంతో కళ్ళు ఎర్రబడగా, మహాసర్పంలా బుస కొడుతూ, బాణాలను ప్రయోగిస్తూ కర్ణుడు భీముని కప్పి వేశాడు. యమునిలా వస్తున్న కర్ణునిపై భీముడు పదునైన బాణాలను విడిచాడు. తీవ్రంగా వారిరువురి మధ్య పోరు సాగుతుండగా దుర్యోధనుడు తన సోదరులు మరొక ఏడుగురిని కర్ణునికి రక్షణగా పంపించాడు. ఏడుగురు సోదరులు క్రుద్ధులై భీముని శరవర్షంలో ముంచెత్తారు. భీముడు చలించని పర్వతంలా నిలిచి ఆ ఏడుగురిపై పదునైన 7 బాణాలను ప్రయోగించగా అవి వారి గుండెలను చీల్చి గగనంలో చరించే గరుడ పక్షుల్లా ప్రకా శించాయి. మర్మస్థానాలు బ్రద్దలై ఆ ఏడుగురూ రథాలనుండి నేలకూలి మరణించారు. శత్రుంజయుడు, శత్రుసహుడు, సహుడు, వాతవేగుడు, ధృవుడు, చిత్రసేనుడు, వికర్ణుడు అనే ఏడుగురు మరణించడంతో కర్ణుడు తీవ్రశోకంలో మునిగి పోయాడు. **అయితే వికర్ణుని చంపవలసివచ్చినందుకు భీముడు కూడా తీవ్రశోకానికి గురయ్యాడు. "సోదరా! క్షత్రియధర్మాన్ని** అనుసరించి మా హితాన్ని కోరుకునే నిన్ను కూడా చంపవలసి

**సూక్తి** విద్యను పదిమందికీ పంచు. అది మరింత రాణిస్తుంది.

**వచ్చింది. క్షత్రియధర్మం చాలా నిష్ఠురమైనది" అంటూ కంటతడి పెట్టాడు భీముడు.**

అదే సమయంలో తన సోదరులు 31 మంది చనిపోవటాన్ని చూసిన దుర్యోధనుడు 'విదురుడు చెప్పిన హితవచనం ఇలా వాస్తవరూపాన్ని ధరించింది' అంటూ తీవ్రదుఃఖంలో మునిగి పోయాడు.(137అ).

వరుస అపజయాలతో రెచ్చిపోయిన కర్ణుడు విచిత్ర బాణ వృష్టిని కురిపిస్తూ భీముని తీవ్రంగా గాయపరిచాడు. భీముడు ఏమాత్రం చలించక ఒక బాణంతో కర్ణుని చెవిపై కొట్టడంతో అందమైన కర్ణుని కుండలం తెగి నేలపై పడిపోయింది. మరొక భల్లంతో భీముడు కర్ణుని ఛాతీపై కొట్టాడు. ఆ తర్వాత కుబుసం విడిచిన పాముల వంటి 10 బాణాలు కర్ణుని లలాటాన్ని చీల్చి పుట్టలో దూరిన పాముల లాగా అక్కడే గ్రుచ్చుకున్నాయి. కర్ణుడు రెండు ఘడియలు మూర్ఛిల్లి, తిరిగి స్పృహలోనికి వచ్చాడు. తీవ్రక్రోధంతో భీముని మీదకు దూసుకుపోయి గ్రద్ద ఈకలుగల వందబాణాలను భీమునిపై ప్రయోగించాడు. భీముని వక్షస్థలంపై 9 బాణాలతో కొట్టాడు. **అప్పుడు భీముడు ఒక క్షురప్రంతో కర్ణుని ధనుస్సును ఖండించి సింహనాదం చేశాడు. కర్ణుడు దానిని విడిచి అత్యంత వేగంతో మరొక వింటిని చేత ధరించాడు. ఆ ధనుస్సును కూడా భీముడు అర్థనిమిషంలో ఖండించాడు.**

*శ్లో॥ తృతీయంచ చతుర్థంచ పంచమం షష్ఠమేవహి*
*సప్తమంచాష్టమంచైవ నవమం దశమం తథా*
*శ్లో॥ ఏకాదశం ద్వాదశంచ త్రయోదశ మథాపి చ*
*చతుర్దశం పంచదశం షోడశంచ వృకోదరః*
*శ్లో॥ తథా సప్తదశం వేగా దష్టాదశమథాపి వా*
*బహూని భీమశ్చిచ్ఛేద కర్ణస్యైవం ధనూంషి హి*
(ద్రోణ ప.139 అ.20-21-22శ్లో)

**తా॥ అదే విధంగా భీముడు మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు, పన్నెండు, పదమూడు, పద్నాలుగు, పదిహేను, పదహారవ ధనుస్సును కూడా ఖండించాడు. అలాగే కర్ణుని పదిహేడవ ధనుస్సును, పద్దెనిమిదవ ధనుస్సును కూడా వేగంగా ఖండించి ఇంకా ఎన్నో ధనుస్సులను ఖండించాడు భీమసేనుడు.**

అయితే అర్ధనిముషంలోనే మరొక వింటిని ధరించి నిలిచిన కర్ణుడు కురు, సౌవీర, సింధు సేనల వినాశనాన్ని చూసి కోపంతో ప్రజ్వలిస్తూ, భీముని ఘోరదృష్టితో చూశాడు. తీవ్రక్రోధంతో నిరంతర బాణవర్షం కురిపించాడు. కర్ణుడు చేతిలోకి బాణాలు తీసుకోవటం, ఎక్కుపెట్టటం, లాగటం, విడవటం- ఈ పనుల మధ్య వ్యవధే కనిపించడం లేదు. కుడి ఎడమల రెండువైపులా బాణాలు ప్రయోగిస్తున్న కర్ణుని ధనుస్సు మండలాకారంలో అగ్నిచక్రంలా భయంకరంగా తిరుగుతున్నది. కర్ణుడు విడిచిన బాణాలు ఆకాశంలో మిడుతల దండులా ప్రకాశించాయి. కర్ణుడు బాణవృష్టితో భీముని కప్పివేశాడు. ఆ బాణవృష్టిని లెక్కచేయ కుండా భీముడు కర్ణునిపై దాడిచేశాడు. కర్ణుని బాణాలను ఆకాశం లోనే ముక్కలు చేశాడు. కర్ణుడు అస్త్రాలను ప్రయోగించగా భీముడు తన అస్త్రాలతో వాటిని నిరోధించి, బాణాలతో కర్ణుని గాయపరిచాడు. కర్ణుడు తన అస్త్రమాయతో భీముని రెండు అమ్ములపొదులను, అల్లెత్రాటిని, కళ్ళాలను, గుర్రాల జీనులను ఖండించాడు. ఆ తరువాత భీముని గుర్రాలను చంపి, 5 బాణా లతో సారథిని తీవ్రంగా గాయపరిచాడు. ఆ సారథి అక్కడినుండి పారిపోయి యుధామన్యుని రథమెక్కాడు. ఆ వెంటనే కర్ణుడు భీముని రథాన్ని ధ్వంసం చేశాడు. భీముడు నేలపై నిలిచి శక్తిని ప్రయోగించగా కర్ణుడు దానిని దారిలోనే ఖండించాడు. అంత భీముడు కత్తిని, డాలును చేతబట్టగా కర్ణుడు డాలును బ్రద్దలు చేశాడు. భీముడు కోపంతో కత్తిని వేగంగా త్రిప్పి కర్ణుని రథంపై ప్రయోగించాడు. అది కర్ణుని ధనుస్సును ఖండించింది. కర్ణుడు మరొక ధనుస్సును చేతబట్టి వేలకొలది బాణాలను భీమునిపై ప్రయోగించాడు. ఆ బాణాలతో గాయపడిన భీముడు కర్ణుని పట్టుకొనటానికి పైకి ఎగిరాడు. ఆ భీముని చేష్టను గమనించిన కర్ణుడు శరీరమంతా బాధకు గురికాగా రథం వెనుక నక్కి కూర్చు న్నాడు. కర్ణుని పట్టదలచిన ఆ భీముని చేష్టను కురువంశస్థులు, చారణులు అభినందించారు.

ఆ సమయంలో భీముని శస్త్రాలన్నీ అయిపోయాయి. కర్ణుడు యుద్ధం చేస్తూనే వున్నాడు. (యుద్ధం జరుగుతున్నది కౌరవ సేనావాహినిలో) ఆ సమయంలో రథమార్గానికి ఆటంకం కలి గించటానికి అర్జునుడు చంపిన ఏనుగులు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. భీముడు ఆ ఏనుగుల సమూహాల మధ్య నిల్చి, కర్ణుని రథం తనపైకి రాకుండా చూసుకున్నాడు. కర్ణుని బాణాల నుండి తప్పించుకోవటానికి ఒక ఏనుగును ఎత్తిపట్టుకున్నాడు భీముడు. కర్ణుడు ఆ ఏనుగు శవాన్ని ముక్కలు చేయగా ఆ అవ యవాలను కర్ణునిపైకి విసిరాడు భీముడు. ఆపై నేలపై ఏది కనిపిస్తే దాన్ని విసిరాడు. భీముడు విసిరిన వాటినన్నిటినీ కర్ణుడు తన బాణాలతో ఖండించాడు. దానితో భీముడు పిడికిలి బిగించి, వజ్రసమానమైన భయంకరమైన గ్రుద్దుతో కర్ణుని చంపదలచి, అంతలో అర్జునుని ప్రతిజ్ఞను తలచుకొని, కర్ణుని చంపగలిగే తాను చంపలేదు. అలాగే కుంతీదేవికిచ్చిన మాటప్రకారం కర్ణుడు నిరాయుధుడైన భీముని చంపలేదు. భీముని దగ్గరకెళ్లి వింటి కొనతో భీముని శరీరాన్ని తాకాడు. సర్పంలా బుసకొడుతూ భీముడు ఆ ధనుస్సును లాగి దానితో కర్ణుని తలపై కొట్టాడు. **అప్పుడు భీముని ఎగతాళిచేస్తూ కర్ణుడు "ఓ మూర్ఖా! నపుంసకా! తిండిపోతా! అస్త్రవిద్య తెలియని నీకు నాలాంటివాడితో యుద్ధ మెందుకు? హాయిగా రకరకాల భోజన పదార్థాలున్నచోటికి**


సూక్తి: అహింసకంటే శ్రేష్ఠమైన ధర్మం లేదు హింసకన్నా అధర్మం లేదు.

## అమ్మ

**మ**నిషికి పేగుబంధం అమ్మ
ప్రేమ స్వరూపిణి అమ్మ
అద్భుతమైన అనుభూతి అమ్మ
మమతల కోవెల అమ్మ
మానవత్వానికి ప్రతిబింబం అమ్మ
అనురాగానికి చిరునామా అమ్మ
ఆనందదాయని అమ్మ
కరుణాంతరంగిణి అమ్మ
ఓర్పుకు ప్రతిరూపం అమ్మ
బాల్యంలో యవ్వనంలో



గుండెలపై తన్నిన బిడ్డను
ప్రేమతో అక్కున చేర్చుకునే
సహనశీలి అమ్మ
క్షమాగుణం అమ్మకే సొంతం
దయాశీలత అమ్మ సహజ స్వభావం
ఇంట్లో వుంచుకున్నా
వృద్ధాశ్రమంలో వుంచినా
అమ్మ మనసు పొరల్లో
నిరంతరం నిక్షిప్తమై వుండేది
సముద్రమంత ప్రేమే!

**-విడదల సాంబశివరావు**

**పో..లేదా కందమూలాలు తినటానికి అరణ్యానికిపో. ఆయుధం పట్టటానికి నీవు తగినవాడికి కాదు. ఇంకెవరితోనైనా యుద్ధం చెయ్యి. నాలాంటి వీరుడితో తలపడితే ఇంతేగతి". ఆ మాటలకు భీముడు "ఓరి దుష్టుడా! ఇంతకుముందు ఎన్నిసార్లు ఓడి పారి పోయావు. ఇప్పుడీ ప్రగల్భాలు పలుకుతున్నావు. ఆయుధాలతో పనిలేదు. నాతో మల్లయుద్ధానికి రా! రాజులందరూ చూస్తుండగా నిన్ను కీచకుని చంపినట్లు చంపుతాను" అన్నాడు. (కీచకుని శరీరం మొత్తాన్ని ఒక్కటే మాంసపుముద్దచేసి, కాళ్ళు చేతులు ఆ ముద్దలోనికి నెట్టి చంపాడు భీముడు) 'భీముని అభిప్రాయం ఇది' అని గ్రహించిన కర్ణుడు అందరూ చూస్తుండగానే యుద్ధాన్ని విరమించి అక్కడినుండి వెళ్ళిపోయాడు.**

విశ్లేషణ : అస్త్రశస్త్ర విద్యలలో ఆరితేరిన మహాపరాక్రమశాలి, మహాబలుడు అయిన కర్ణుడు ఒకేరోజు (14వ రోజు సగం రోజు గడిచిన తర్వాత) సూర్యాస్తమయానికి ముందుగా-అంటే దాదాపు 4 గంటలపాటు భీమునితో యుద్ధం చేసి, పరాజయం చెందటం, పారిపోవటం-అదీ శస్త్రవిద్యలోను అస్త్రవిద్యలోను ఓడటం ప్రత్యేకంగా గమనించదగిన విషయం. అంతేగాక పట్టిన ధనుస్సును పట్టినట్లు 18 ధనుస్సులను ముక్కలు చేయటం భీమసేనుని బాణవిద్యా కుశలతకు నిదర్శనం. ఈ భీమసేన పరాక్రమాన్ని- కర్ణుని అపజయాన్ని గ్రంథం చూసినవారికే గాని, సినిమాలు, సీరియల్స్ మాత్రమే చూసేవారికి తెలిసే వీలులేదు.

కర్ణుని పరాక్రమం సంగతి అటుంచితే అతడు ఎలాంటి ప్రగల్భాలు పలికేవాడో ఈ 14వరోజు యుద్ధసందర్భంలో చివ రన భీమునితో పలికిన పలుకులే నిదర్శనం. "ఇవి ప్రగల్భాలు కాదు, నిజంగా భీముడు కర్ణునితో యుద్ధం చేయటానికి సమర్థుడు కాదు అని రెటమతంగా వాదించే వారికోసం కర్ణుడే స్వయంగా చెప్పిన మాటలేమిటో చూద్దాం".

భీముని ఎగతాళి చేస్తూ అలా పలికి యుద్ధవిముఖుడై కర్ణుడు వెళ్లిపోయిన తరువాత అర్జునుడు తన ప్రతిజ్ఞను నెరవేర్చుకోవ టానికి సైంధవుని చంపటానికి వేగంగా ముందుకు వెళుతు న్నాడు. ఆనాడు శ్రీకృష్ణుడు రథాన్ని ఎలా నడుపుతున్నాడంటే-2 క్రోసులదూరంలో వున్న శత్రువులపై అర్జునుడు బాణప్రయోగం చేసినప్పుడు ఆ బాణం శత్రువును తాకే లోపల రథం ఆ శత్రు వును దాటిపోతున్నది. అది శ్రీకృష్ణుని రథచాలన నైపుణ్యం. కౌరవసేన శకట వ్యూహంలో సూచీవ్యూహం, పద్మవ్యూహం, గుప్తవ్యూహం, అంతర్గతంగా ఏర్పరచి ఆ గుప్తవ్యూహంలో సైంధ వుని ఉంచి, చుట్టూ ఆరుగురు మహాయోధులు రక్షణగా వున్నారు. అంటే అర్జునుడు కౌరవసేనా వ్యూహంలో ప్రవేశించి 12 క్రోసుల దూరంలో కనిపించకుండా దాగివున్న సైంధవుని చంపాలి. దారిలో ఎదురువచ్చిన వీరులతో యుద్ధం చేయాలి. అందుకే ఆ దూకుడు. అలా అర్జున రథం సైంధవుని వైపుకు దూసుకుపోతుంటే ప్రమాదాన్ని గ్రహించిన దుర్యోధనుడు కర్ణు నితో, "కర్ణా! కోరుకున్న యుద్ధం తటస్థించింది. నీ బలాన్ని, పరాక్రమాన్ని ఇప్పుడు చూపించు. అర్జునుడు సైంధవుని చంప టానికి వీలులేకుండా నీవు నిరోధించాలి. ఇక సూర్యాస్తమయానికి కొద్ది సమయమే మిగిలివుంది. నీ బాణసమూహంతో శత్రువును చంపే సమయం ఇదే. ఈ కొద్ది సేపు గడిచిందా! మనం తప్పక గెలిచినట్లే. సూర్యాస్థమయం దాకా సైంధవుని మనం రక్షించు కోగలిగితే ప్రతిజ్ఞను పూర్తిచేయలేని అర్జునుడు అగ్నిలో దూకు తాడు. అర్జునుడే మరణిస్తే అతని సోదరులు ఈ భూమిపై ఒక్క క్షణం జీవించరు. పాండవులు మరణించగానే పర్వత కాన నాలతో కూడిన ఈ సమస్త భూమిని మనమే పరిపాలించు కుంటాం. ఆత్మవినాశం కోసమే అర్జునుడు ఇలాంటి ప్రతిజ్ఞ **చేశాడు. నీవు జీవించి వుండగా అర్జునుడు సూర్యాస్తమయం లోపల సైంధవుని ఎలా చంపగలడు? కనుక నీ సర్వశక్తులు ధారపోసి అర్జునునితో పోరాడు" అన్నాడు.**

**దానికి కర్ణుడు "దుర్యోధనా! ఈరోజు మేటి విలుకాడైన భీముడు యుద్ధంలో బాణసమూహాలతో నా శరీరాన్ని చాలాసార్లు తీవ్రంగా గాయపరిచాడు. రణభూమిలో ఉండక తప్పదు అనే భావనతోనే ఇప్పుడు నిలిచివున్నాడు. అతడి బాణాలు నా**



**సూక్తి** జీవులను చంపి జీవులకు పెడితే
పాపంలో చిక్కుకుంటావు.

శరీరాన్ని దహించివేశాయి. నా శరీరం అసలు కదలటం లేదు. అయినా నా శక్తివంచనలేకుండా పోరాడుతాను" అన్నాడు. దీనినిబట్టి కర్ణుని అప్పటిమాటలు ప్రగల్భాలో కాదో మనకు తెలుస్తుంది. నోటికి వచ్చినట్లు వదరటం కర్ణునికి అలవాటే.

ఇక కర్ణుని పరాక్రమం గురించి చెప్పాల్సివస్తే అతడు మహా వీరుడు, శస్త్రాస్త్ర సంపన్నుడు, శౌర్యధనుడు-అనటంలో సందేహం లేదు. అయితే అర్జునునితోనో, అభిమన్యునితోనో, భీమునితోనో పోల్చినప్పుడు మాత్రం అతడు వారికన్నా గొప్ప వాడూ కాదు, సమానుడూ కాదు అని భారతం మనకు తెలియ జేస్తున్నది. ఒక్కసారైనా వారిని జయించలేదు, వారిచేతిలో అనేక సందర్భాలలో పరాజితుడయ్యాడు. అర్జునుని ఎప్పుడూ జయించ లేదు, అర్జునుని జయించిన వారినీ (అట్టివారెవరూ లేరు) ఎప్పుడూ జయించలేదు. అయితే ధర్మరాజును, నకుల సహదేవు లను పరాజితులను చేశాడు. తల్లికిచ్చిన మాటప్రకారం చంప కుండా వదిలివేశాడు. ఇంకా సాత్యకితో కొన్ని సందర్భాలలో ఓడి, కొన్ని సందర్భాలలో సమాన పరాక్రమం చూపాడు. దృష్ట ద్యుమ్నునీ ఓడించగలిగాడు. ఐతే ద్రుపదునితో, గంధర్వులతో ఓడి పారిపోయాడు. అనేక రాజులనూ జయించాడు. అభిమన్యుని ఆరుగురు యోధులతో కలిసి, వెనుకనుండి ధనుస్సును కొట్టి అతడి మరణానికి కారకుడయ్యాడు. ఒక్కసారి కూడా భీమార్జున అభిమన్యులను గెలువలేనివాడు వారితో సమానమెలా అవుతాడు? ఇంతటితో ఈ అంశాన్ని ముగిస్తున్నాం.

**(మరొక అంశంతో వచ్చేసంచిక నుండి)**

# పామరుడి మాట

-బెహరా ఉమామహేశ్వరరావు

సిరిపురం గ్రామం నుండి శంభుదత్తుడు, శివదత్తుడు శ్రీముఖలింగం క్షేత్రానికి బయలుదేరారు. వారు శివరాత్రి పర్వదినాన శివుని దర్శనం కోసం మూడురోజుల ముందుగా కాలినడకన వెళుతున్నారు. ఆ రోజుల్లో ప్రయాణ సాధనాలు లేవుకదా! ఒకరికొకరు తోడుగా మాట్లాడుకుంటూ సాగిపోతున్నారు. మబ్బులు కూడా వారి ప్రయాణానికి సహకరించాయి.

వారు సింగుపురం గ్రామం చేరుకున్నారు. ఆ ఊరి పెద్ద శివయాత్రికులకోసం బసతోపాటు భోజన వసతి ఏర్పాటు చేశాడు. శంభుదత్తుడు, శివదత్తుడు ఆరాత్రి అక్కడే గడపాలని అనుకున్నారు. ధర్మసత్రం చేరారు. వారికి చిన్న సందేహం కలిగింది.

"తూర్పు దిక్కు ఇటు" అంటూ ఓ వైపు చూపిస్తూ అన్నాడు శంభుదత్తుడు.

"కాదు! కాదు! ఇటు!" అన్నాడు మరోవైపు చూపిస్తూ శివదత్తుడు.

అక్కడే వున్న బసలో పనిచేస్తున్న పనివాడు శ్రీహరి "అటుకాదు ఇటు కాదు" అన్నాడు.

"అటు కాదు, ఇటు కాదు! ఏమిటి? పైగా నీవు పనివాడవు" కోపంగా అన్నాడు శంభుదత్తుడు.

"మేం పండితులం! మాకు నీ సలహా ఏమిటి?" శివదత్తుడు అరిచాడు.

"బాబులూ! చాలాదూరం నడచి వచ్చారు. మీకు రాత్రికి తిండి తెస్తాను. అంటే పండ్లు, ఫలాలు తేవాలి. రేపు ఉదయం మాట్లాడుకోవచ్చు. పైగా ఇంకా దూరం వెళ్లాలి" శ్రీహరి చేతులు కట్టుకుని వినయంగా చెప్పాడు.

రాత్రికి ఆహారం తీసుకుని నడుం వాల్చారు. హాయిగా నిద్రపోయారు. కోడికూత వారికి వినిపించలేదు. మత్తునిద్ర పట్టింది. తెల్లవారింది. ఇద్దరూ కనులు తెరిచారు. ఇంతలో పనివాడు శ్రీహరి వచ్చాడు. వారితో 'స్వాములూ లేవండి. సూర్యోదయం అయింది' అన్నాడు.

'శివ శివా!' ఆవలింతలు తీస్తూ ఇద్దరూ లేచారు.

"అదిగో సూర్యుడు ఉదయించాడు చూడండి. అదే తూర్పుదిక్కు. నిన్న వాదులాడారు కదా! ఇప్పుడు తెలిసిందా?" నవ్వుతూ అన్నాడు శ్రీహరి.

"ఈ మాట నిన్ననే చెప్పవచ్చు కదా!" అన్నాడు శంభుదత్తుడు చిరాకు పడుతూ.

"సూర్యుడు తూర్పున ఉదయిస్తాడని మాకు తెలుసులే" నిర్లక్ష్యంగా అన్నాడు శివదత్తుడు.

మీరు మహాపండితులు, మీకు నేను ఏమి చెప్పగలను. ఈ పామరుడు చెప్పినా మీరు వింటారా? ఆయన చెప్పిన అటూ కాదు, మీరు ఇటూ కాదు. నిన్న నేను చెప్పినా మీరు వినరని తెలిసే ఇప్పుడు చెబుతున్నాను" అన్నాడు శ్రీహరి.

ఇరువురు పండితుల ముఖాలు చిన్నబోయాయి, సిగ్గుపడక తప్పలేదు.

బాలలూ! ఎంత పండితులైనా ఎదుటివారి మాట వినాలి. ❋

**సూక్తి** గణితం అన్ని శాస్త్రాలకు తాళం చెవి వంటిది — ధ్యానమాలిక